www.prajasakti.com

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 39 Vol సంచిక : 35 No | విజయవాడ, మంగళవారం 5 ఫిబ్రవరి 2019 | 12 + 12 పేజీలు వెల : 4.00 Rs.

అరిష్టదాయకం

- బెంగాల్ పరిణామాలపై సిపిఎం పొలిట్ బ్యూరో
- బిజెపియేతర ప్రభుత్వాలపై నిరంకుశ దాడులు

8

గత ఎన్నికల్లో బిజెపి నన్ను వాడుకుంది

- ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే



8

పార్లమెంటులో
బెంగాల్ దుమారం

- రాజ్యాంగ సంక్షోభం నెలకొందన్న రాజ్‌నాథ్
- కేంద్రం ఆదేశాలతో నివేదిక పంపిన గవర్నర్
- సిబిఐ పిటిషన్‌పై నేడు విచారణ
- కొనసాగుతున్న మమత దీక్ష
- కేంద్ర నిధులు తీసుకునేది లేదని ప్రకటన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పశ్చిమబెంగాల్‌లో చోటుచేసుకున్న సిబిఐ వర్సెస్ మమతాబెనర్జీ వ్యవహారం సోమవారం పార్లమెంటును ఒక్క ఊపు ఊపింది. నరేంద్రమోడీ ప్రభుత్వ ఉద్దేశ్యపూర్వకంగానే వేధింపు చర్యలకు దిగుతోందని పేర్కొంటూ . తృణమూల్ ఎంపిలు చేసిన ఆందోళనతో పార్లమెంటు దద్దరిల్లింది. ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకుండానే ఉభయ సభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. మరోవైపు మమతాబెనర్జీ కోల్‌కతాలో చేపట్టిన దీక్ష కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం నుండి అందిన ఆదేశాలతో గవర్నర్ ఆదివారం నాడు చోటుచేసుకున్న పరిస్థితులపై నివేదికను పంపారు. తమ అధికారులను రాష్ట్ర పోలీసులు అడ్డుకుని, అదుపులోకి తీసుకోవడంపై సిబిఐ అధికారులు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ నేడు విచారణకు రానుంది. సోమవారం సభ ప్రారంభం కాగానే తృణమూల్ ఎంపిలు లోక్‌సభలో ఆందోళనకు దిగారు. ప్రశ్నోత్తరాల తరువాత చర్చ చేపడదామని స్పీకర్ సుమిత్రా మహజన్ పేర్కొన్నా వారు ఆందోళన కొనసాగించారు. దీంతో స్పీకర్ సభను 12 గంటలకు వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభం కాగానే టిఎంసి ఎంపీ సౌగతా రాయ్ మాట్లాడుతూ తాజా పరిణామాలపై ప్రధాని మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీనికి కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందిస్తూ సిబిఐ అధికారులను విధులు నిర్వర్తించకుండా అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. పశ్చిమ బెంగాల్‌లో రాజ్యాంగం సంక్షోభం నెలకొందని వ్యాఖ్యానించారు.



దీక్షా శిబిరంలో ప్రసంగిస్తున్న బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

విధులు నిర్వర్తించకుండా సిబిఐ అధికారులను అడ్డుకోవడం ఇంతకుముందెన్నడూ జరగలేదన్నారు. దీనిపై చర్యతీసుకునే అధికారం కేంద్రానికి ఉందన్నారు. కోల్‌కతా పోలీసుల చర్య దేశ సమాఖ్య రాజకీయ వ్యవస్థకు ప్రమాదం కలిగిం చేదిలా ఉందని వ్యాఖ్యానించారు. ఏ ప్రాంతంలోనైనా సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు కేంద్రానికి ప్రత్యేకాధికారాలు ఉన్నాయని రాజ్‌నాథ్ అన్నారు. రాజ్‌నాథ్ ప్రసంగాన్ని తృణమూల్ నేతలు అడ్డుకోవడంతో మళ్లీ సభలో గందరగోళం నెలకొంది. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో ఎలాంటి మార్పు రాకపోవడంతో మంగళవారానికి వాయిదా వేశారు. అంతకు ముందు కాంగ్రెస్ పక్షనేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ సిబిఐను ఉపయోగించుకొని ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మిగతా 9లో

ప్రకాశంలో
కుల దురహంకార హత్య

- కుమార్తెను చంపిన తండ్రి



ప్రజాశక్తి-తాళ్లూరు (ప్రకాశం)

తమ కంటే తక్కువ సామాజిక తరగతికి చెందిన యువకుడిని ప్రేమించిందనే దురహంకారంతో తండ్రే కూతురిని చంపేశాడు. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం కొత్తపాలెంలో సోమవారం వెలుగుచూసిన ఈ ఉదంతం తీవ్ర సంచలనానికి దారితీసింది. విఆర్ఒ యల్లమందారెడ్డి కథనం ప్రకారం.. కొత్తపాలేనికి చెందిన కె వెంకారెడ్డి, విజయమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్దకుమార్తెకు పెళ్లి చేశారు. రెండో కుమార్తె వైష్ణవి(20) ఒంగోలులోని శ్రీహర్షిణీ డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతోంది. అదే క్లాస్‌లో ఉన్న సునీల్, వైష్ణవి ఏడాదిగా ప్రేమించుకుంటున్నారు. . ఈ వ్యవహారం వైష్ణవి ఇంట్లో తెలిసింది. పదిరోజుల క్రితం ఎవరికి చెప్పకుండా ఇద్దరూ తిరుపతికి వెళ్లారు. విషయం తెలుసుకున్న అమ్మాయి తండ్రి ఇంటికి తిరిగి తీసుకొచ్చారు. అయితే కొద్ది రోజులు కళాశాలకు పంపకుండా ఇంటికి పరిమితం చేశారు.. తాను చెప్పిన వ్యక్తినే పెళ్లిచేసుకోవాలని వెంకారెడ్డి హెచ్చరించాడు. రెండు రోజుల నుండి మళ్లీ కళాశాలకు పంపుతున్నారు. ఈ నేపథ్యంలో వైష్ణవి, సునీల్ శనివారం రాత్రి శ్రీశైలం వెళ్లేందుకు బస్సు ఎక్కగా, విషయం తెలుసుకున్న వెంకారెడ్డి మార్గమధ్యంలో మార్కాపురంలో వీరి అచూకీ తెలుసుకుని వైష్ణవిని తిరిగి తీసుకొచ్చాడు. ఇదే విషయమై ఆదివారం రాత్రి వైష్ణవి, కుటుంబ సభ్యుల మధ్య వివాదం జరిగింది. ఇంట్లో నిద్రిస్తున్న కుమార్తెను అర్ధరాత్రి ఒంటిగంటి సమయంలో ఆమె తండ్రే గొంతు నులిమి చంపేశాడు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నాడు. దరిశి సిఐ ఎం.శ్రీనివాసరావు, తాళ్లూరు ఎసై డి.రంగనాథ్ దర్యాప్తు చేస్తున్నారు.

మణిహారంలా ఖిల్లా

కొండపల్లి ఫోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేస్తాం : సిఎం 12



అనిల్ దివాలా పిటిషన్
కుప్పకూలిన ఆర్‌కామ్ షేర్లు

- ఇంట్రా ట్రేడింగ్‌లో 54% పతనం
- అడాగ్ ఇతర షేర్లు ధమాల్



6

9న రాష్ట్రమంతటా 10న గుంటూరులో
మోడీ వ్యతిరేక నిరసనలు

వామపక్షాల పిలుపు 2

బిహెచ్‌యులో దళిత ప్రొఫెసర్‌పై
కాషాయ గూండాల దాడి

బూట్ల దండతో ఊరేగింపు 8

2.26 లక్షల కోట్లు!

- ఓట్ ఆన్ అక్కౌంట్ కసరత్తు పూర్తి
- నేటి ఉదయం 11.45కు శాసనసభలో
- యువత, మహిళ, రైతులపై వరాల జల్లు!
- 'ఓట్ల' పథకాలకే ప్రాధాన్యత

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎన్నికల వేళ భారీ బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం 2,26,180 కోట్ల రూపాయలతో బడ్జెట్ ప్రతిపాదనలను ఆర్థికశాఖ తయారు చేసింది.రెవిన్యూ వ్యయం 1.80 లక్షల కోట్ల రూపాయల గానూ, పెట్టుబడి వ్యయం 29,600 కోట్ల రూపాయలుగానూ ప్రతిపాదించినట్లు తెలిసింది. ఓట్ ఆన్ అక్కౌంట్‌లో భాగంగా ఏడాది మొత్తానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆరునెలల ఖర్చులకు శాసనసభ అనుమతిని రాష్ట్ర ప్రభుత్వం పొందాల్సి ఉందన్న సంగతి తెలిసిందే. ఈ మేరకు రూపొందించిన ప్రతిపాదనలను ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు మంగళవారం ఉదయం 11.45 గంటలకు శాసనసభలో, శాసన మండలిలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ ప్రవేశపెట్టనున్నారు. 2018-19 ఆర్థికసంవత్సరంలో 1.58 లక్షల కోట్ల రూపాయలు రెవిన్యూ వ్యయంగా ఉండగా, రానున్న ఆర్థిక సంవత్సరానికి ఆ మొత్తం 1.80 లక్షల కోట్లకు చేరుకోవడానికి ఓట్ల పథకాలకు ప్రాధాన్యత ఇవ్వడమే కారణమని తెలిసింది. వివిధ వనరుల ద్వారా రాష్ట్రానికి వచ్చే మొత్తం ఆదాయం 2.25 లక్షల కోట్లు ఉంటుందని అంచనా వేసినట్లు సమాచారం. ఫిబ్రవరి చివరిలోగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో వివిధ వర్గాలకు భారీ నజరానాలు ప్రకటించే అవకాశాలున్నాయి. యువత, రైతు, మహిళలకు కొత్త పథకాలు ప్రకటించడంతో పాటు భారీ కేటాయింపులు ఉంటాయని తెలుస్తోంది. ప్రధానంగా రైతు సాయం పేరిట ఎకరాకు 12వేల రూపాయలు ఇవ్వాలన్న ఆలోచనను బడ్జెట్‌లో ప్రతిపాదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. నీటిపారుదల రంగానికి కూడా కొంత నిధులను పెంచే అవకాశాలున్నాయి. సాంఘిక సంక్షేమం, బిసి సంక్షేమం,వ్యవసాయం, యవజన సంక్షేమం వంటి వాటికి మిగతా 9లో

సమ్మెతో ప్రభుత్వం మెడలు వంచాలి



సదస్సులో మాట్లాడుతున్న మధు

ఆర్టీసి జెఎసి సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసి కార్మికులు సమ్మెతో టిడిపి ప్రభుత్వం మెడలు వంచాలని సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు పి మధు, కె రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆర్టీసి జెఎసి ఆధ్వర్యంలో సమ్మెకు మద్దతుగా రాజకీయ పార్టీల, ట్రేడ్ యూనియన్ల సదస్సును విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఆర్టీసి కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వానికి లెక్కలేకుండా పోతోందని అన్నారు. సిపిఎం తరపున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, అవసరమైతే రోడ్డు మీదికొచ్చేందుకైనా సిద్ధమని తెలిపారు. పెన్షన్లు, పసుపు-కుంకుమ అనే వాళ్లకు ఆర్టీసి కార్మికులు కనిపించలేదా అని ప్రశ్నించారు. ఆర్టీసి సమ్మెతో రాష్ట్ర రాజకీయాల్లోనే మార్పు వస్తుందని, గతంలో ఆర్టీసిలో చేరిన పోరాటాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసి కార్మికులను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అద్దె బస్సులను తీసేసి ఆర్టీసినే బస్సులను నడపాలని, డీజిల్ పన్నుపై రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్టీసి సమ్మెలో తాము కూడా ముందుంటామని, సమ్మెను సీరియస్‌గా తీసుకుని పోరాడాలని పిలుపునిచ్చారు. ఎపిఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులుచంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసి కార్మికుల డిమాండ్లన్నీ న్యాయబద్ధమైనవేనని, మిగతా 9లో

నేడు చర్చలు

ఆర్టీసి సిబ్బందికి వేతన సవరణతో పాటు సంస్థ పరిరక్షణ, కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 6 నుంచి ఆర్టీసి కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్న నేపథ్యంలో రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో జెఎసి నాయకులతో మంగళవారం చర్చలు జరగనున్నట్లు తెలిసింది. చర్చల కోసం జెఎసి నాయకులు అందుబాటులో ఉండాలని ఎమ్‌డి సురేంద్రబాబు జెఎసి నాయకులను కోరారు. యాజమాన్యం, ప్రభుత్వం వైఖరిని బట్టి జెఎసి తుది నిర్ణయాన్ని తీసుకోనుంది. చర్చల ద్వారా తమ సమస్యలు పరిష్కారం అవుతాయా? లేక సమ్మె చేయాల్సి వస్తుందా? అని కార్మికులు ఎదురు చూస్తున్నారు. తాము చర్చలతో పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని, తమ డిమాండ్లను అంగీకరించని పక్షంలో బుధవారం మొదటి సర్వీస్ నుంచే సమ్మెలోకి వెళ్లి తీరతామని జెఎసి నాయకులు చెబుతున్నారు.



మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాల పెంపునకు సిఎం హామీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను వెయ్యి రూపాయల నుండి రెండు వేల రూపాయలకు పెంచడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని ఆ పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) తెలిపింది. సోమవారం ఉండవల్లి ప్రజాదర్బార్‌లో యూనియన్ నాయకులతో చర్చలు జరిపిన అనంతరం సిఎం ఈ మేరకు అంగీకరించినట్లు ఆ సంఘ ప్రధాన కార్యదర్శి కె. స్వరూపరాణి ఒక ప్రకటనలో తెలిపారు. . ఈ సందర్భంగా క్లస్టర్ల వ్యవస్థను రద్దు చేయాలని, ప్రతి నెల బిల్లులు, వేతనాలు ఇవ్వాలని, వర్కర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కనీసం మౌలిక సదుపాయాలు కల్పించాలని, సబ్సిడీతో వంట గ్యాస్ సరఫరా, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని కోరినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. వరలక్ష్మి, కె. స్వరూపరాణి, నాయకులు దయా రమాదేవి ముఖ్యమంత్రిని కలిసినవారిలో ఉన్నారు.

50% వివిప్యాట్‌లు లెక్కించాలి

- ఎవరికి వేసిందీ ఓటరుకు తెలియాలి
- కేంద్ర ఎన్నికల సంఘానికి 23 పార్టీలు ఫిర్యాదు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఓట్ల లెక్కింపు సమయంలో 50 శాతం వివిప్యాట్ స్లిప్పులు లెక్కించాలని ప్రతిపక్ష పార్టీలు కోరాయి. సోమవారం నాడిక్కడ ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఈసి) సునీల్ అరోరాను 23 రాజకీయ పార్టీల ప్రతినిధుల బృందం కలిసింది. ఈ సందర్భంగా ఈవిఎంలపై అనుమానాలు, వివిప్యాట్ లెక్కింపు అంశాలపై వినతి పత్రం సమర్పించారు. ఈవిఎంలపై తయారు చేసిన నివేదికను సిఈసికి ప్రతిపక్ష నేతలు అందజేశారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవిఎం)లో అవకతవకలపై కేంద్ర ఎన్నికల సంఘానికి వివరించామని తెలిపారు. పోలైన ఓట్లలో కనీసం 50 శాతం వివి ప్యాట్ స్లిప్పులను లెక్కించాలని ఈసిని కోరినట్లు ఆయన చెప్పారు. ఎన్నికల సంఘం వివిప్యాట్ స్లిప్పులను సురక్షితంగా ఉంచాలని కోరారు. ఈవిఎంలో ఏ పార్టీ గుర్తు నొక్కినా ఓట్లు బిజెపికి వెళ్తున్నాయని ఆజాద్ ఆరోపించారు. ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నామని, ప్రజాస్వామ్య కాపాడేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. 23 రాజకీయ పార్టీలు, దాదాపు 69 శాతం ఓటర్ల ప్రతినిధులు ఉన్నామని, ఇది తమ బలమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈవిఎంలపై మిగతా 9లో



ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, శరద్‌పవార్, ఫరూక్ అబ్దుల్లా, డెరెక్ ఒబ్రెయిన్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతున్న చంద్రబాబు

స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించాలి

- సర్వే పేరుతో అక్రమంగా ఓట్లు తొలగింపు
- రాష్ట్రంలో పోలీసు యంత్రాంగం దుర్వినియోగం
- ఇసికి వైఎస్ జగన్ ఫిర్యాదు

9



శ్రీకాకుళం జిల్లా పలాస - కాశీబుగ్గలో మాట్లాడుతున్న అమిత్‌షా

'ప్యాకేజీ' ఒప్పుకున్నది బాబే

- ఆ రెండూ కుటుంబ పార్టీలే
- బిజెపి జాతీయ అధ్యక్షులు అమిత్‌షా
- నిరసన తెలిపిన టిడిపి నాయకుల అరెస్టు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ప్రత్యేకహోదాకు బదులుగా ఒకటిన్నర రెట్లు నిధులతో ప్యాకేజీ ఇస్తామంటే ఒప్పుకుంది ముఖ్యమంత్రి చంద్రబాబేనని బిజెపి జాతీయ అధ్యక్షులు అమిత్‌షా అన్నారు. సోమవారం విజయనగరంలోని మెసానిక్ టెంపుల్ మిగతా 9లో

వీధి రౌడీలా చింతమనేని

వైసిపి అధికారప్రతినిధి సుధాకర్‌బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వీధి రౌడీలా వ్యవహరిస్తున్నారని, పెన్షన్ కోసం వచ్చిన వృద్ధుడిపై దాడి చేయడం బాధాకరమని వైసిపి అధికారప్రతినిధి టిజెఆర్ సుధాకర్‌బాబు అన్నారు. విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి నేతలు ప్రజలను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేయకుండా ఎన్నికల వేళ రూ.10వేలు ఇస్తామంటూ కొత్త ఎత్తులు వేస్తున్నారన్నారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే నారావారిపల్లి, సింగపూర్‌లో దాచుకున్న ధనాన్ని ప్రజలకు ఇవ్వాలని సవాల్ చేశారు.



అనంతపురం జిల్లా రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లిలో వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య ఘర్షణతో ఉద్రిక్తంగా మారిన గ్రామం. (ఇన్‌సెట్లో) ఘర్షణలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ

అనంతపురంలో గాల్లోకి పోలీసు కాల్పులు

- పింఛన్ల పంపిణీలో వైసిపి టిడిపి నాయకుల మధ్య ఘర్షణ
- ఇద్దరు మహిళలకు గాయాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మూడో రోజైన సోమవారం అనంతపురం జిల్లాలో టిడిపి., వైసిపిల మధ్య వివాదం గాల్లోకి పోలీసు కాల్పులకు దారితీసింది. స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత ప్రాతినిధ్యం వహిస్తున్న రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లిలో టిడిపి, వైసిపి గ్రూపుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. సునీత సోదరుడు ధర్మవరపు మురళీ హాజరయ్యారు. పసుపు-కుంకుమ కింద చెక్కులు తీసుకునే వారు చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి ప్రమాణం చేసి తీసుకోవాలని స్థానిక టిడిపి నాయకులు షరతు పెట్టారు. దీనికి కొంత మంది డ్వాక్రా సంఘాల మహిళలు అభ్యంతరం చెప్పారు. దీంతో టిడిపి, వైసిపి మద్దతుదారుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పరస్పర దాడుల్లో ఇరు పార్టీలకు చెందిన ఇద్దరు మహిళలు గాయపడ్డారు. పరిస్థితిని అదుపులోకి తేవడానికి పోలీసులు వజ్రా వాహనం ద్వారా గాల్లోకి కాల్పులు జరిపారు. అంతకు ముందు సునీత ప్రసన్నాయపల్లిలో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యేందుకు ప్రయత్నించిన వైసిపి నాయకులు మహానందరెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు.



పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో మరో నాలుగైదు రోజులు చలి తీవ్ర ప్రభావం చూపించే అవకాశముందని, అదే సమయంలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని విశాఖ వాతావరణ కేంద్రం విశ్రాంత శాస్త్రజ్ఞులు రాళ్లపల్లి మురళీకృష్ణ అన్నారు. ప్రస్తుతం పాకిస్తాన్‌పై 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఆవరించి ఉన్న పశ్చిమ ఆటంకాలు తూర్పు దిశగా పయనించి రాజస్తాన్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ మీదుగా ముందుకు వెళ్లనున్నాయి. అవి భారతదేశం దాటేంతవరకు తెలుగు రాష్ట్రాల్లో చలి కొనసాగుతుందన్నారు. తర్వాత చలి తీవ్రత తగ్గే అవకాశముందన్నారు. శ్రీలంక తీరానికి సమాంతరంగా భూమధ్య రేఖా ప్రాంతం వద్ద గల హిందూ మహా సముద్రానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ఏర్పడినట్లు భారత వాతావరణ కేంద్రం సోమవారం ప్రకటించింది. ఇది రాష్ట్రానికి చాలా దూరంలో ఉన్నందున దీని ప్రభావం ఉండబోదని రాళ్లపల్లి తెలిపారు.

ఇళ్లకు నిధులేవి?

ఐదు లక్షల ఇళ్లలో పూర్తయినవి 76వేలే

భిన్న గణాంకాలతో గందరగోళం



లెక్కల్లో తేడా ఇలా...!

నిర్మాణ స్థాయి	కలెక్టర్ల సదస్సుకు	బడ్జెట్ కోసం
మంజూరైనవి	4,47,765	5,24,000
నిర్మాణానికి తీసుకున్నవి	3,79,431	4,54,579
ప్రారంభించినవి	1,12,094	3,54,579
పూర్తయినవి	76,701	76,164
ఖర్చు (రూ.కోట్లలో)	2,487	7,043

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రధానమంత్రి ఆవాస యోజన ఇళ్లకు కాసుల కష్టాలు వెంటాడుతున్నాయి. కావాల్సిన భూమిని సేకరించడం లోనూ సమస్యలు పెరుగుతున్నాయి. దీంతో అనుకున్న సమయంలో ఇళ్లను పూర్తి చేసి లబ్దిదారులకు అందించడం కష్టంగా కనిపిస్తోంది. లక్ష్యంగా నిర్ణయించిన ఐదు లక్షల ఇళ్లలో కేవలం 76 వేల ఇళ్లే ఇప్పటివరకు పూర్తయినట్లు అధికారులు చెబుతుండగా, ఈ లెక్కల్లోనూ స్పష్టత కనిపించడం లేదు. ఒక్కో నివేదికలో ఒక్కో గణాంకాలు కనిపిస్తున్నాయి. అది కూడా కొద్ది రోజుల తేడాతోనే ఈ నివేదికలు ఉండడం గమనార్హం. కలెక్టర్ల సదస్సుకు, బడ్జెట్ కూర్పుకోసం ఇచ్చిన రెండు వేర్వేరు నివేదికల్లో తేడాలు ఉన్నప్పటికీ, ఇళ్ల నిర్మాణం వేగవంతంగా జరగడం లేదన్నది ఉమ్మడి అంశంగా వెల్లడైంది. ఎన్టీఆర్ అర్బన్ గృహాల కోసం 4.47 లక్షల ఇళ్లకు అధికారికంగా ఉత్తర్వులు ఇవ్వగా, అందులో 3.79 ఇళ్లనే ముందుగా నిర్మించేందుకు సన్నాహాలు చేశారు. అయితే వాటిల్లో కూడా జిల్లా స్థాయిలో అనుమతులు కేవలం 2.06 లక్షల ఇళ్లకే ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇది మొత్తం ఇళ్లలో కేవలం 54 శాతంగానే ఉంది. అలాగే లబ్దిదారుల ఎంపిక కూడా నత్తనడకనే సాగుతోంది. ఇప్పటివరకు 57 శాతం మందినే గుర్తించారు. ఇలా ఉండగా, పరిపాలనా ఆమోదం ఇచ్చిన ఇళ్లలో కూడా 1.12 లక్షల ఇళ్ల నిర్మాణం ప్రారంభ మయ్యాయి. వీటిల్లో 76 వేల ఇళ్ల నిర్మాణం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. దీనికోసం 2487 కోట్లు ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. ఈ నెల 28న నిర్వహించిన కలెక్టర్ల వీడియో కాన్ఫెరెన్స్‌కు అధికారులు ఈ వివరాలు ఇవ్వగా, తాజాగా వార్షిక బడ్జెట్ కోసం అధికారులు సిద్ధం చేసిన నివేదికలో గణాంకాలు భిన్నంగా ఉన్నాయి. అందులో మొత్తం 5.24 లక్షల ఇళ్లు నిర్మించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇందులో 3.54 లక్షల ఇళ్ల నిర్మాణం ప్రారంభమైందని, 76,164 ఇళ్లు పూర్తయ్యాయని వివరించారు. మిగిలినవి వివిధ స్థాయిలో ఉన్నాయని పేర్కొంటూ, దీనికోసం 7,043 కోట్లు ఖర్చు జరిగినట్లు వివరించారు. ఇలా రెండు నివేదికల్లో రెండు రకాల వివరాలు ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

కాగా, ఐదు లక్షల ఇళ్ల నిర్మాణానికి 12వేల కోట్లు కావాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇక ఇళ్ల నిర్మాణానికి 786 ఎకరాల భూమి కావాల్సి ఉంటుంది. ప్రభుత్వ భూములు అందుబాటులో లేవని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ భూమిని సేకరించేందుకు మరో 1035 కోట్లు కావాలని అంటున్నారు. దీంతో మొత్తం 13,035 కోట్లు వెచ్చించాల్సి ఉంటుందని వారు నివేదించారు. అయితే ఇంత నిధులను సమకూర్చడంపై అనుమానాలు వీరిలో వ్యక్తమవుతున్నాయి.

9న రాష్ట్రమంతటా 10న గుంటూరులో మోడీ పర్యటన వ్యతిరేక నిరసనలు

వామపక్షాల పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనను నిరసిస్తూ ఈనెల 9,10న నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వామపక్షాలు పేర్కొన్నాయి. 'మోడీ గో బ్యాక్' నినాదంతో ఈనెల 9న రాష్ట్ర వ్యాప్తంగానూ, 10న గుంటూరులో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వామపక్ష పార్టీల నేతలు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గుంటూరులో ఖాళీ కుండలు, ఇతర రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామనీ, రాష్ట్ర ప్రజలు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఎపికి విభజన హామీల అమలు, ప్రత్యేక హోదా ఇవ్వడంలో మోడీ మొండి వైఖరి అవలంబించారని పేర్కొన్నారు. పార్లమెంటులో చట్టబద్ధంగా ఇచ్చిన విభజన హామీలను మోడీ తుంగలో తొక్కారని తెలిపారు. మోసపూరితమైన వాగ్దానాలతో రాష్ట్ర ప్రయోజనాలను, అభివృద్ధిని మోడీ అడ్డుకున్నారని పేర్కొన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి కేటాయించిన రూ.350కోట్లను కేంద్రం వెనక్కి తీసుకోవడాన్ని వారు వ్యతిరేకించారు. విశాఖరైల్వే జోన్, కడపలో ఉక్కు కర్మాగారం ఊసే కేంద్రం ఎత్తడంలేదని తెలిపారు. కేంద్రీయ విద్యాసంస్థల ఏర్పాటుకు అరకొర నిధుల్ని కేటాయించడాన్ని ఖండించారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదాను కల్పించి, నిర్మాణ బాధ్యతలను పూర్తిగా కేంద్రమే తీసుకుంటుందని ఇచ్చిన హామీని కేంద్రం విస్మరించిందని పేర్కొన్నారు. ఎపి రాజధాని శంఖుస్థాపనకు వచ్చిన మోడీ పిడికెడు మట్టి, చెంబుడు నీళ్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని తెలిపారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో కూడా రాష్ట్రానికి మొండి చేయి చూపిన మోడీ ఎపి పర్యటనను వ్యతిరేకించారు. ఈ నిరసన కార్యక్రమాల్లో మోడీ మోసాలను ఎండగట్టడానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజానీకం పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వామపక్షాల తరపున రాష్ట్ర నాయకులు పి మధు(సిపియం), కె రామకృష్ణ (సిపిఐ), వై సాంబశివరావు (సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ), సి వెంకటేశ్వర్లు జి విజయకుమార్(సిపిఐ(ఎంఎల్)), (సిపిఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ), కె నాగభూషణం(ఎంసిపిఐ(యు)), బి బంగార్‌రావు (సిపిఐ(ఎంఎల్)లిబరేషన్), బిఎస్ అమర్‌నాథ్ (ఎస్‌యుసిఐ(సి)),పివి సుందరరామరాజు (ఫార్వర్డ్‌బ్లాక్), జానకి రాములు(రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ) పిలుపునిచ్చారు.

ఓటమి భయంతోనే దుందుడుకు చర్యలు

మంత్రి యనమల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతోనే నరేంద్రమోడీ దుందుడుకు చర్యలకు దిగుతున్నారని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. సోమ వారం రాత్రి ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ శ్రీకాకుళంలో అమిత్‌షా సభ ఫెయిల్ కావడంతో జాతీయ పార్టీ అధ్యక్షుడిని అంటూ ఆయన సిఎం గురించి ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు. దేశం కోసం గాంధీ కుటుంబం ప్రాణాలర్పించిందన్నారు. రాబోవు ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావడం కల్ల అన్నారు. కోల్‌కతా సంఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సిబిఐ తో రాష్ట్ర ప్రభుత్వంపై దాడులు, గర్హనీయమని, ముఖ్య మంత్రి రాజ్యాంగ పరిరక్షణ కోసం దీక్ష చేసే దుస్థితి తెచ్చారన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వ వైఫల్యానికి పరాకాష్టగా యనమల పేర్కొన్నారు. కోఆపరేటివ్ ఫెడరలిజమ్ మోడీ మాటలకే పరిమితమని, నిరంకుశత్వానికి ప్రతీకగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. మోడీని ఎంత త్వరగా ఇంటికి పంపితే దేశానికి అంత లాభమన్నారు. ఓటమి భయంతోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘర్షణలకు పాల్పడుతోందన్నారు. పసుపు-కుంకుమ సభలను భగ్నం చేసే కుట్రలు చేస్తోందన్నారు. పేదరికాన్ని అవమానిస్తే జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు గుణపాఠం చెబుతారని యనమల పేర్కొన్నారు.

అగ్రిగోల్డ్ ఆస్తులపై బాబు కన్ను

వైసిపి నేత పార్థసారథి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అగ్రిగోల్డ్ ఆస్తులపై చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ కన్నేశారని, అందుకే బాధితులకు న్యాయం జరగడం లేదని వైసిపి నేత కె పార్థసారథి ఆరోపించారు. అగ్రిగోల్డ్ బాధితుల బాసటకమిటీ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో సోమవారం మహాధర్నా నిర్వహించారు. ధర్నాలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్థసారధి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అగ్రిగోల్డ్ బాధితులకు రూ.1183కోట్లు ఇస్తే కనీసం 70శాతం మంది బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 243 మంది అగ్రి బాధితులు చనిపోయినా సిఎం దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఎస్సెల్ సంస్థ ప్రతినిధులతో చంద్రబాబు అర్ధరాత్రి భేటీ అయిన తర్వాత, ఆ సంస్థ వెనక్కి వెళ్లిపోయిందన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో తాయిలాలిస్తున్న చంద్రబాబు అగ్రిగోల్డ్ బాధితుల విషయంలో మౌనం ఎందుకు పాటిస్తున్నారో చెప్పాలని కోరారు. అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి నేతలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే రక్షణనిధి, మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్, జోగి రమేష్, అడపా శేషు, లేళ్ల అప్పిరెడ్డి, డిఎన్ఆర్, బొప్పన భవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎస్ఆర్ఆర్‌డిఎకు రూ.1,500 కోట్లు రుణానికి అనుమతి


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ స్టేట్ రూరల్ రోడ్స్ డెవలప్‌మెంట్ ఎజన్సీ (ఎపిఎస్ఆర్ఆర్‌డిఎ) కు రూ.1,500 కోట్లను బ్యాంకుల నుంచి రుణంగా పొందేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తొమ్మిది జిల్లాల్లో 16,031.33 కిలోమీటర్ల పొడవైన 5,515 బిటి రోడ్ల నిర్మాణానికి రూ.1,742.89 కోట్లు వ్యయం అవుతుండగా ఈ మొత్తంలో రూ.1,500 కోట్లు రుణం పొందేందుకు అనుమతి ఇవ్వాలని ఎపిఎస్ఆర్ ఆర్‌డిఎ ప్రతిపాదనలను గతంలో ప్రభుత్వానికి పంపింది. వీటిని పరిశీలించిన ప్రభుత్వం కొన్ని షరతుల మేరకు రుణాన్ని పొందేందుకు అంగీకరించింది. రుణానికి ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వనుంది.

రాష్ట్రాల హక్కుల కోసం ఉద్యమం

టెలీ కాన్ఫరెన్స్‌లో చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రాల హక్కులను కాపాడుకునేందుకు జాతీయ పార్టీలతో సంప్రదించి ఉద్యమానికి యాక్షన్ ప్లాన్ రూపొందించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. ఉండవల్లిలోని గ్రీవెన్స్ హాల్ నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో సోమవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రాలను కేంద్రం తమ నియంత్రణలో ఉంచుకోవాలని చూడటం అన్యాయమన్నారు. పశ్చిమ బెంగాల్‌లో కేంద్రం చర్యలు దుర్మార్గమని, సహకార సమాఖ్య వ్యవస్థ అన్న మోడీ నేడు రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారని చెప్పారు. మమతా బెనర్జీకి సంఘీభావం చెబుతున్నట్లు తెలిపారు. బిజెపికి లొంగిపోయిన వారిపై కేసులు ఎత్తివేస్తూ, ఎదిరిస్తే పాత కేసులు బయటకు తీస్తున్నారన్నారని పేర్కొన్నారు. మొన్న అఖిలేష్, నిన్న మాయావతి, నేడు మమతా బెనర్జీపై కక్ష సాధింపులకు దిగారన్నారు. శాంతి భద్రతలు రాష్ట్ర పరిధిలోని అంశమని, జగన్‌పై దాడి కేసు ఎన్ఐఎకు అప్పగించడాన్ని బిజెపి కుట్రగా ఆయన అభివర్ణించారు. బిజెపి నిరంకుశ పోకడలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. తిత్లీ తుఫాన్‌కు శ్రీకాకుళం విధ్వసంమైతే అమిత్‌షా రాలేదని, నాలుగునెలల తరువాత వచ్చి ఏం చూద్దామని! ఏం చేద్దామని? ఏ ముఖం పెట్టుకుని పర్యటనలకు వచ్చారని చంద్రబాబు ప్రశ్నించారు.

కేంద్ర వైఫల్యాలతో రాష్ట్రానికి ఇబ్బందులు

కేంద్ర వైఫల్యాలతో రాష్ట్రం ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదుర్కొంటుందని, ఉపాధి హామీ, పోలవరం ప్రాజెక్టుకు నిధుల విడుదల చేయడంలో కేంద్రం తీవ్ర జాప్యం చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నీరు-ప్రగతి, వ్యవసాయ రంగాలపై సోమవారం ఉదయం అధికారులతో టెలికాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు అడుగడుగునా కేంద్రం అడ్డంకులు సృష్టిస్తున్నా రాజీ పడకుండా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. నాలుగున్నరేళ్లలో అద్భుతమైన ఫలితాలు సాధించామన్నారు. ఈ నెల 9వ తేదీన 4 లక్షల గృహప్రవేశాలు నిర్వహించనున్నామని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. రెండు రోజుల్లో 24 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేశామన్నారు. 8వ తేదీ వరకూ పింఛన్ల పంపిణీ జరుగుతోందన్నారు. చెక్కుల మార్పిడికి బ్యాంకర్లు సహకరించాలని ఆదేశించారు. ఆర్థిక శాఖ రూ.4,100 కోట్లు విడుదల చేసిందన్నారు. బ్యాంకుల్లో రూ.2,350 కోట్లు డిపాజిట్ చేశామన్నారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం చేయాలని, జొన్న, మొక్కజొన్న రైతులకు చెల్లింపులు జరపాలని ఆదేశించారు. రైతులను మోసగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మిక్సింగ్ ప్లాంట్లపై నిఘా ముమ్మరం చేయాలన్నారు.గత ఏడాది కంటే రిజర్వాయర్లలో నీటి మట్టం 6 శాతం తగ్గిందని, సమర్థ నీటి నిర్వహణపై దృష్టి పెటాల్సిన అవసరం ఏర్పడిందని చెప్పారు. రబీ సీజన్‌లో 87 శాతం మాత్రమే పంటల సాగు జరిగిందని, పంట దిగుబడులు తగ్గకుండా శ్రద్ధపెట్టాలన్నారు. కరువు మండలాల్లో ఉపాధి పనులు ముమ్మరం చేయాలని, పని దినాలు మెరుగుపరచాలని ఆదేశించారు. రాబోయే ఎన్నికలు అందరికీ ఫైనల్ పరీక్షలని, ఐదేళ్లలో చేసిన కృషికి ఈ పరీక్షా ఫలితాలే గీటు రాయని తెలిపారు.

7 నుంచి కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలీస్ కానిస్టేబుల్ ఖాళీల భర్తీ కోసం నిర్వహించిన ప్రాథమిక రాత పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 7 నుంచి దేహదారుఢ్య పరీక్షలను నిర్వహించనున్నట్లు ఏపి పోలీస్ నియామక మండలి చైర్మన్ కుమార్ విశ్వజిత్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాను బట్టి వేర్వేరు పరీక్ష తేదీల్లో మార్పులు ఉంటాయని, అభ్యర్థులు తమ హాల్‌టికెట్లల్లో ఇచ్చిన తేదీల్లో సంబంధిత కేంద్రాల్లో హాజరు కావలసి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు స్టేజ్-2 దరఖాస్తు ఫారాన్ని తప్పనిసరిగా తీసుకొని రావాలని తెలిపారు.

పోస్టు డేటెడ్ చెక్కులతో మోసం : రోజా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోస్ట్ డేటెడ్ చెక్కులతో చంద్రబాబు మహిళలను మరో సారి మోసం చేయాలని చూస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఆర్కే రోజా అన్నారు. పాత మోసాన్ని కప్పిపుచ్చుకోవడానికి చంద్రబాబు చేస్తున్న కొత్త మోసమే పసుపు-కుంకుమ కార్యక్రమని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన. ప్రజల కోసం కష్టపడుతున్న తనకు ఓట్లేయాలని చంద్రబాబు అడుగుతున్నారని, మహిళలకు ఏం చేశారని మీకు ఓటేయాలని ప్రశ్నించారు. నాలుగున్నరేళ్ల ఎలాంటి పనులు చేయకుండా ఎన్నికల ముందు మాత్రం పసుపు-కుంకుమ అంటూ హడావుడి చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో హోదాకు మద్దతుగా వైఎస్ఆర్‌సిపి ఎమ్మెల్యేలు నల్లచొక్కాలు ధరించి అసెంబ్లీకి హాజరైతే తప్పు పట్టిన స్పీకర్... టిడిపి నేతలను ఎందుకు అనుమతించారని ప్రశ్నించారు. హోదా వద్దు ప్యాకేజీ బెటర్ అంటూ మాట్లాడిన చంద్రబాబు...ప్రజా ఉద్యమాన్ని చూపి యూటర్న్ తీసుకుని హోదా కోసం దొంగ పోరాటాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక కుటుంబ సభ్యుల వ్యక్తిత్వాలపై టిడిపి నేతలు దుష్ప్రచారం చేయిస్తున్నారని వైఎస్ఆర్‌సిపి అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ అన్నారు. షర్మిలపై గత ఐదేళ్లుగా దుష్ప్రచారాలు చేస్తూ, సంబంధం లేని విషయాలను అంట గడుతూ పైశాచికానందం పొందుతున్నారని మండిపడ్డారు.

నేరాలు ఘోరాలు

అమ్మాయి ఫోటో ఎరగా...

- పక్కా ప్లాన్‌తోనే జయరామ్ హత్య
- రాకేష్ రెడ్డే ప్రధాన నిందితుడు
- నేడు మీడియాకు వివరాలు వెల్లడించనున్న పోలీసులు



నందిగామ పాత బస్టాండులోని ఒక వైన్ షాపులో బీరు సీసాలు కొనుగోలు చేసి తీసుకెళ్లుతున్న రాకేష్‌రెడ్డి (సిసిపుటేజి ఆధారంగా)

ప్రజాశక్తి - నందిగామ

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రముఖ పారిశ్రామిక వేత్త చిగురుపాటి జయరామ్ హత్యకేసును ఎట్టకేలకు పోలీసులు ఛేధించారు. జయరామ్ మేనకోడలు శిఖాచౌదరి ప్రియుడు రాకేష్‌రెడ్డి ప్రధాన నిందితుడిగా భావిస్తున్నారు. రాకేష్‌రెడ్డి వాట్సప్ డీపీలో అందమైన అమ్మాయి ఫొటోపెట్టి రీనా అన్న పేరుతో ఎరగా చూపి ఒంటరిగా రమ్మని ఛాటింగ్ చేశాడు. ఇది నమ్మి డ్రైవర్ లేకుండా జయరామ్ రీనా ఇల్లుగా భావించి రాఖేష్‌రెడ్డి ఇంటికి వెళ్లాడు. అక్కడ రాఖేష్‌రెడ్డిని చూసి షాక్‌కు గురయ్యాడు. అతని అనుయాయులు జయరామ్‌ను బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లి బంధించినట్లుగా సమాచారం. తన డబ్బు కోసం రాఖేష్‌రెడ్డి ఒత్తిడి చేశాడని, దీంతో జయరామ్ మేనకోడలు శిఖా చౌదరిని రూ.10 లక్షలు ఇవ్వాలని అడిగాడు. తనవద్ద డబ్బులు లేవని ఆమె తేల్చిచెప్పినట్లు తెలిసింది. కోస్టల్ బ్యాంక్‌లో పనిచేసిన ఓ మహిళకు కూడా జయరామ్ ఫోన్‌చేశాడు. ఆ తరువాత అదేబ్యాంక్‌లో పనిచేసిన ఈశ్వర ప్రసాద్‌కు కూడా జయరామ్ ఫోన్ చేయగా ఆయన 31న ఉదయం రూ. 6 లక్షలు ఇచ్చినట్లు సమాచారం. శిఖాచౌదరితో జయరామ్ లైంగిక సంబంధం కొనసాగిస్తుండటం, రోజూ ఇంటికి వస్తుండటం రాకేష్‌రెడ్డికి నచ్చలేదని సమాచారం. దీంతో పక్కా ప్లాన్‌తో హత్య చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు మంగళవారం మీడియా ముందు ముద్దాయిని ప్రవేశపెట్టి హత్యకు సంబంధించి వివరించనున్నారు. జయరామ్ హార్ట్‌పేసెంట్ అవ్వటంతో అతన్ని గుండెల మీద బలంగా కొట్టడంతో మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారిస్తున్నారు. రాకేష్‌రెడ్డి జయరామ్‌ను హైదరాబాద్‌లోనే హత్యచేసి కారులోనే ఉంచి, తానే డ్రైవింగ్ చేసుకుంటూ వస్తూ నందిగామ పాతబస్టాండులో ఆగి ఒక వైన్ షాపులో రెండు బీరుసీసాలు కూడా కొనుగోలు చేసినట్లుగా సిసి పుటేజీల ద్వారా వెల్లడైంది. హత్యచేసి ప్రమాదం జరిగినట్లుగా చిత్రీకరించేందుకు రాకేష్‌రెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. గతనెల 31వ తేదీ ఉదయం 11గంటల సమయంలో ఈ హత్య జరిగినట్లు పోలీసుల విచారణలో తేలింది. తనవద్ద తీసుకున్న రూ.4.50 కోట్ల అప్పును చెల్లించకుండా జయరామ్ తప్పించుకొని తిరుగుతున్నాడని రాఖేష్‌రెడ్డి పోలీసుల విచారణలో చెప్పినట్లు సమాచారం. తాను ఫోన్ చేస్తే జయరామ్ ఫోన్ లిఫ్ట్‌చేయటం లేదని డబ్బులను రాబట్టుకునేందుకు పక్కా స్కెచ్ వేశాడని అంటున్నారు. జయరామ్ మీద ఎటువంటి విష ప్రయోగం జరగలేదని, ఈ హత్యలో రాఖేష్‌రెడ్డితో పాటు మరో ముగ్గురు పాల్గొన్నట్లు సమాచారం.

సంక్షిప్తం

నేడు హైకోర్టులో బోగస్ ఓట్లపై విచారణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 99 లక్షల బోగస్ ఓట్లు ఉన్నాయంటూ గత నెలలో వైసిపి వేసిన పిటీషన్ నేడు హైకోర్టులో విచారణకు రానుంది. సోమవారం పిటీషన్ విచారణకు రాగా జడ్జి సెలవులో ఉండటంతో మంగళవారానికి వాయిదా పడినట్లు వైసిపి లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బోగస్ ఓట్లపై జరిగే విచారణలో వాస్తవాలు బయటపడతాయన్నారు. చనిపోయిన వారిని కూడా ఓటర్లుగా నమోదు చేయడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. జగన్ ఢిల్లీలో పోరాడుతుంటే తాము హైకోర్టులో పోరాడుతున్నామన్నారు.

ముగిసిన వాదనలు తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డొల్ల కంపెనీలకు కోట్లాది రూపాయల విలువజేసే ప్రభుత్వ భూమిని ఏపిఐఐసి కారుచౌకగా దారాదత్తం చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో వాద,ప్రతివాదనలు సోమవారంతో ముగిశాయి, ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించి. కేసును ఈ నెల 11కు వాయిదా వేశారు.

జగన్‌ను వెంటాడుతున్న ఓటమి భయం : మంత్రి సోమిరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రతిపక్షనేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే చౌకబారు విమర్శలకు దిగుతున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో 59.18లక్షల నకిలీ ఓట్లు ఉన్నాయని ఆయన ఈసిని ఆశ్రయించడం అతనిలో నెలకొన్న ఓటమి భయానికి నిదర్శనమన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. వైసిపి సానుభూతి పరుల ఓట్లను తొలగించారని ఆరోపిస్తున్న జగన్‌కు ఓటర్ల చేర్పులు, తొలగింపులు ఈసి పరిధిలో ఉంటాయని తెలియదా? అని సోమిరెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఏదో విధంగా బురద జల్లాలనే తపనే తప్ప మరొకటి కనబడటం లేదన్నారు.

ఎ1తో స్నేహం చేస్తే అంతే

అమిత్‌షా వ్యాఖ్యలపై లోకేష్ స్పందన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



"ఏపీలో జరుగుతున్నది అభివృద్ధి కాదు.. అవినీతి' అని సోమవారం శ్రీకాకుళం పర్యటనలో అమిత్‌షా వ్యాఖ్యానించడంపై ట్విట్టర్‌లో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఎ1తో స్నేహం చేస్తే అంతా ఎ1లాగా కనిపించడంలో తప్పులేదు అంతేగా..అమిత్‌షా జీ.. అంటూ వరుస ట్వీట్‌లు చేశారు. అభివృద్ధిలో ఏపీ అగ్రస్థానంలో ఉందని ఇందుకు కేంద్రం ఇచ్చిన అవార్డులే సాక్ష్యమన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, గ్రామీణాభివృద్ధిలో ఏపీ నెంబర్1అని మీరే అవార్డులిచ్చారని పేర్కొన్నారు. అవినీతి తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఏపీ 3వ స్థానంలో ఉందని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ఇండియా సర్వే చెప్పిందన్నారు. అమిత్‌షాజీ రాయలసీమపై కపట ప్రేమ వద్దని. రాయలసీమకు నీటిని తరలించడంతో పొలాలు తడిచాయన్నారు.. విభజనచట్టంలోని కీలకమైన 14 అంశాల్లో 10 అంశాలను పూర్తి చేశామని అమిత్ షా అనడం హాస్యాస్పదమని లోకేశ్ పేర్కొన్నారు. బిజెపి నేతలు ఏపీలో పర్యటించే ముందు రాష్ట్రానికి ఇవ్వాల్సిన రూ.1 లక్ష16వేల కోట్లను ఎప్పుడు ఇస్తారో చెప్పాలని లోకేశ్ డిమాండ్ చేశారు.

ఇసికి జగన్ తప్పుడు సమాచారం : డొక్కా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్ ఎన్నికల సంఘానికి తప్పుడు సమాచారం ఇచ్చారని టిడిపి ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ ఆరోపించారు. గుంటూరులోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యోగోన్నతి పొందిన ఒకే సామాజిక తరగతికి చెందిన 37 మంది డిఎస్‌పిలను బదిలీ చేశారని జగన్ చెప్పడం వాస్తవం కాదన్నారు. ప్రమోషన్లు పొందిన వారిలో అన్ని సామాజిక తరగతులవారున్నారని పేర్కొన్నారు. బోగస్ ఓటర్లున్నారని, కొన్ని ఓట్లు తొలగిస్తున్నారని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పింఛన్ల పెంపు, డ్వాక్రా మహిళలకు ఇస్తున్న రూ.10 వేల సాయం చూసి ఓర్వలేక జగన్ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. టిడిపిలో అన్ని సామాజిక తరగతులకు ప్రాతినిధ్యం ఉందని, వైసిపిలోనే కొన్ని సామాజిక తరగతులకు మాత్రమే ప్రాధాన్యమనుందని విమర్శించారు.

సన్మానం



సినీనటుడు తనికెళ్ల భరణిని సన్మానిస్తున్న గొల్లపూడి మారుతిరావు, కలెక్టర్ హరిజవహర్‌లాల్

సంగీతం, సాహిత్యాలకు పరస్పర సంబంధం

విజయనగరం కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో తనికెళ్ల భరణి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సంగీతం, సాహిత్యాలకు పరస్పర సంబంధాలున్నాయని, ఆ రెండింటికీ విజయనగరం కేంద్ర బిందువు వంటిదని ప్రముఖ రచయిత, సినీ నటులు తనికెళ్ల భరణి అన్నారు. శాస్త్రీయ సంగీతంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, అటువంటి సంగీతానికి విజయనగరం మహారాజ సంగీత, నృత్య కళాశాల పుట్టినిల్లని పేర్కొన్నారు. కళాశాల వందేళ్ల ఉత్సవాల్లో భాగంగా రెండోరోజైన సోమవారం సాంస్కృతిక, సాహిత్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషిని మనిషిగా మార్చేశక్తి, మానవత్వం చూపగలిగే శక్తి సంగీతానికే ఉంటుందన్నారు. స్థానిక సంగీత, నృత్య కళాశాల సంగీత పరిమళాలు దేశ, విదేశాల్లో గుబాళిస్తున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సినీనటులు, రచయిత గొల్లపూడి మారుతీరావు మాట్లాడుతూ ఇక్కడ పనిచేసిన అధ్యాపకులంతా కళాకారుల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. ఆకాశవాణిలో సంగీత స్వరాలు వినడం ద్వారా తనలో సంగీతం పట్ల ఆసక్తి కలిగిందని తెలిపారు. వినడం, వినిపించడం సాధికారమైన అంశమని పేర్కొన్నారు. సంగీతం, సాహిత్యం ఎన్నటికీ చెదిరిపోని అంశాలని అన్నారు. జిల్లా కలెక్టర్ హరిజవహర్‌లాల్ మాట్లాడుతూ కళాశాలలో హరికథతోపాటు మరిన్ని విభాగాలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. చెన్నై, విజయవాడ, తిరుపతి, హైదరాబాద్, రాజమండ్రి, సామర్లకోట తదితర ప్రాంతాలకు చెందిన సంగీత విద్వాంసుల, నాట్యాచార్యుల ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పలువురిని సన్మానించారు.

పనిచేయని సర్వర్లు

- కృష్ణాలో టిడిపి నేతల ఇళ్ల వద్ద పింఛన్ల పంపిణీ
- చిత్తూరు, కడప, ప.గోదావరిలో ముగ్గురు మృతి

ప్రజాశక్తి యంత్రాంగం

పింఛన్ల పంపిణీలో భాగంగా మూడో రోజైన సోమవారం కూడా అనేక అపశృతులు చోటు చేసుకున్నాయి. కడప, పశ్చిమగోదావరి, చిత్తూరు జిల్లాల్లో ఒక్కొక్కరు మృతిచెందారు. కృష్ణాజిల్లా ఆగిరిపల్లి మండలం ఈదులగూడెంలో టిడిపి నాయకులు ఈలప్రోలు శ్రీనివాసరావు, చిట్టినేని శివరామకృష్ణ ఇళ్ల వద్ద పింఛన్ల పంపిణీ చేశారు. దీనిని మొవ్వ మండలం పెదపూడిలో పంచాయతీ కార్యాలయం వద్ద సర్వర్ పనిచేయక పోవటంతో ఉదయం 8 గంటలకే కార్యాలయానికి చేరుకున్న వృద్ధులు, పింఛనుదారులు మధ్యాహ్నం వరకూ ఇబ్బందులు పడ్డారు. అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని క్రీడామైదానంలో ఏర్పాటుచేసిన సభ వద్ద సరైన సదుపాయాలు కల్పించకపోవటంతో మహిళలు అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తాను పక్షవాతానికి గురైనా పింఛను ఇవ్వటం లేదని డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ వద్ద కొత్తపేటకు చెందిన పులిగడ్డ నాంచారమ్మ తనగోడును వెళ్లబోసుకున్నారు. తన వేలిముద్రలు తీసుకున్నా వితంతు పింఛను ఇవ్వటం లేదని చాట్రాయి మండల చీపురుగూడెంకు చెందిన మానికల వెంకటరత్నం ఆవేదన వ్యక్తంచేశారు. విజయవాడలో సోమవారం మధ్యాహ్నం నుంచి సర్వర్ నిలిచిపోవడంతో పింఛన్ల పంపిణీ ఆగిపోవడంతో నగర వ్యాపితంగా పింఛను దారులు అష్టకష్టాలు పడ్డారు. ఉదయం 8 గంటలకు పింఛన్ల పంపిణీ కేంద్రాల వద్దకు వచ్చిన పింఛనుదారులు సాయంత్రం వరకూ పడిగాపులు కాయాల్సి వచ్చింది. వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.

కడప జిల్లా లక్కిరెడ్డిపల్లె మండలం పందెళ్లపల్లె పంచాయతీలో పింఛను కోసం వచ్చిన షేక్ మాబున్నీ(78) మృతిచెందింది. అధికారుల వద్ద ఉన్న ట్యాబ్‌లో వేలిముద్ర వేయిస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందిందని వైద్యులు తెలిపారు. మాబున్నీ మృతితో సమావేశంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా .వింజమూరులో ఈ నగదును పాత బకాయిల్లో జమచేసుకుంటామని బ్యాంకు మేనేజర్ చెప్పడంతో మహిళలు ధర్నాకు దిగారు. విశాఖలో అనేక చోట్ల సర్వర్లు పనిచేయలేదు సాయంత్రం వరకూ పింఛనుదారులు వేచివుండి తీవ్ర అవస్థలు పడ్డారు. దీంతో సాగర్‌నగర్ ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం వద్ద వీరంతా నిరసనకు దిగారు. హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం నియోజక వర్గంలోని మర్లావాలో రసాభాసగా జరిగింది. ఇచ్చిన పింఛన్ల సొమ్మును ఇంటి పన్ను రూపంలో తిరిగి వసూలు చేయడంతో గ్రామస్తులు ఆందోళన చేశారు. దీనిపై పెద్దాపురం నియోజకవర్గ జనసేన నాయకులు పంచాయితీ కార్యదర్శిని నిలదీశారు. చింతూరులో సుమారు నాలుగు వేల మంది ఆటోలో తరలి రావడంతో కేంద్రం ప్రజానీకంతో నిండిపోయింది.

మోతుగూడెంలో మండుటెండలో వృద్ధులు అవస్థలు పడ్డారు. కొందరికి యర్రంపేటలోనూ, మరి కొందరికి చింతూరులోనూ ఇస్తున్నామని చెప్పడంతో ఎవరికి ఎక్కడ పింఛన్లు ఇస్తున్నారో అర్థంకాక వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడ్డారు. వృద్ధులు ఎండకు తాళలేక చెట్లకిందనే ఉండిపోయారు. పిఠాపురంలో సాంకేతిక సమస్యతో పింఛన్ల పంపిణీ నిలిచిపోయింది. వృద్ధులు, మహిళలు పింఛన్ల కోసం 5 గంటలు పడిగాపులు కాశారు. కొందరు ఎదురుచూడలేక వెనుదిరిగారు. జగ్గంపేట మండలం కాండ్రేగులలో డ్వాక్రా మహిళ రాయి దుర్గ ఒక్కసారిగా అస్వస్థతకు గురైంది. ఆమెను అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యంకోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చిత్తూరు జిల్లా తిరుచానూరులో పింఛను కోసం సుబ్బమ్మ (75) ద్విచక్రవాహనంలో వచ్చింది. ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందింది.



విశాఖలో ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న పింఛను దారులు

పశ్చిమగోదావరి జిల్లా లింగపాలెం మండలం మట్టంగూడెం సభలో టిడిపి నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబును కొనియాడుతూ మాట్లాడుతుండగా అదే గ్రామానికి చెందిన వైసిపి నాయకులు తమ పార్టీ నాయకుడు నవరత్నాలలో పేర్కొన్న పథకాలను ప్రవేశపెట్టడమే తప్ప చంద్రబాబు గొప్పేముంది అనడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అధికారులు, ప్రజలు ఇరుపక్షాల నేతలను బయటకు పంపించి పింఛన్లు పంపిణీ కొనసాగించారు. ఆకివీడులో లబ్ధిదారులకు సరైన భోజన ఏర్పాట్లు చేయకపోవడంతో గందరగోళ వాతావరణం చోటుచేసుకుంది.

భీమడోలు మండలం పూళ్ల వద్ద పింఛను తీసుకునేందుకు వెళ్లి వస్తున్న ఎం.ఎం.పురానికి చెందిన కూర్మ రాముడమ్మ (70) రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. పోలవరంలో ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమం 11 గంటలకు ప్రారంభం కావడంతో లబ్ధిదారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళ్ల మండలంలో లబ్ధిదారులకు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో అధికారులను నిలదీశారు. నరసాపురంలో పింఛను తీసుకొని వచ్చే వారికోసం కనీసం టెంట్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఎండలోనే పింఛన్లు తీసుకోవాల్సి వచ్చింది. పెనుమంత్రలో సర్వర్ మొరాయించడంతో అధికారులు, లబ్ధిదారులు ఇబ్బందిపడ్డారు.

టిడిపి నేతల అత్యుత్సాహం.. నిరుపేద ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పింఛన్ల పంపిణీ నేపథ్యంలో టిడిపి కార్యకర్తలు అట్టహాసంగా వేసిన తారాజువ్వల కారణంగా ఓ తాటాకింటికి నిప్పంటుకుంది. ఈ ఘటన పశ్చిమగోదావరి జిల్లా కొయ్యలగూడెం మండలం కన్నాపురంలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. కన్నాపురంలో చెక్కుల పంపిణీ కోసం సభ ఏర్పాటు చేశారు. అధికారులు వస్తున్న తరుణంలో టిడిపి కార్యకర్తలు ఉత్సాహంగా తారాజువ్వలు వేశారు. వీటిలో ఒక జువ్వ సమీపంలోని యర్రా రంగమ్మకు చెందిన తాటాకింటిపై పడింది. ఆ ఇంటికి నిప్పంటుకోవడంతో స్థానికులు ఆర్పే ప్రయత్నం చేశారు. ఇదే సమయంలో జంగారెడ్డిగూడెం ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పారు.

పింఛన్ సొమ్ముతో కార్యదర్శి పరార్

సస్పెండ్ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి- సత్యవేడు

చిత్తూరు జిల్లా సత్యవేడు మండలం శిరునంబుదూరు పంచాయతీ కార్యదర్శి నాగరాజు పింఛన్ సొమ్ముతో పరారయ్యాడు. సత్యవేడు ఎంపిడిఒ జ్ఞానేశ్వర్ తెలపిన వివరాల మేరకు.. పింఛన్ సొమ్మును కార్యదర్శి శనివారం బ్యాంక్ నుంచి డ్రా చేశారు. సోమవారం 'పసుపు-కుంకుమ' కార్యక్రమానికి 11 లక్షలతో నాగరాజు రావాల్సి ఉంది. అయితే ఎంతకీ రాకపోవడంతో అనుమానం వచ్చి ఆరా తీయగా ఆచూకీ తెలియలేదు. ఈ మేరకు ఎంపిడిఒతో పాటు స్పెషలాఫీసర్ విజయ్‌భాస్కర్, ఎంపిపి మస్తాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మల్లికార్జున కేసు దర్యాప్తు చేస్తున్నారు. కలెక్టర్ ప్రద్యుమ్న కార్యదర్శిని సస్పెండ్ చేశారు. అతని స్థానంలో వేరే వారిని నియమించి, సొమ్మును ఏర్పాటు చేసి, కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

నాలుగు నెలలుగా వేతనాల్లేవు

అవస్థల్లో అంగన్వాడీ ఆయాలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అంగన్వాడీ ఆయాలకు వేతనాల వేదన తప్పడం లేదు. రాష్ట్రంలోని 13 జిల్లాల పరిధిలోని 53 వేల మందికి నాలుగు నెలలుగా వేతనాలు విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంటుంది. ఒక్కొక్కరికి నెలకు రూ.ఆరు వేల చొప్పున వేతన చెల్లింపులను లెక్కిస్తే నెలకు సుమారు రూ.31 కోట్ల చెల్లింపులు పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. అంగన్వాడీ వర్కర్లకు వేతనాలు చెల్లించి ఆయాల వేతనాల పెండింగ్‌కు గల కారణాలను పరిశీలిస్తే బడ్జెట్ లేకపోవడమే ఓ కారణమని తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు పసుపు కుంకుమ పేరుతో డ్వాక్రాలకు తాయిలాలు అందజేస్తున్న నేపథ్యంలో ఐసిడిఎస్‌కు చెందిన మహిళా ఉద్యోగులకు వేతనాలు విడుదల చేయడంలో మీనమేషాలు లెక్కించడంపై ఆయాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

రాష్ట్రంలోని అంగన్వాడీ, మినీ అంగన్వాడీల పరిధిలో 53 వేల మంది ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. కడప జిల్లాలో 15 అంగన్వాడీ ప్రాజెక్టుల పరిధిలో 2893 మంది, మినీ అంగన్వాడీల పరిధిలో 315 మంది ఆయాలను కలిపి లెక్కిస్తే 3208 మంది ఆయాలు ఉన్నారు. వీరికి పభుత్వం 2018 నవంబర్, డిసెంబర్, 2019 జనవరి, ఫిబ్రవరి మాసాలకు సంబంధించిన వేతనాలను విడుదల చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. ఆయాలకు నెలకు ఆరువేలు చెప్పున కడప జిల్లాకు సంబంధించి సుమారు రూ. 19 కోట్లకుపైగా చెల్లింపులు చేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. నాలుగు నెలల వేతనాలను పరిగణలోకి తీసుకుంటే రూ.80 కోట్లకుపైగా చేరుకునే అవకాశం ఉన్నట్లు ఓ అంచనా. రాష్ట్రంలోని అంగన్వాడీ ఆయాలను వేతనాలను పరిశీలిస్తే కోట్లాది రూపాయలు చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. నెల కిందటి వరకు అంగన్వాడీ వర్కర్లకు సైతం వేతనాలు పెండింగ్ పెట్టిన నేపథ్యంలో తలెత్తిన ఆందోళనలతో రెండు నెలల వేతనాలను విడుదల చేసింది. కానీ అంగన్వాడీ వర్కర్లను, అంగన్వాడీ ఆయాలను విభజించి ఆయాల వేతనాల విడుదలను గాలికి వదిలేసింది.

దీంతో తెలుగింటి పెద్ద పండుగైన సంక్రాంతి పూటా వారికి పస్తులు తప్పని పరిస్థితి ఉత్పన్నమైంది. ఆయాల వేతనాల విడుదల చేయకపోవడానికి గల కారణాలను పరిశీలిస్తే బడ్జెట్ లేకపోవడమే ఓ కారణమని తెలుస్తోంది. వీరికి ఐసిడిఎస్ స్పెషల్ కమిషనర్ కార్యాలయం నుంచి నేరుగా అంగన్వాడీ ఆయాల ఖాతాల్లో వేతనాలను జమ చేయాల్సి ఉన్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలు తరుముతున్న నేపథ్యంలో పసుపు కుంకుమ పేరుతో డ్వాక్రా మహిళలకు అందజేస్తున్న తాయిలాలకు ఉన్న బడ్జెట్ సాటి మహిళా ఉద్యోగులమైన తమకు ఎందుకు లేదని అంగన్వాడీ ఆయాలు నిలదీస్తున్న వైనం కనిపిస్తోంది. ఇదేతరహా పరిస్థితి కొనసాగితే పది రోజుల్లో అంగన్వాడీ యూనియన్‌ల ఆధ్వర్యంలో ఆయాలు ఉద్యమబాట పడతామని సంఘం జిల్లా అధ్యక్షురాలు రాజకుళ్లాయమ్మ తెలిపారు.

త్వరలో వేతనాలు పడతాయ్

ఒక నెలకు సంబంధించి మాత్రమే వేతనం ఇవ్వాల్సి ఉన్నట్లు నా దృష్టికి వచ్చింది. ఇటీవలే అంగన్వాడీ వర్కర్లకు వేతనం పడింది.

- ఎ.పద్మజ,
ఐసిడిఎస్ పీడీ, కడప.

రొద్దం ఎంపిపి రాజీనామా

ప్రజాశక్తి- పెనుకొండ రూరల్

అనంతపురం జిల్లా రొద్దం మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు టిడిపి నాయకురాలు పద్మావతమ్మ సోమవారం తమ పదవికి, ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని జెడ్పీ డిప్యూటీ సిఇఒ సూర్యనారాయణకు అందజేశారు. టిడిపి నాయకుల అరాచకాలను, అన్యాయాలను భరించలేమని చెప్పారు. బిసిలకు సముచిత న్యాయం కల్పిస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో త్వరలోనే చేరుతున్నట్లు ఆమె వెల్లడించారు.



చెట్టెక్కిన చిరుత

అంకంపాలెంలో నలుగురిపై దాడి

ప్రజాశక్తి-ఆత్రేయపురం (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలెంలో సోమవారం తుమ్మలపల్లి గట్టు వద్ద చిరుతపులి హల్‌చల్ చేసింది. పొలానికి పురుగుల మందు కొడుతున్న మెర్ల సూరిబాబు తొలుత దీనిని గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు అక్కడకు చేరుకునే లోపే భీమిరెడ్డి తల్లిబాబు, యాండ్ల చిట్టిబాబు, కరుటూరి నరేష్, నవచర్ల దుర్గా సతీష్‌పై దాడి చేసి గాయపర్చింది. అక్కడ నుంచి కొబ్బరి చెట్టుపైకి ఎక్కేసింది. పోలీసులు రంగప్రవేశం చేసి ఆ ప్రదేశానికి ఎవరినీ వెళ్లకుండా పహారా కాస్తూ, అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. గ్రామంలోకి ఎలా వచ్చిందనే సమాచారం తెలియలేదు. అమలాపురం డిఎస్‌పి రమణ రావులపాలెం సిఐ వి.పెద్దిరాజు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

మిస్టరీగా యువకుని మృతి

ప్రజాశక్తి - పిడుగురాళ్ల

గుంటూరు జిల్లా మాచర్లలో యువకుని మృతి మిస్టరీగా మారింది. పట్టణానికి చెందిన మారెగోటి గోపి (24) ఓ ప్రయివేటు అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున స్థానిక ఓవర్ బ్రిడ్జి కింద ప్రజాశక్తి నగర్ ప్రాంతంలో రైల్వే ట్రాక్ పక్కన గోపి మృతదేహం ఉంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పట్టణ ఎస్‌హెచ్‌ఒ పి.వీరేంద్రబాబు వెళ్లి పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. అయితే ఇది హత్యేనని మృతుని కుటుంబీకులు ఆరోపిపస్తున్నారు. గోపి ఆదివారం రాత్రి కొందరితో మద్యం సేవించాడని, ఈ క్రమంలో గొడవైందని వారు తెలిపారు. స్నేహితుల్లో ఒకరి ద్విచక్ర వాహనం మృతదేహానికి సమీపంలో ఉందని, దానిపై రక్తపు మరకలున్నాయని మృతుని కుటుంబీకులు చెబుతున్నారు. అయినా సరైన ఆధారాలు లభ్యమవ్వని నేపథ్యంలో హత్యా? ప్రమాదమా? ఆత్మహత్యా? అనే ప్రాథమిక నిర్ధారణకు రాలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దారుణాలు

నెల్లూరులో యువతిపై గ్యాంగ్ రేప్

కర్నూలులో బాలికపై అత్యాచారం

ప్రజాశక్తి-నెల్లూరు/కొత్తపల్లి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కర్నూలు జిల్లాల్లో ఓ యువతి, ఓ బాలిక అత్యాచారానికి గురయ్యారు. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట పోలీసులు చెప్పిన వివరాల మేరకు శ్రీసిటీలోని ఓ సెల్‌ఫోన్ కంపెనీలో విజయనగరం జిల్లాకు చెందిన యువతి, కాకినాడకు చెందిన యువకుడు విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు బొకారో ఎక్స్‌ప్రెస్ రైలు కోసం ఆదివారం రాత్రి స్టేషన్‌లో వేచి ఉన్నారు. కొంతమంది ఆకతాయిలు ఇద్దరిని రైల్వే స్టేషన్ చివరి ప్రాంతానికి బలవంతంగా తీసుకెళ్లారు. యువకుడిపై దాడికి పాల్పడడమే కాకుండా ఆ ప్రాంతం నుంచి తరిమివేశారు. అనంతరం యువతిపై అత్యాచారానికి పాల్పడ్డారు. సోమవారం ఉదయం యువకుడు ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకొని రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. తీవ్ర రక్తస్రావమై గాయాలతో బాధపడుతున్న యువతిని పోలీసులు వైద్యచికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరి కొంతమంది పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

కర్నూలు జిల్లాలో జరిగిన మరో ఘటనలో 11 ఏళ్ల బాలిక అత్యాచారానికి గురైంది. కొత్తపల్లి మండలం సింగరాజుపల్లెలో ఏడో తరగతి బాలికపై ఓ మృగాడు అత్యాచారం చేశాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... ఆ బాలిక ఇంటి వద్ద చదువుకుంటోంది. పగిడ్యాల మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన హుస్సేనాలం తన మామ గ్రామమైన సింగరాజుల్లెకు ఆదివారం భార్యతో కలిసి వచ్చాడు. బాలిక తల్లి వితంతు పింఛన్ తీసుకునేందుకు వెళ్లింది. మధ్యాహ్నం ఎవ్వరూ లేకపోవడంతో బాలికకు మాయ మాటలు చెప్పి బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. రక్తస్రావం కావడంతో ఇంటికి వచ్చిన తల్లికి జరిగిన సంఘటనను బాలిక వివరించింది. బాలిక తల్లి గ్రామస్తుల సాయంతో కొత్తపల్లి వైద్యశాలకు తరలించారు. ఆదివారం రాత్రి బాలిక తల్లి కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితునిపై అత్యాచారం, బాలల హక్కుల చట్టం కింద ఎస్ఐ బాబు కేసు నమోదు చేశారు.

నూతన ఆవిష్కరణలకు విద్యార్థులు వారధి కావాలి

- ఎపి నిట్ డైరెక్టర్ సిఎస్‌పి రావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మారుతున్న సాంకేతిక విప్లవానికి అనుగుణంగా నూతన ఆవిష్కరణలకు విద్యార్థులు వారధి కావాలని, అందుకు తగ్గట్టుగా అధ్యాపకులు విద్యాబోధన చేయాలని ఎపి నిట్ డైరెక్టర్ సిఎస్‌పి.రావు అన్నారు. వరంగల్, ఎపి నిట్‌లు సంయుక్తంగా పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలోని ఎపి నిట్ తాత్కాలిక ప్రాంగణంలో ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సోమవారం నిర్వహించారు. ఆరు రోజులపాటు సాగే ఈ కార్యక్రమంలో తొలిరోజు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎపి నిట్ డైరెక్టర్ సిఎస్‌పి.రావు మాట్లాడుతూ వృత్తి నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించవచ్చన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను బయటకు తీసుకొచ్చే విధంగా అధ్యాపకులు కృషి చేయడం ద్వారా అద్భుత ఆవిష్కరణలు సాధించవచ్చున్నారు. దేశ జనాభాలో యువత సంఖ్య ఎక్కువగా ఉన్నా, అద్భుత ఆవిష్కరణల్లో భారతదేశం మూడో స్థానంలో ఉందన్నారు. చైనా ప్రథమ స్థానంలో, రష్యా ద్వితీయ స్థానంలో ఉన్నాయని తెలిపారు. అధ్యాపకుల్లోని ప్రతిభను ప్రోత్సహించడానికి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇంజినీరింగ్ విభాగాధిపతులు డాక్టర్ కార్తీక్, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్, రిజిస్ట్రార్ అంబా ప్రసాద్, డీన్ జిఆర్‌కె శాస్త్రి, అధ్యాపకులు డాక్టర్ రెహ్మాన్, బిందు, నగేష్ భట్టు, గౌతమ్‌రెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, వరంగల్ నిట్, తమిళనాడు నిట్‌లకు చెందిన ఇంజినీరింగ్ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఎస్‌పి రావు

లంచం ఇవ్వలేదని ఇళ్లు కూల్చివేత

ప్రజాశక్తి - కడప

బంట్రోతుకు లంచం ఇవ్వలేదని ఏకంగా ఓ ఇంటినే కూల్చివేశాడు. అధికారికి లంచం ఇవ్వడం కోసం ఓ మహిళా సోమవారం కడప కలెక్టరేట్ ఎదుట భిక్షాటన చేపట్టింది. న్యాయం చేయకపోతే తాను, మా అమ్మ ఆత్మహత్య చేసుకుంటామని ఆ మహిళా పేర్కొంది. బాధితురాలు యమున తెలిపిన వివరాల మేరకు.. లంచం ఇవ్వలేదని రెవెన్యూ సిబ్బంది భగత్‌సింగ్‌నగరలో ఇళ్లు కూల్చివేశారు. ఎంతో కష్టపడి, అప్పులు చేసి రూ.5.75 లక్షల వ్యయంతో ఇళ్లు నిర్మించుకున్నామని పేర్కొన్నారు. బంట్రోతు వెంకటేష్ ఇళ్లకు సంబంధించి లంచం రూ.పది వేలు అడిగారన్నారు. లేదని చెప్పడంతో జెసిబితో ఇంటిని కూల్చివేశారని తెలిపారు. అధికారులు, ఎమ్మెల్యేకు చెప్పినా న్యాయం జరగలేదని చెప్పారు.

ఫుడ్ తయారీ కంపెనీలపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి - భవానీపురం (విజయవాడ)

చిన్నారులు తినే నిమ్మతొనలు, పిప్పరమెంటు బిళ్లలు, బిస్కెట్లు నిబంధనలకు మించి రంగులు, రసాయనాలు కలిపి, అపరిశుభ్రత వాతావరణంలో తయారుచేస్తున్న కంపెనీలపై సోమవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజయవాడలోని పశ్చిమ నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల విజిలెన్స్ ఎస్‌పి హర్షవర్ధనరాజు ఆదేశాల మేరకు సిఐ పోలాకి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నూతలపాటి పూర్ణచంద్రరావు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. శాంపిల్స్‌ను సేకరించి, కంపెనీ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిట్టినగర్ కొండ ప్రాంతంలో రాధా ప్రొడక్ట్స్ పేరుతో రేలంగి జ్యోతీశ్వరస్వామి, మహాలక్ష్మి పేరుతో మరుపిళ్ల రామకృష్ణ, దుర్గాభవానీ స్వీట్స్ పేరుతో ముద్దాన దుర్గారావు, భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కబేళా సెంటర్ ప్రాంతంలో ఫరీదా బ్రాండ్‌తో ఎస్.కె.రఫీ వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నారు. రాధా ప్రొడక్ట్స్, మహాలక్ష్మి కంపెనీల నుంచి సుమారు రూ.లక్ష విలువైన సరుకును స్వాధీనం చేసుకున్నారు.

ఎస్‌పి బాలుకు మాతృవియోగం

నెల్లూరులో నేడు అంత్యక్రియలు

ప్రజాశక్తి-నెల్లూరు

సినీ గాయకులు, నగర వాసి ఎస్‌పి బాలసుబ్రమణ్యం తల్లి శకుంతలమ్మ (90) సోమవారం ఉదయం ఆమె స్వగృహంలోనే మృతిచెందారు. ఆమె కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతుంది. మంగళ వారం సాయంత్రం నగరంలోని బోడిగాడి తోటలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరగనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. తల్లి మృతితో ఎస్‌పి బాలు లండన్ పర్యటనను ముగించుకుని హుటాహుటినా నగరానికి బయల్దేరారు. రేపు ఉదయం నగరానికి చేరుకుంటారని ఆయన సోదరి శైలజ తెలిపారు. శకుంతలమ్మ, సాంబమూర్తి దంపతులకు మొత్తం తొమ్మిది మంది సంతానం. వారిలో ప్రస్తుతం ఆరుగురు జీవించి ఉన్నారు.శకుంతలమ్మ భర్త శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి అప్పట్లో నగరంలో వీధి వీధి తిరుగుతూ త్యాగరాజ కీర్తనలను పాడేవారు. నగరంలో నేటికి జరుగుతోన్న శ్రీ త్యాగరాజు స్మరణోత్సవాల భిక్షాటన కార్యక్రమాన్ని శకుంతలమ్మ తన 'తొలి భిక్ష' వేసి అంకురార్పణ చేస్తుంది. తండ్రి వారసత్వంగా రెండో కుమారుడైన బాలసుబ్రమణ్యంకు సంగీతంపై పట్టు పెంచుకుని గాయకునిగా, సంగీత దర్శకునిగా మారారు. ఎస్‌పి బాలసుబ్రమణ్యంకు అత్యంత సన్నిహితులైన వీరిశెట్టి హజరత్‌బాబు పర్యవేక్షణలో శకుంతలమ్మ అంత్యక్రియలకు ఏర్పాట్లు నిర్వహించనున్నారు. భవంతుల కన్నా ఎంతో కష్టపడి కట్టుకున్న ఇల్లంటేనే మా అమ్మకు ఇష్టమని ఎస్‌పి బాల సుబ్రమణ్యం అనేక సందర్భాల్లో తెలిపారు.



శకుంతలమ్మ

గిరిజన గురుకులాల కార్యదర్శిగా బాలాజీ నాయక్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాలల సొసైటీలో ప్రస్తుతం జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బాలజీ నాయక్‌కు ఆ సొసైటీ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆ మేరకు గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్‌పి సిసోడియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సొసైటీ కార్యదర్శిగా ఉన్న రాములే గిరిజన గురుకులాలకు కూడా కార్యదర్శిగా ఇప్పటి వరకు వ్యవహరిస్తున్నారు. అయితే రాములును ఎస్సీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సొసైటీకే పరిమితం చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి కార్యదర్శిగా ఆ బాధ్యతలు బాలాజీ నాయక్ నిర్వహించనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సాయంలో మోసం

సంపాదకీయం

నాలుగున్నరేళ్లూ రైతులను విస్మరించి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మళ్లీ ఎన్నికలు ముంచుకొస్తున్నాయనగా అన్నదాతలకు మోడీ సర్కారు ప్రకటించిన పెట్టుబడి సాయం సూక్ష్మంలో మోక్షం కూడా కాదు. ఇంతకాలం చేసిన మోసాన్ని మర్చిపోయి రైతాంగం విరగబడి తమకు ఓట్లు గుద్దుతారనుకోవడం అవివేకం. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో రైతులకు రూ.6 వేల సాయం అని మిక్కిలి ఆర్భాటం చేసింది. ఈ పథకానికి 'పిఎం-కిసాన్' అని పేరు పెట్టింది. కార్పొరేట్ కంపెనీలు తమ వస్తువులు అమ్ముకునే సందర్భంలో ఇచ్చే అడ్వర్టయిజ్‌మెంట్లపై పెద్ద అక్షరాల్లో డిస్కౌంట్‌ను పేర్కొని కింద కనపడీ కనపడనట్లు 'షరతులు వర్తిస్తాయి' అని కొర్రి పెడుతుంటాయి. అలాగే కేంద్రం సైతం రైతులకు ఇచ్చే పెట్టుబడి సాయానికి సైతం కండిషన్లు విధించింది. సాయం ఐదెకరాల లోపు సాగు భూమి కలిగిన సన్న, చిన్నకారు రైతులకేనంది. ఎన్ని ఎకరాలకైనా అంతే. ఏడాదిలో మూడు విడతల్లో ప్రతి నాలుగు నెలలకూ రెండు వేలు చొప్పున నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తానంది. గతేడాది డిసెంబర్ నుంచి పథకం అమలవుతుందని చెప్పి ఈ ఏడాది మార్చి లోపు తొలి విడత సొమ్ము రైతులకు అందుతుందని వెల్లడించింది. లబ్ధిదారుల సంఖ్య 12 కోట్లుగా అంచనా వేసింది. జరుగుతున్న సంవత్సరంలోనే రూ.20 వేల కోట్లు ఏడాదికైతే రూ.75 వేల కోట్లు కావాలని ప్రతిపాదించింది. సర్కారు బడ్జెట్ అంకెలు వేల కోట్లుగా కనిపిస్తున్నా వాస్తవంగా రైతుకు దక్కేది బహు స్వల్పం. నెలకు రూ.500 రోజుకు రూ.17 పడుతుంది. కుటుంబంలో సగటున ఐదుగురు సభ్యులు ఉన్నారనుకుంటే ఒక్కొక్కరికి రోజుకు అందేది కేవలం మూడు రూపాయలు. ఈ మొత్తంతోనే ఇక రైతులకు పండగేనని రైతుల ఆదాయాలు రెండింతలవుతాయని మోడీ సర్కారు ఆకాశమే హద్దుగా ప్రచారం లంకించుకుంది.

తెలంగాణలో రైతుబంధు, ఒడిషాలో ఇలాంటి పథకమే ఉండగా తిరగేసి మరగేసిన కేంద్రం ఆ రాష్ట్రాల్లో ఇచ్చిన మేరకైనా సాయం ఇవ్వట్లేదు. తెలంగాణలో ఎకరానికి రూ.4 వేలు చొప్పున ఏడాదికి రూ.8 వేలు పంపిణీ చేసింది. పది వేలకు పెంచుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చింది అక్కడి అధికార టిఆర్ఎస్ పార్టీ. ఒడిషాలో ఏడాదికి పది వేలిస్తున్నారు. కాగా కేంద్రం ఆరు వేలే ఇస్తామంటోంది. వాస్తవానికి రైతు వ్యవసాయానికి చేసే ఖర్చులో కేంద్రం చేసే సాయం ఐదారు శాతం కూడా లేదు. దానికి అర్హత సాధించడం కష్టసాధ్యం. ఎందుకంటే కోట్ల సంఖ్యలో రైతుల పేర్లు భూమి రికార్డుల్లో ఎక్కలేదు. పట్టాలు, ధృవీకరణ పత్రాలు లేవు. గిరిజనుల పరిస్థితి మరీ దారుణం. కోట్లల్లో ఉన్న కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించట్లేదు. నగదు బదిలీ పథకం కింద ఆన్‌లైన్‌లో ఇలాంటి రైతులు పెట్టుబడి సాయానికి అర్హత సాధించడం అసాధ్యం. కేంద్రం ఇస్తానంటున్న పిసరంత సాయమూ అందే పరిస్థితి లేదు. బడ్జెట్‌లో కేంద్రం వ్యవసాయ, అనుబంధ రంగాలకు వడ్డీ రాయితీని ప్రకటించింది. విపత్తుప్రాంత రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు బ్యాంకుల్లో తీసుకుంటున్న రుణాలపై రెండు శాతం వడ్డీ రాయితీ, సకాలంలో రుణాలు చెల్లిస్తే మరో మూడు శాతం వడ్డీ రాయితీ ఇస్తామంది. ప్రస్తుతం చాలా చోట్ల విపత్తు ప్రాంతాలను ప్రభుత్వాలు ప్రకటించట్లేదు. ఒకవేళ గుర్తించినా రుణాల రీషెడ్యూల్ కావట్లేదు. అలాంటప్పుడు రైతులు వడ్డీ రాయితీ పొందడం దుర్లభం. అందుకే సాయంపై సర్కారు కొండంత రాగం తీసినా రైతులు సంబరపడలేదు.

నిజానికి రైతులు కోరుకునేది పంటలకు గిట్టుబాటు ధరలు. గత ఎన్నికల వేళ బిజెపి రైతులకు ఇచ్చిన ప్రధాన హామీ స్వామినాథన్ కమిషన్ సిఫారసులకనుగుణంగా ఒకటిన్నరరెట్ల కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి). ఆ హామీకి మోడీ సర్కారు తిలోదకాలిచ్చింది. మధ్య దళారుల చేతివాటంతో రైతులకు ఎంఎస్‌పి దక్కకపోవడం వలన ఏడాదికి రూ.2 లక్షల కోట్లు నష్టపోతున్నారు. ప్రభుత్వం ఎంఎస్‌పిని నిర్ణయించే క్రమంలో పెడుతున్న కోతల వలన మరిన్ని లక్షల కోట్లు రైతులు కోల్పోతున్నారు. పెట్రోలు, డీజిల్ ధరల పెరుగుదలతో వ్యవసాయ ఖర్చు తడిసి మోపెడవుతోంది. మోడీ ఇలా సాయం ప్రకటించారో లేదో అలా గ్రోమోర్ బస్తా ఖరీదు రూ.300 పెరిగింది. ఎకరం నుంచి ఐదెకరాల్లోపు రైతు నెత్తిన సగటున రూ.2-5 లక్షల అప్పు ఉంది. పరిస్థితి ఇది కాగా కార్పొరేట్లకు ప్రతి ఏడాదీ రూ.లక్షల కోట్ల రాయితీలను దోచిపెడుతున్న బిజెపి సర్కారు దేశానికి అన్నం పెట్టే రైతు దగ్గరకొచ్చేసరికి చెయ్యి రావట్లేదు. రూపాయి రూపాయి లెక్క వేస్తోంది. పంటలకు ఒకటిన్నర రెట్ల ఎంఎస్‌పి, విపత్తు రైతులకు పూర్తి నష్ట పరిహారం, ఉచితంగా సాగు ఉత్పాదకాలు, సంస్థాగత పరపతి. ఇవి రైతు కోరుకుంటున్నవి. అప్పుడే వారికి వ్యవసాయం గిట్టుబాటు అవుతుంది. సాగు ఖర్చు తగ్గుతుంది. ప్రభుత్వం ఇస్తానంటున్న పెట్టుబడి సాయం కంటి తుడుపు చర్య. పక్కా ఓట్ల వేట. మొదటి వాయిదా రూ.రెండు వేలూ ఇచ్చి ఓట్లు కొనుక్కోవాలనుకునే రంధి. ఇలాంటి వంచనాపూరిత పాచికలు ఎల్లకాలం పారవు.

ఇది విషయం



మన గుండెలన్నింటి నడుమ నుండి
ఒక నూతన సంకల్పాన్ని గుచ్చి
అగ్ని జ్వాలా మాలికను గూర్చి
మన చుట్టూ కమ్ముకొచ్చే చీకట్లు దహిద్దాం రండి!
సమాన మానవ వినూతన సమాజాన్ని నిర్మిద్దాం రండి!


\- అద్దేపల్లి రామమోహనరావు

కీలక మలుపులో ఏ.పి రాజకీయాలు

విశ్లేషణ



మోడీ ఏకపక్ష పోకడలపై వ్యక్తిగతంగా విమర్శ చేసినంత తీవ్రంగా బిజెపి విధానాలను టిడిపి విమర్శించడం లేదు. పైగా గతంలో ఎన్‌డిఎతో తాము వున్న కాలం స్వర్ణయుగం అయినట్టు చంద్రబాబు చెప్పుకుంటూనే వున్నారు. మరోవైపున ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్‌ఆర్‌సిపి అధినేత జగన్ రాష్ట్రానికి న్యాయమైన హక్కులు నిరాకరించిన మోడీపై విమర్శ కన్నా వాటిని సాధించలేని అసమర్థత చంద్రబాబుదే అనడానికి ఎక్కువ శ్రద్ధ పెడుతుంటారు.



తెలకపల్లి రవి

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన నిధుల కోసం బంద్ జరుగుతున్న రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సహా పాలక పక్షీయులు శాసనసభకు నల్ల చొక్కాలు ధరించి వచ్చారు. రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం అన్యాయం చేసిందంటూ చంద్రబాబు ప్రదర్శించిన ఆవేశకావేశాలను ఆయనను బలపర్చే మీడియా సోషల్ మీడియా సైట్లు ఆకాశానికెత్తాయి. బిజెపి నాయకుడు విష్ణు కుమార్ రాజు తాము రాష్ట్రానికి ఎంతో చేస్తే ముఖ్యమంత్రి అదంతా కప్పిపుచ్చుతున్నారని కట్టు కథలు చెప్పడం దానిపై ఆయన మరింత వూగిపోవడం కథను ఇంకా రక్తి కట్టించింది. అయితే ఈ ఆవేశం ఆలస్యపు ఆయాసం వంటిదే తప్ప అక్కరకు వచ్చేది కాదని అందరికీ తెలుసు. ఎందుకంటే కొద్ది రోజుల్లోనే కొత్త ఎన్నికలకు నోటిఫికేషన్ రాబోతున్నది. నాలుగేళ్ల నాలుగు మాసాలు మోడీకి మోకరిల్లిన తెలుగుదేశం నేతలు ఇప్పుడు ఎంతగా మోత మోగించినా కంచు మోతే అవుతుంది తప్ప కలిగే ప్రయోజనం శూన్యం. ముఖ్యమంత్రి నిర్వహించిన అఖిలపక్ష సమావేశం కూడా ఈ కారణంగానే అధికార పక్ష సమావేశమైపోయి ప్రధాన ప్రతిపక్షాలేమీ లేకుండా ముగిసింది. హోదా కోసం పోరాడినందుకు పెట్టిన కేసులు ఎత్తివేస్తామని ఈ సందర్భంగా హామీనివ్వడం ప్రభుత్వ గత వైఖరికి అద్దం పట్టింది. ఇప్పుడు కూడా వెంకయ్య నాయుడు వుంటే ఏదో ఉద్ధరించేవారన్నట్టు ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేయడం ఇప్పటికీ బిజెపిపై ప్రేమ పూర్తిగా చావలేదని స్పష్టం చేసింది. మోడీ ఏకపక్ష పోకడలపై వ్యక్తిగతంగా విమర్శ చేసినంత తీవ్రంగా బిజెపి విధానాలను టిడిపి విమర్శించడం లేదు. పైగా గతంలో ఎన్‌డిఎతో తాము వున్న కాలం స్వర్ణయుగం అయినట్టు చంద్రబాబు చెప్పుకుంటూనే వున్నారు.

జగన్నాటకం, చంద్ర పురాణం

మరోవైపున ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్‌ఆర్‌సిపి అధినేత జగన్ రాష్ట్రానికి న్యాయమైన హక్కులు నిరాకరించిన మోడీపై విమర్శ కన్నా వాటిని సాధించలేని అసమర్థత చంద్రబాబుదే అనడానికి ఎక్కువ శ్రద్ధ పెడుతుంటారు. మొన్నటికి మొన్న బడ్జెట్‌లో ఏ.పికి మరోసారి శూన్యహస్తం చూపితే దాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వపు అసమర్థతగా ఆపాదించే ప్రయత్నం చేశారు. కేంద్రంలో హంగ్ రావాలని, అప్పుడు కాంగ్రెస్ బిజెపిలలో ఎవరు ప్రత్యేక హోదా ఇస్తే వారికి మద్దతు తెల్పుతానని దాటవేస్తున్నారు. అంటే ఇప్పటి వరకూ హోదాతో సహా అన్నిటికి ఎగనామం పెట్టిన బిజెపిపై ఇంకా ఆశలు కొనసాగిస్తున్నారు. కాని కాంగ్రెస్ హోదా ఇస్తానని ఇప్పటికే చెప్పిన దానిపై స్పందించడం లేదు. ఇక దేశానికి కాంగ్రెస్ రాహుల్‌గాంధీ నాయకత్వమే శరణ్యమని పర్యటనల పరంపర చేపట్టిన చంద్రబాబు స్వరాష్ట్రంలో మాత్రం హోదాకు హామీ ఇచ్చినా పొత్తు పెట్టుకోవడం లేదంటున్నారు. పైగా కాంగ్రెస్ ఘనా పాటీలను తన పార్టీలో చేర్చుకుని పునరావాసం కల్పిస్తున్నారు. ఎలాంటి నీతి, నియతి, నిబద్ధత లేకుండా తాము మళ్లీ అధికారంలోకి రావడమే ఏకైక అవసరంగా ప్రచారకాండలో ముంచెత్తుతున్నారు. అసలు ప్రభుత్వమంటేనే ప్రచార సంస్థ అన్నట్టు అమరావతి, పోలవరంతో సహా ప్రతి చోటికి టూరిస్టు బస్సులు నడిపిస్తూ ప్రభుత్వ ధనం కోట్ల కొద్దీ కుమ్మరిస్తున్నారు. ఆపద మొక్కుల్లాగా ఆఖరి క్షణంలోనూ ఆదరాబాదరాగా పెన్షన్ల పెంపుదల, పసుపు కుంకుమ పంపకం వంటి చిట్కాలతో గట్టెక్కాలనుకుంటున్నారు. అయితే 'అవి మా పథకాలకు కాపీ' అని వైసీపీ వారు టముకు వేసు కుంటున్నారు. అసలు ఆర్థిక లోటుతో అప్పుల పాలవు తున్న సమయంలో నిధులు లేని సహాయ పథకాలు ఎంతకాలం ఎలా అమలవుతాయనే మౌలిక ప్రశ్నను ఉభయులూ దాటేస్తూ 'మేము మళ్లీ వస్తాం' అని ఒకరు, 'మేము వచ్చేసినట్టే' అని మరొకరు ఆత్మానందంలో మునిగి తేలుతున్నారు. మాజీ ఎం.పి ఉండవల్లి అరుణ్ కుమార్ వంటి వారు ఈ వర్తమాన వాస్తవాలపై పోరాడే బదులు కాంగ్రెస్ బిజెపిలలో ఎవరిని విమర్శించ వద్దంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఇప్పటి వరకూ జరగని దాన్ని ఈ ఎన్నికలలోనైనా చొక్కా పట్టుకుని సాధించుకుందామని చెప్పడానికి బదులు వచ్చే ఎన్నికల తర్వాత అందరం కలసి వుండాలని పెద్దమనిషి మాటలు చెబుతున్నారు. బిజెపి కేంద్ర ప్రభుత్వం ఆఖరి బడ్జెట్‌లో కూడా ఆశలు ఆవిరి చేయడం ఒకటైతే ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్ షా స్వయంగా వచ్చి చాలా చేశామని చెప్పుకుంటున్న నేపథ్యం చూస్తే ఉండవల్లి వంటి వారి వైఖరిలో డొల్లతనం తెలుస్తుంది. 16వ లోక్‌సభ ముగిసిపోతుంటే 15వ లోక్‌సభ నాటి విషయాలపై 17వ లోక్‌సభలో ఏదో చేయాలనుకోవడం రాజ్యాంగ రీత్యా కుదిరేది కాదు. అవి తేలవలసింది న్యాయస్థానంలో తప్ప పార్లమెంటులో కాదని ఉండవల్లికి బాగా తెలుసు. అయినా తన శైలిలో తాను చర్చను పక్కకు తీసుకుపోవడానికి ప్రయత్నించడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

వదంతుల మధ్య వాస్తవ చిత్రం

ఇదే విధమైన రాజకీయ గజిబిజిని ఎన్నికల పోరాటంలోనూ తీసుకురావడానికి సర్వేలను, సంకేతాలను సాధనాలుగా చేసుకోవడం మరింత అభ్యంతరకరం. టిడిపి వైసీపీ రెండూ బొమ్మ బొరుసులో ఒకే విధానాలు, వాగ్దానాలలో ముంచేస్తుంటే జనసేన, వామపక్షాల ఉమ్మడి ప్రకటన కీలకాంశాలలో ప్రత్యామ్నాయ విధానాలను ఆవిష్కరించింది. రాష్ట్రంలో ప్రకృతి వనరులు, పర్యావరణ పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారాలతో పాటు కేంద్రం నుంచి ప్రత్యేక హోదా సాధన, మతతత్వ రాజకీయాలపై పోరాటం వంటి జాతీయ సవాళ్లను కూడా మేళవించి సమగ్ర ప్రకటన వెలువరించింది. ఎన్నికలలో కూడా కలసి వెళ్లడానికి మూడు పార్టీల నేతలు స్పష్టతనిచ్చారు. ఇప్పటివరకూ రాష్ట్రంలో ఈ విధమైన ఉమ్మడి వేదిక గాని, విధాన ప్రణాళిక గాని ముందుకు రాలేదు. అయినా సరే దీనికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత నిచ్చే బదులు పవన్ కళ్యాణ్ టిడిపితోనో వైసీపీతోనో వెళతారన్నట్టు రెండు పార్టీల నేతలు పోటీ పడి సంకేతాలిచ్చారు. అనుకూల మీడియాలలో చర్చలు చేయించారు. ఆ రెండు పార్టీల ఎం.పిలు మాట్లాడారు. వాటిని పవన్ సుస్పష్టంగా ఖండించి వామపక్షాలతో మాత్రమే సర్దుబాట్లు చేసుకుంటామని తేల్చి చెప్పారు. అయినా సరే బిజెపిని వ్యతిరేకించడం కోసం వామపక్షాలు కూడా తమతో వస్తాయని టిడిపి దిగువ స్థాయిలో చాలా ఊహాగానాలు వదిలింది. సిపిఐ గురించి కథనాలు ప్రసారం చేయించింది. ఇరు పార్టీల జాతీయ నాయకులు సురవరం సుధాకర రెడ్డి, బి.వి.రాఘవులుతో సహా రాష్ట్ర నాయకత్వం కూడా జనసేన అధినేతతో రౌండ్ టేబుల్ జరిపి రాజకీయ ప్రకటన చేసిన తర్వాత వీటన్నిటికి స్వస్తి చెప్పినట్టయింది. అంతేగాక వచ్చే ఎన్నికల పోరాటం ఏ అంశాలపై కేంద్రీకరించాలో కూడా దిశా నిర్దేశం జరిగింది. గత కొన్ని ఎన్నికల్లో ఎప్పుడూ చూడని విలక్షణ పరిణామం ఇది. రాష్ట్రంలో టీడీపీ వైసీపీ కేంద్రంలో బిజెపి, కాంగ్రెస్‌ల మధ్యనే గిరికీలు కొట్టాలని చెప్పే ధోరణికి భిన్నమైన తృతీయ శక్తి ముందుకు రావడం రాష్ట్రానికి, దేశానికి కూడా ప్రాధాన్యత గల అంశం.

సర్వేల గారడిలో సత్యాసత్యాలు

ఈ మూడో శక్తిని అస్సలు పరిగణనలోకి తీసుకోకుండా ఎన్నికల సర్వేలు వెలువడటం కావాలని కళ్లు మూసుకోవడమే. సి ఓటర్ రిపబ్లిక్ టీవీ మొదట, టైమ్స్ నౌ ఆ తర్వాత వెలువరించిన సర్వేలలో వైసీపీకి 21 నుంచి 23 లోక్‌సభ స్థానాలు వచ్చేస్తాయని జోస్యాలు చెప్పాయి (సహజంగానే తెలంగాణలో టిఆర్ఎస్‌కు అత్యధిక స్థానాలు చూపించాయి). ఏ.పి వరకే చూడకుండా ఈ సర్వేలు ఇచ్చిన జాతీయ చిత్రం తీసుకుంటే బిజెపిని ఇప్పటికి చాలా పెద్ద శక్తిగా చూపే ప్రయత్నమని తెలిసిపోతుంది. 200 నుంచి 230 వరకూ ఆ పార్టీకి ఒంటరిగా వస్తాయని చెప్పడమంటే అనేక శాసనసభ ఎన్నికల ఉప ఎన్నికల ఫలితాలను ఉపేక్షించడమే అవుతుంది. ప్రత్యక్షంగా పలు రాష్ట్రాలు చేజార్చుకున్న బిజెపి, టిడిపి, శివసేన, ఎజిపి వంటి మిత్రపక్షాలను కూడా పోగొట్టుకుంది. ఆ పార్టీ నాయకులే కొందరు దూరమైనారు. ఆర్‌బిఐ, సిబిఐ, సుప్రీం కోర్టు, ఎన్ఎస్ఎస్ఓ వంటి జాతీయ సంస్థలే దుమారం చూశాయి. ఇక్కడ పోయే సీట్లను ఈశాన్యాన తెచ్చుకోవాలనుకుంటే పౌరసత్వ బిల్లుతో అది పూర్తిగా దూరమైంది. దాదాపు 200 స్థానాలున్న రాష్ట్రాలలో బిజెపి ఎదురీదుతుంటే దాన్ని పెద్దగా చూపి వైసీపీకి వచ్చే 23 స్థానాలు కూడా తోడవుతాయన్నట్టు చిత్రించడం అవాస్తవికతకు అద్దం పడుతుంది. సి వోటరు సర్వే 2014లోనూ వైసీపీ అధికారంలోకి వస్తున్నట్టు చెప్పింది. 2019 నవంబరులో తెలంగాణలో మహాకూటమికి విజయం వస్తుందని జోస్యం చెప్పింది. దాని విశ్వసనీయత ఏపాటిదో తెలియడానికి ఈ రెండు ఉదాహరణలు చాలు. ఇక టిడిపి కూడా ఆఖరి దాకా అంటకాగి జంట కట్టిన బిజెపిపై ఇప్పుడు ధర్మపోరాటాలు చేయొచ్చు గాని మర్మం తెలుసుకోలేనంత అమాయకులు ఎవరూ వుండరు. పాలనా పరమైన అవకతవకలు, అవినీతి ఆరోపణలు, రాజధాని రగడలు, పోలవరం పోరాటాలు ఇవన్నీ ప్రజలను ప్రభావితం చేయకుండా పోవు. వీడియో సమావేశాల్లో ముఖ్యమంత్రి అసహనం ఇందుకు ఒక నిదర్శనం. అధికార పక్షంలో అభద్రత కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నది గనకనే అటూ ఇటూ వలసలు ఆగడం లేదు. జనసేన లోకి కూడా మాజీ మంత్రులు, స్పీకర్లు, ప్రజా ప్రతినిధులతో సహా రావడం దానిపై పెరుగుతున్న భరోసాకు ఒక ఉదాహరణ. వచ్చే వారి గతం ఏదైనా వచ్చిన తర్వాత గాడి తప్పకుండా చూసుకుంటానని పవన్ కళ్యాణ్ చెప్పడంలోనూ వాస్తవికత కనిపిస్తుంది. బడా పార్టీలు కోట్ల ఖర్చుతో చేసే సమీకరణలూ సభలూ జనసేన కేవలం ప్రజాభిమానంతో చేయడం విస్మరించరాని విషయం. వామపక్షాల ఉద్యమాలు, జనసేనతో సహా రాష్ట్ర వ్యాపితంగా వాటి ప్రత్యామ్నాయ ప్రచార కార్యక్రమం సన్నాహాలు, సంప్రదింపులు జోరుగా సాగడం మూడో మార్గం చూపిస్తున్నది. ఈ శక్తి ఎన్నికల్లోనూ బలీయమైన ప్రభావం చూపడం తథ్యం. ఆ విధంగా ఫలితాన్ని కూడా మలుపు తిప్పొచ్చు. కేంద్రంలో హంగ్ వస్తుందని జోస్యం చెబుతున్న జగన్ రాష్ట్రంలోనూ అందుకు సిద్ధం కావచ్చు. ఇక మోడీ మళ్లీ రారని బల్లగుద్ది చెబుతున్న చంద్రబాబు తమ పునరాగమనం కూడా ఏకపక్షంగా జరగదని తెలుసుకోవచ్చు. కర్నాటకలో ఫలితాలే ఏ.పి లోనూ పునరావృతం కావచ్చని పవన్ అంటున్న మాటను తోసిపారేయడానికి లేదు. ఏ.పిలో రెండు పార్టీల గుత్తాధిపత్యం బద్దలయ్యే సన్నివేశం స్వాగతించదగింది.

'ముద్ర' రుణాల అసలు భాగోతం

విశ్లేషణ


ఎంవిఎస్ శర్మ

జాతీయ గణాంకాల సంస్థ, సిఎంఐఇ (సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ) మోడీ హయాంలో రికార్డు స్థాయిలో పెరిగిన నిరుద్యోగం గురించిన వాస్తవాలను బైటపెట్టాయి. తిమ్మిని బమ్మిని చేయడంలో ఆరితేరిన మోడీ దళం తమ ప్రభుత్వం రికార్డు స్థాయిలో ఉపాధి కల్పించిందన్న బూటకపు ప్రచారాన్ని ఆరంభించాయి. ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగంలో సైతం ఉపాధి కల్పనపై అవాస్తవాలే మాట్లాడారు. అయితే రిజర్వు బ్యాంకు లెక్కలు ఈ బూటకపు ప్రచారం అసలు రంగును బైటపెడుతున్నాయి.

మొదటి బూటకం : 'ముద్ర' రుణాల ద్వారా 15.5 కోట్ల మందికి ఉపాధి కల్పించాం.

వాస్తవం : 'ముద్ర' రుణాలకు, ఉపాధికి ఉన్న సంబంధం ఏంటి? ఇదివరకే వ్యాపారాలు చేసుకుంటున్న వారు కూడా రుణాలు తీసుకుంటారు. వారికి కొత్తగా ప్రభుత్వం కల్పించిన ఉపాధి ఏమీ లేదు.

పైగా 90 శాతం 'ముద్ర' రుణాలు రూ.50 వేలు, అంతకన్నా తక్కువ. నిజానికి ఈ తరహా రుణాలు సగటు రూ.23,000. ఇంత చిన్న మొత్తంతో పొందగలిగే ఉపాధి ఎంత? నెలకు వచ్చే ఆదాయం ఎంత? కుటుంబం సంగతి పక్కనబెట్టి అసలు ఒక వ్యక్తి అయినా బతకగలిగే ఆదాయం ఇంతచిన్న రుణంతో సాధ్యమా? బహుశా అందుకే రిజర్వుబ్యాంకు 'ముద్ర' రుణాల ద్వారా ఎందరికి ఉపాధి దొరికింది అన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా దాటవేసింది. మరి ఆర్థికమంత్రి ఏ ప్రాతిపదికన 15.5 కోట్ల మందికి 'ముద్ర' రుణాల ద్వారా ఉపాధి కల్పించాం అని చెప్పుకున్నారో తెలియదు. వాదన కోసం ఉపాధి కల్పన జరిగిందనుకున్నా, ఈ దేశంలో కోట్లాదిమంది విద్యావంతులైన, సాంకేతిక నైపుణ్యాలు కలిగిన యువత ఆకాంక్షలకు, 'ముద్ర' ద్వారా చిన్న చిన్న వ్యాపారాల నిమిత్తం ఇచ్చే రుణాలకు ఏమైనా పొంతన ఉందా? ఓలా, ఉబర్ క్యాబ్‌లలో పార్ట్ టైం/ఫుల్ టైం పని చేసే వారందరినీ ఉదాహరణగా చూపి ఆర్థికమంత్రి జబ్బలు చరచుకోవడం నిరుద్యోగ యువత సామర్థ్యానికి, శక్తియుక్తులను అవహేళన చేయడం కాదా?



రెండవ బూటకం : 'మా ప్రభుత్వం వచ్చాకనే 'ముద్ర' రుణాలను అనూహ్యంగా పెంచి ఇప్పటికి రూ.7,30,000 కోట్ల రుణాలను మంజూరు చేశాం.

వాస్తవం : మోడీ ప్రభుత్వం రాక మునుపు కూడా మైక్రో, స్మాల్, మీడియం రుణాలను బ్యాంకులు ఇస్తూనే వున్నాయి. వాటికే 'ముద్ర' అని మోడీ ఒక ముద్ర వేసి తన గొప్పగా చెప్పుకుంటున్నారు. ఆర్‌బిఐ వివరాలలోకి పోయి చూస్తే మైక్రో ఫైనాన్స్ రుణాలు పెరుగుతున్న శాతం ఇలా వుంది.

2013 : 50 శాతం, 2014 : 60 శాతం (ఈ రెండు సంవత్సరాలూ యుపిఎ-2 హయాంలో) 2015 : 22 శాతం, 2016 : 24 శాతం, 2017 : 67 శాతం. అంతేకాదు, మొత్తం బ్యాంకులు ఇచ్చే రుణాలలో 'ముద్ర' రుణాల శాతం చాలా తక్కువగా వుంది. 2015లో 1.3 శాతం 2016లో 1.4 శాతం, 2017లో 0.4 శాతం మాత్రమే 'ముద్ర' రుణాలు.

కనుక పీయుష్ గోయెల్ పార్లమెంటు సాక్షిగా దేశాన్ని తప్పుదోవ పట్టించారని రిజర్వు బ్యాంకు గణాంకాలే చెబుతున్నాయి.

నేరుగా నిరుద్యోగం పెరిగిందని గణాంకాలు తెలియజేయడంతో వాటిని తొక్కిపట్టి దొడ్డి దారిలో వంకర వాదనలతో నాటకాలాడుతోంది మోడీ ప్రభుత్వం.

అభిప్రాయం

ఆడపిల్లను బతకనివ్వండి

ప్రపంచ వ్యాప్తంగా 100 కోట్లకు పైగా ఆడపిల్లలున్నారు. లాత్వియా, లిథియోనియా వంటి కొన్ని యూరప్ దేశాలను మినహాయిస్తే మిగిలిన దేశాలలో బాలుర సంఖ్యతో పోలిస్తే బాలికల సంఖ్య తగ్గుతోంది. మన దేశంలో కేరళ, పుదుచ్చేరి వంటి ప్రాంతాలలో ఆడపిల్లల పరిస్థితి ఆశాజనకంగా ఉంది. అయితే బీహార్, అరుణాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలలో ఆడపిల్లల సంఖ్యతో పాటు, వారి అక్షరాస్యతా శాతం కూడా చాలా తక్కువగా ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం మన దేశంలో ప్రతి 1000 మంది బాలురకు కేవలం 918 మంది ఆడపిల్లలు మాత్రమే ఉన్నారు (0 నుండి 6). 2031 నాటికి ఆ సంఖ్య మరింత తగ్గే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయి. స్కానింగ్ సెంటర్లపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల, కొంత మంది తల్లిదండ్రుల మూఢ నమ్మకాల వల్ల భ్రూణహత్యలు పెరుగుతున్నాయి. అధికార లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో 14 వేల మంది బాలికలు బడి బయట వున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పాఠశాలల్లో పార్ట్ టైం బోధకులు డ్రాయింగ్, కుట్టుపని వంటి వాటిల్లో శిక్షణ ఇస్తున్నారు. వీరిని శాశ్వత ప్రాతిపదికన పుల్‌టైమ్ బోధకులుగా మార్చాలి. గతంలో ఏర్పాటు చేసిన మహిళా ప్రాంగణాలను మరింత పటిష్టం చేసి బాలికలకు, యువతులకు వారికి నచ్చిన రంగంలో శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించాలి. నేటి బాలికే రేపటి మహిళ. అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఇచ్చిన ప్రాధాన్యతను బాలికా దినోత్సవానికీ ఇవ్వాలి. వివాహం జరిపించే వివిధ మతాధిపతులకు షరతులతో కూడిన లైసెన్స్‌లను మంజూరు చేయాలి. వివాహ రిజిస్ట్రేషన్లపై చైతన్యం తేవాలి. తద్వారా బాల్య వివాహాలకు కొంత మేర అడ్డుకట్ట వేయవచ్చు. అప్పుడే మలాలా అన్నట్లు 'ఈ ప్రపంచంలోకి వచ్చిన ప్రతి చిన్నారికి చదువుకొనే హక్కు ఉంది. విద్య ద్వారానే బాలికా సాధికారత సాధ్యమౌతుంది'.

యం. ఆర్. ప్రదీప్

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా

editpageps@gmail.com

ఆగనున్న ఆర్టీసి చక్రాలు

సందర్భం



సిహెచ్ సుందరయ్య

ఏపిఎస్ ఆర్టీసి సంస్థ రక్షణ, కార్మికుల సర్వీసు కండిషన్ల మెరుగు, 2017 ఏప్రిల్ నుండి రావలసిన వేతన ఒప్పందం సమస్యలను పరిష్కరించాలని ఫిబ్రవరి 6 నుండి ఆర్టీసి కార్మికులు సమ్మెకు వెళ్తున్నారు. సమ్మెకు సన్నాహంగా ఆర్టీసిలోని 8 సంఘాలు, అసోసియేషన్ల జెఏసి, డిపోలలో గేట్ మీటింగ్‌లు, నిరాహార దీక్షలు జరిపింది. రీజినల్ కేంద్రాలలో ప్రదర్శనలు, ధర్నాలు, రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు, మానవ హారాలు చేసింది. సమ్మెకు మద్దతుగా వివిధ రాజకీయ పార్టీలు, ట్రేడ్ యూనియన్లతో సదస్సు జరపాలని సమ్మెకు ప్రజలు మద్దతు కోరాలని ఫిబ్రవరి 4న విజయవాడలో జెఏసి పిలుపునిచ్చింది. అయినా యాజమాన్యం, ప్రభుత్వం నుండి స్పందన లేదు. చర్చల ద్వారా పరిష్కారం చేయాలని ప్రభుత్వానికి లేదు.

ఆర్టీసి మీద కక్ష!

రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసి పట్ల, కార్మికుల పట్ల వివక్షతతో వ్యవహరిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీసిలకు బడ్జెట్‌లో చట్ట ప్రకారం కేటాయించాల్సిన 1:2 నిధులు నిలిపివేయడమే దీనికి కారణం. మరో వైపు ఆర్టీసికి వస్తున్న ఆదాయంలో 21 శాతం వివిధ పన్నుల రూపేణా ప్రభుత్వాలకు వెళ్తున్నది. డీజిల్‌పై సేల్స్ టాక్స్ 27.5 శాతం వరకు ఉన్నది. రైల్వే డీజిల్‌కు 4 శాతం, విమాన ఇంధనానికి ఒక శాతం పన్నులు ఉన్నాయి. ఆర్టీసి బస్సును ఒక కి॥మీ దూరం నడిపినందుకు పన్ను రూపేణా రూ.7 చెల్లించవలసి వస్తోంది. ప్రైవేట్ బస్సుల అక్రమ రవాణా వలన ఆర్టీసి సాలీనా రూ.15 వందల కోట్లు నష్టపోతునట్లు అధికారిక లెక్కలే చెప్తున్నాయి. డీజిల్‌పై ఎక్సైజ్ టాక్స్ రూపంలో ఆర్టీసి, కేంద్రానికి సాలీనా రూ.300 కోట్లు అదనంగా చెల్లిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన 'ఫైనాన్సు రిఫామ్స్ కమిటీ' ఆర్టీసి బస్సులపై వాహన పన్ను రెండు శాతానికి మించరాదని చెప్పింది. గ్రామీణ ప్రాంతాలకు నడిపే బస్సులకు మొత్తంగా యం.వి పన్నులు ఉండకూడదని, ప్రజల అవసరాల కోసం గ్రామీణ ప్రాంతాలకు బస్సులు నడపడం వల్ల నిర్వహణ ఖర్చు కూడా ఆర్టీసికి రాదు కాబట్టి, ఈ పన్నులు తొలగించాలని 'ఐఐయం బెంగుళూర్ సంస్థ' సూచించింది. అయితే ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను అమలు చేయలేదు.

కేరళ వామపక్ష ప్రభుత్వ విశిష్టత

కేరళ వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం తొలి బడ్జెట్‌లోనే ఆర్టీసి బస్సుల కొనుగోలుకు సాలీనా రూ.1000 కోట్లు చొప్పున రూ.3000 కోట్లు చెల్లిస్తామని ప్రకటించారు. కేరళ ఆర్టీసి కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పింఛను సౌకర్యం ఉంది. దీనిని కేఎస్ ఆర్టీసి సకాలంలో చెల్లించలేకపోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వమే ముందుకు వచ్చి 50 శాతం పింఛను ఖర్చును భరిస్తోంది. ప్రతి నెల తన ఖజానా నుండి ఆర్టీసి కార్మికుల వేతనాల కోసం సర్దుబాటు చేస్తున్నది. 2019-20 బడ్జెట్‌లో కూడా ఈ విధమైన సహకారాన్ని కేరళ ఆర్టీసికి అందిస్తున్నట్లు ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. 2023కి కేరళలోని మొత్తం ఆర్టీసి బస్సులను విద్యుత్ బస్సులుగా మార్చే బాధ్యతను తీసుకొంటామని అక్కడ ఆర్టీసికి రాష్ట్ర ప్రభుత్వం భరోసా ఇచ్చింది. విద్యుత్ వాహనాలపై యం.వి పన్నులను రద్దు చేస్తున్నట్లు కూడా నిర్ణయించింది. పైగా ప్రభుత్వమే రెండు వేల బస్సులను కొని ఆర్టీసికి ఇచ్చింది. కేరళ ఆర్టీసికి ప్రభుత్వం వయబులిటీ గ్యాప్ ఫండింగ్ చేస్తున్నది. ఫలితంగా నేడు కేరళ ఆర్టీసి ఇబ్బందుల నుండి కోలుకుంటూ తన సొంత నిధుల నుండి కార్మికులకు వేతనాలు ఇచ్చే స్థితికి చేరింది.

గతేడాది బడ్జెట్‌లో తమిళనాడు ప్రభుత్వం ఆర్టీసికి రు.3,394 కోట్లు కేటాయించింది. 2011-18 మధ్య ఏడేళ్ళలో రూ.16 వేల కోట్లు కేటాయింపు చేసింది. ఆర్టీసి వినియోగించే డీజిల్‌పై సేల్స్ టాక్స్ మినహాయింపును బడ్జెట్ ద్వారానే అక్కడి ప్రభుత్వం ఇస్తుంది. కేరళ ఆర్టీసి కార్మికులకు ఉన్నట్లుగానే తమిళనాడు ఆర్టీసి కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల పింఛను ఉన్నది. దీని చెల్లింపులకు తమిళనాడు ప్రభుత్వం బడ్జెట్ నిధులు కేటాయిస్తుంది. ఉత్తరాదిన వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఈవిధమైన సహకారాన్ని అందిస్తున్నాయి. కర్నాటక ప్రభుత్వం ఆర్టీసి బస్సులపై మోటారు వాహన పన్ను రద్దు చేసింది. కొత్త బస్సుల కొనుగోలుకు నిధులు మంజూరు చేసింది. కాని ఏపిఎస్ ఆర్టీసి కార్మికులకు, కార్మికుల సంక్షేమానికి గాని, రిటైర్ ఉద్యోగుల సంక్షేమానికి గాని, వారికి కనీస పింఛనుకు గాని రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రుపాయి కూడా ఖర్చు పెట్టలేదు. పైగా అద్దె బస్సులను ఆర్టీసిపై బలవంతంగా రుద్దింది.

దేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తప్ప ఎక్కడా అద్దె బస్సు విధానం లేదు. నేడు 23 శాతం అద్దె బస్సులు ఆర్టీసిలో ఉన్నాయి. ఈ బస్సులో పని చేస్తున్న కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కూడా లేవు. సమాన పనికి సమాన వేతనం లేదు. ఈ అద్దె బస్సులు గుదిబండగా మారాయి. ఆర్టీసి టికెట్ల ద్వారా వచ్చే సాలీనా రూ.5,550 కోట్ల ఆదాయంలో రూ.1,000 కోట్లు అద్దె బస్సుల అద్దె చెల్లింపులకే పోతుంది. ప్రభుత్వ విధానాల ఫలితంగా వచ్చిన నష్టాలకు యాజమాన్యం చేసిన అప్పులకు రోజుకు రూ.2 కోట్లు వడ్డీలకే పోతున్నది. తమ విధానాల పర్యవసానంగా వచ్చిన నష్టాలను సాకుగా చూపించి కార్మికుల వేతన ఒప్పందం వంటి ప్రధాన సమస్యలు పరిష్కారం చేయడం లేదు. ఇతర ఆర్టీసి కార్మికులకు ఉన్న బోనస్ వంటి సౌకర్యాలు రాష్ట్ర ఆర్టీసి కార్మికులకు లేవు. ఇటీవల గ్రాట్యుటీని తగ్గించేలా యాజమాన్యం సర్క్యులర్ ఉత్తర్వులు ఇచ్చింది. సిబ్బందిని కుదిస్తున్నది. నాలుగేళ్ళలో 10 వేల మంది సిబ్బంది తగ్గిపోయారు. తీవ్ర ఒత్తిడి ఫలితంగా కార్మికుల అకాల మరణాలు పెరిగాయి. కార్మిక వ్యతిరేక రెగ్యులేషన్లను మార్పు చేసి, సిబ్బంది నియామకాలు చేపట్టి, ప్రజావసరాలకు సరిపడా బస్సులను వేసి, కార్మికుల సర్వీస్ కండిషన్లను మెరుగు చెయ్యాలని కార్మికులు కోరుతున్నారు. కార్మికుల కృషి ఫలితంగానే నేడు ప్రయాణికుల ఆక్యుపెన్సీ 80 శాతం మించి వున్నది. 13 శాతం ఓఆర్ వృద్ధి సాధించింది. సాలీనా ఒక శాతం ఓఆర్ వృద్ధికి రూ.62.5 కోట్లు అదనపు ఆదాయం వస్తుంది. ప్రజలందించిన సహకారం, ఆర్టీసి కార్మికుల అనితర త్యాగ ఫలితం, పట్టుదలతో కూడిన కృషి ఫలితంగానే ఇది సాధ్యం అయ్యింది. ఈ విధమైన ఫలితాలు సాధిస్తున్న ఆర్టీసి కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న సౌకర్యాలు లేవు. నష్టాల పేరుతో ఆర్టీసి కార్మికులకు కోత వేయడం ప్రభుత్వానికి తగదు.



రేపటి నుండి రాష్ట్ర వ్యాప్త సమ్మె

ఆర్టీసి జెఏసి రూ.3720 కోట్లు బడ్జెట్ కేటాయింపులు చెయ్యాలని డిమాండ్ చేస్తున్నది. విద్యుత్ బస్సుల కొనుగోలుకు, ఆర్టీసి కార్మికులకు పింఛన్ సౌకర్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలి. చర్చల ద్వారా పరిష్కారం కాకపోతే ప్రజల మద్దతుతో సమ్మెకు పోవాలని ఆర్టీసి జెఏసి నిర్ణయించింది.

(రచయిత ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, జెఏసి కో-కన్వీనర్)



ఖర్జూరంతో రక్తహీనతకు చెక్!

ఎండు ఖర్జూరాలు ఆరోగ్యానికి చాలామంచిదని మనందరికీ తెలుసు. అయితే వీటిని తేనెలో వారంరోజులు పాటు నానబెట్టి తినడం వల్ల బోలెడు ఆరోగ్య ప్రయోజనాలను సొంతం చేసుకోవచ్చు. అవేంటో చూద్దాం..

ఖర్జూరం తినడం వల్ల జ్ఞాపకశక్తి పెరగడంతోపాటు దగ్గు, జలుబు నుంచి మంచి ఉపశమనం కలుగుతుంది. రక్తహీనతతో బాధపడేవారికి బాగా ఉపయోగపడుతుంది. ఒక చిన్న కంటైనర్‌లో మూడొంతుల తేనె, ఒక వంతు గింజ తీసిన ఎండు ఖర్జూరాలను వెయ్యాలి. వీటిని బాగా కలిపి, మూతపెట్టి వారం కదలకుండా ఉంచాలి. వారం తర్వాత రోజుకు ఒకటి, రెండు చొప్పున ఈ ఖర్జూరాలను తినొచ్చు. దీనివల్ల రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు జబ్బుల బారిన పడకుండా ఉండొచ్చు. నిద్రలేమితో బాధపడేవారు ఈ మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల మంచి ఫలితాన్ని పొందుతాం. ఒత్తిడిని దూరమవుతుంది. ఈ మిశ్రమంలోని యాంటీ బయాటిక్ గుణాల వల్ల గాయాలు త్వరగా మానతాయి. మెమోరీపవర్ పెరుగుతుంది. చిన్నారులు చదువుల్లో చురుగ్గా ఉంటారు. ఈ మిశ్రమంలో క్యాల్షియం, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. ఇది రక్తహీనతను తగ్గించి, ఎముకలను బలంగా మారుస్తుంది. చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. మలబద్ధకంతో బాధపడేవారు వారంలో మూడు రోజులు ఖర్జూరాలు తింటే ఫలితం ఉంటుంది. ★



సిల్వి సూపర్ ట్రిక్ !

ఇరవై ఆరేళ్ల ఏళ్ల సిల్వి కాల్రా ఒకరోజు సాయంత్రం ఢిల్లీలోని ఒక వీధిలో నడుస్తూ ఉంది. ఆమెకు దగ్గర ఇళ్లల్లో పనిచేసే ఇద్దరు మహిళలు మాట్లాడుకోవడం వినిపించింది. వాళ్ల అమ్మాయిల్ని కొందరు యువకులు రోజూ ఏడిపిస్తున్నారని, రోజంతా ఆ అమ్మాయిలు భయంగా బతుకుతున్నారని వాళ్ల మాటల ద్వారా అర్థమయ్యింది. అయితే ఈ మహిళలు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడినే కాదు వారి నిస్సహాయతనీ సిల్వి అర్థం చేసుకుంది. నాలుగిళ్లల్లో పనిచేసుకుంటూ పొట్టపోసుకుంటున్న ఇలాంటి మహిళలు తమ కుమార్తెలకు రోజంతా తోడుగా ఉండలేరుగా?! అంతేకాదు ఈ మహిళలు ఒక ఇంటి నుంచి మరో ఇంటికి వెళుతున్నప్పుడు మార్గంలో అలాంటి వేధింపులను వాళ్లూ ఎదుర్కొంటున్నారని గమనించింది. ఒక్కోసారి ఆకతాయిలు వీళ్లను కావాలని తాకడం, తోయడం, మీదపడటం వంటి దుశ్చర్యలకూ పాల్పడుతుంటారు. కాబట్టి వీళ్లకు ఎలాగైనా సహాయం చేయాలి అనుకుంది సిల్వి.

సిల్వి ఒక జర్నలిస్టుగా పనిచేస్తుంది. అంతేకాదు సామాజిక కార్యకర్తగా ఉంటూ వివిధ విషయాలపై ప్రజలకు సమాచారాన్ని అందిస్తూ ఉంటుంది. ఒక జర్నలిస్టుగా సిల్వి రాత్రి సమయాల్లో ప్రయాణాలు చేస్తున్నప్పుడు భయపడుతూనే ఉండేది. అయితే తన ఆఫీసు ఆమెకు వాహన సదుపాయం కల్పిస్తుంది. మరి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే ఈ ఇంటిపని వర్కర్లకు ఎలాంటి సహకారం ఉండదు. అందుకే వారి రక్షణ కోసం ఏంచేయాలా అని ఆలోచిస్తే, వారికి ఆత్మరక్షణ కోసం సెల్ఫ్‌డిఫెన్స్ నేర్పిస్తే బాగుంటుందని అనుకుంది.



ఇందులో సిల్వికి నైపుణ్యం లేకపోయినా తాను వెళ్లే జిమ్‌లో ట్రైనర్‌గా పనిచేస్తున్న వ్యక్తిని ఒప్పించి, ఈ మహిళలకు సెల్ఫ్‌డిఫెన్స్‌లో శిక్షణ ఇప్పించడానికి పూనుకుంది. అయితే శిక్షణ ఇచ్చేవారిని ఒప్పించడం కన్నా శిక్షణ తీసుకునే వర్కర్లను ఒప్పించడానికే సెల్వీ చాలా శ్రమపడాల్సి వచ్చింది. ఎట్టకేలకు కొంతమందిని ఒప్పించి, వారి పిల్లలనూ శిక్షణ తీసుకునేటట్లు పురమాయించింది. నిజానికి సెల్వీ చాలా పెద్ద ఆశయం కోసం చేసిన చిన్న ప్రయత్నం ఇది. అందులోనూ ఈ శిక్షణ ఇచ్చేందుకు ట్రైనర్లను తీసుకురావడానికి కొంత ఖర్చు కూడా చేయాల్సి వస్తుంది. ముందుగా ట్రైనర్లను ఉచితంగా బోధించమని ఒప్పించడానికి ప్రయత్నిస్తుంది. లేదంటే ఎంతో కొంత తక్కువ డబ్బులు ఇచ్చేందుకు సిద్ధపడుతుంది. అయితే ఈ ఆశయాన్ని ముందుకు తీసుకుపోవడానికి ఇంకొంతమంది ట్రైనర్లను ఒప్పించి, వారితో వర్క్‌షాపులు నిర్వహించడానికి ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తూనే ఉంది సిల్వి. ఈమె నిర్వహిస్తున్న ఉచిత సెల్ఫ్‌డిఫెన్స్ క్లాసుల కోసం ఇప్పుడు కొందరు వర్కర్లు, వారి పిల్లలు, ఇంకా కొంతమంది అణగారిన వర్గాలకు చెందిన మహిళలు ముందుకొస్తున్నారు. తమను తాము రక్షించుకోవడానికి తీసుకుంటున్న ఈ శిక్షణ సమాజంలో ప్రతి స్త్రీకి చాలా అవసరం అని అంటున్నారు అందరు మహిళలు.

ఈ శిక్షణలో భాగంగా మొదటి 20 నిమిషాలు శారీరక దారుఢ్యం కోసం కొన్ని సాధారణ వ్యాయామాలు చేస్తారు. తర్వాత ఆత్మరక్షణ కోసం కొన్ని ట్రిక్స్‌ను శిక్షకులు నేర్పిస్తారు. ఎవరైన మనపై దాడి చేసినప్పుడు వారిని ఎదుర్కొనే ధైర్యాన్ని ఈ మెళకువలు అందిస్తాయి. వీటిలో సందర్భానికి తగినట్లు వివిధ రకాలైన మెళకువలు ఉంటాయి. సెల్ఫ్‌డిఫెన్స్ అనేది ఒక్కరోజులో వచ్చే విషయం కాదు. ఇది ప్రాక్టీస్ చేస్తూ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుంటేనే సాధ్యమయ్యేది. అయితే రోజంతా బిజీగా ఇళ్లల్లో పనిచేసుకునే ఈ వర్కర్లు ప్రతిరోజూ వచ్చి సమయాన్ని కేటాయించలేరు. అందుకే వీరికి అనువైన మధ్యాహ్నం సమయంలో కాలనీ పార్కులో వీరికి శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతానికి తక్కువ మందితో నడుస్తున్న ఈ శిక్షణ భవిష్యత్తులో మరింత మందికి ఇప్పించాలని సిల్వి ప్రయత్నం చేస్తుంది. ప్రారంభంలో ఒంటరిగా ఉన్న సిల్వికి ఇప్పుడు తోడుగా సహకరించేవారు చాలామంది వచ్చారు. ఈ ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లడానికి వీళ్లంతా చేతులు కలుపుతున్నారు. ★



అమ్మానాన్న.. అన్నీ ఆమె

పిల్లల పోషణ కోసం దొరికిన చోటల్లా అప్పులు చేసింది ఆమె. బిడ్డలకు కావాల్సిన సౌకర్యాలను కల్పించడానికి ఇంట్లోని వస్తువులతో పాటు మంగళసూత్రాన్నీ తాకట్టుపెట్టింది. వారు నివాసముంటున్న ఇంటి యజమాని ఒక్కసారిగా ఇంటిని ఖాళీ చేయించాడు. వారి పిల్లల్ని చూసిన ఏ ఒక్కరూ ఇల్లు అద్దెకు ఇవ్వటానికి ముందుకు రాలేదు. దీంతో ఊరికి దూరంగా ఉన్న పశువుల పాకనే నివాస స్థలంగా మార్చుకుంది. 'మీరే ఎన్నో ఇబ్బందులు పడి, పెళ్లి చేసుకున్నారు. ఇప్పుడు మీకీ పిల్లల బాధ్యత అవసరమా? కష్టాలు కొని తెచ్చుకోవడం ఎందుకు?' అంటున్న బంధువుల విమర్శలు, సూటిపోటి మాటలు, నిందలను భరించింది. వీళ్లెక్కడి బంధువులండీ! పిల్లల బాధ్యత తల్లికెందుకు అంటున్నారేంటని ఆలోచిస్తున్నారా?! నిజానికి ఆ పిల్లలు ఆమె కన్నబిడ్డలు కాదు. వైకల్యం, మానసిక వ్యాధుల కారణంగా కుటుంబసభ్యుల ఆదరణకు, ప్రేమకు దూరమైనవారు. అలాంటి వాళ్లని ఆమె అక్కున చేర్చుకుంది. ఆసరా కల్పించి, వారి సంరక్షణను తన భుజస్కంధాలపై వేసుకుంది. ఆ పిల్లలు ఇద్దరో ముగ్గురో కాదు. అక్షరాలా తొంబై నాలుగు మంది. అందులో కొందరు మానసిక వికలాంగులైతే, మరికొందరు అనాథలు. వారి కోసం ఆమె తన భర్తతో కలిసి 'శాంతి వర్ధనా మానసిక వికలాంగుల ఆశ్రమం' నిర్వహిస్తున్నారు. సేవే ధ్యేయంగా తాము చేసిన ప్రయాణం గురించి ఆశ్రమ నిర్వాహకురాలు రాయవరపు సత్య మాటల్లోనే విందాం..



మాది తూర్పుగోదావరి జిల్లా, సామర్లకోట. పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామానికి చెందిన రాయవరపు వీరబాబుతో ఏర్పడిన పరిచయం మమ్మల్ని ఒకటి చేసింది. మావారికి వైకల్యం ఉంది. ఇద్దరం కలిసి రెండువైపులా అందరినీ ఎదిరించాము. చివరికి ఒప్పించి, పెళ్లి చేసుకున్నాం. మొదట్లో మేము ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడేవాళ్లం. మా వారికి చిన్నప్పటి నుంచి వికలాంగులకు ఏదైనా చేయాలనే తపన ఎక్కువగా ఉండేది. తరచూ ఇవే మాటలు మాట్లాడుతుండేవారు. ఆ ఆలోచన నాకూ ఎంతగానో నచ్చింది. మానసిక వికలాంగుల్లో ఉత్సాహాన్ని, ధైర్యాన్ని నింపేందుకు ప్రత్యేకమైన పాఠశాలను ఏర్పాటు చేయాలనే ఆలోచన వచ్చింది. అయితే గతంలో మావారు ఇలాంటి పాఠశాలలోనే పనిచేశారు. ఆ అనుభవంతో ఇటువంటి పాఠశాలను నిర్వహించేందుకు కావాల్సిన అనుమతులు, అర్హతలను సాధించాం. 2006లో 'శాంతి వర్ధనా మానసిక వికలాంగుల ఆశ్రమం' పేరుతో పాఠశాలను స్థాపించాం.

ఐదుగురితో ప్రారంభమై ...

పాఠశాలను ప్రారంభించిన కొత్తలో ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని, రెండేళ్లపాటు నిర్వహించాం. అప్పుడు ఐదుగురు చిన్నారులు మాత్రమే ఉన్నారు. ఆ తర్వాత కొద్దిరోజులకే విద్యార్థుల సంఖ్య పదులకు చేరింది. కొన్ని కారణాల వల్ల భవనాన్ని కూల్చివేయడంతో అద్దె ఇళ్ల కోసం మేము పడిన ఇబ్బందులు వర్ణనాతీతం. ఇంటి కోసం ఎవరిని అడిగినా.. 'మీకు ఇల్లు అద్దెకిస్తే లేనిపోని కష్టాలను కొని తెచ్చుకోవాల్సి వస్తుంది' అంటూ నిర్మోహమాటంగా పొమ్మనేవారు. అప్పుడే పెద్దాపురం మండలం పులిమేరు గ్రామశివారున పశువుల కోసం ఏర్పరచిన ఖాళీస్థలంలో 2008లో పాఠశాలను ఏర్పాటు చేశాం. సరైన వసతులు లేక పక్కా భవనాలు లేక నానావస్థలు పడేవాళ్లం. వర్షాలకు గదుల్లోకి నీరు కారుతున్నా, ఈ చిన్నారులకు ఆ దయనీయ పరిస్థితి తెలిసేదికాదు. ఆదరణకు దూరమైన వారిని తీసుకొచ్చి, అసౌకర్యాల మధ్యలో ఉంచితే ఎలా అనే ఉద్దేశంతో మేమిద్దరం పడిన వేదన అరణ్య రోదనయ్యింది. కొన్ని నెలలపాటు నిద్రా పట్టేది కాదు. మా పాఠశాల గురించి ఆనోటా ఈనోటా వినడంతో చిన్నారుల సంఖ్యతో పాటు ప్రజల్లోనూ మంచి గుర్తింపు వచ్చింది.

నిర్వహణ వ్యయం లక్షల్లో..

అప్పట్లో మావారి జీతం నెలకు ఆరు వేలు. అవి పాఠశాల నిర్వహణకే సరిపోయేవి. మా పరిస్థితి కొంచెం కష్టంగానే మారింది. అయినా పాఠశాలను ప్రారంభించిన ఏడాదిన్నర తర్వాత నిర్వహణ బాధ్యతను చూసుకుంటూనే డిగ్రీ, ఎమ్‌ఏ కోర్సులను పూర్తిచేశాను. ఇలా కుటుంబ అవసరాలను, చిన్నారుల బాగోగులను కనిపెట్టుకుంటూ జాగ్రత్తలు పాటించాం. చిన్నారుల తిండి కోసం దొరికిన చోటల్లా అప్పులు చేశాం. ఇంట్లో వస్తువులనూ అమ్మేశాను. కొన్ని రోజులకు వస్తువులు కూడా అయిపోయాయి. అభం శుభం తెలియని చిన్నారులను పస్తులు పెట్టలేక వారి ఆకలిని తీర్చేందుకు మంగళసూత్రాన్నీ తాకట్టుపెట్టాను. వారికి కావాల్సిన దుస్తులు, దుప్పట్లను కల్పించేందుకు మరిన్ని కష్టాలు పడ్డాం. ఇరుగుపొరుగు వాళ్లు 'మీకిన్ని కష్టాలు ఎందుకనే?!' మాటలను సైతం లెక్కచేయకుండా మేమిద్దరం ముందుకెళ్లాం. క్రమంగా కొన్ని నెలల తర్వాత మా ఆర్థిక ఇబ్బందులూ తొలగిపోయాయి. పాఠశాల గురించి, మేము చేస్తున్న సేవలు, చిన్నారుల దయనీయస్థితిని చూసిన కొందరు దాతలు ముందుకొచ్చి విరాళాలు ఇవ్వడం మొదలుపెట్టారు. ప్రస్తుతం నెలకు నిర్వహణ ఖర్చు రూ.1.50 లక్షల వరకూ ఉంటుంది. అలాగే చిన్నారుల యోగక్షేమాలను పర్యవేక్షించేందుకు 12 మంది సిబ్బందిని ఏర్పాటు చేశాం.

పక్కా నివాసం ఏర్పాటు..

పరిస్థితులు చక్కబడటంతో పశువుల పాకనే పక్కా నివాసంగా మార్చుకున్నాం. ఆశ్రమం చుట్టూ ఇనుప కంచెలు, గోడలను నిర్మించాం. చిన్నారుల్లో మానసికోల్లాసాన్ని పెంచేందుకు అన్నివిధాలా చర్యలు తీసుకున్నాం. ముఖ్యంగా ఆటస్థలాన్ని, ఆట పరికరాలను, క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశాం. జిల్లా నలుమూలల నుంచి ఆశ్రమం గురించి తెలిసిన వారు విరాళాలు ఇస్తున్నారు. స్థానిక నాయకులూ తమ వంతు సహాయాన్ని అందిస్తూ మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. దీంతో చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అన్నీ సమకూరుస్తున్నాం. ముఖ్యంగా యువత తమ అభిమాన సినీహీరోల పుట్టినరోజులకైనా, తమ పుట్టినరోజులైనా డబ్బులు దుబారా చేయకుండా వేడుకలను ఆశ్రమంలోనే జరుపుకొంటున్నారు. ఆ రోజంతా చిన్నారులకయ్యే భోజనం ఖర్చును వారే భరిస్తున్నారు. అలాగే మహనీయుల జయంతులు, వర్ధంతులకు ఆశ్రమానికి విచ్చేసి పండ్లు, బిస్కెట్లు అందజేస్తున్నారు కొందరు. దీనివల్లా కొంత ఉపశమనం కలుగుతుంది.

మానసిక ఉత్తేజం కావాలి

ఆశ్రమంలోని పిల్లలు మానసిక వైకల్యమున్నవారు కాబట్టి మనం చెప్పే మాట వినరు. ఒక్కోరోజు అసలు నిద్రపోరు. ఒక్కోరోజు ఎప్పుడు లేచి అల్లరి చేస్తారో కూడా తెలియదు. దగ్గర్లో ఏముంటే అవి విసిరేస్తుంటారు. వీరిని మామూలు స్థాయికి తీసుకురావాలంటే అనుకున్నంత సులువు కాదు. ముఖ్యంగా ఎదిగొచ్చినా ఆడపిల్లల విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ అవసరం. ప్రతినెలా కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ నెలసరి పరిస్థితుల్లో వారెలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై మహిళా సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా ఇక్కడున్న పిల్లలు తమంతట తామే తమ పనులు చేసుకునే విధంగా, భోజనం చేసి, ఆడుకునేలా... ఒక దినచర్యకు అలవాటుపడేలా వారికి శిక్షణ ఇస్తున్నాం. పిల్లల్లో మార్పు తీసుకొచ్చి, వారిని మానసికంగా ఉత్తేజానికి అలవాటుపడేలా మారుస్తున్నాం.

దానం ప్రయోజనకరంగా ఉండాలి..

చాలామంది దైవభక్తి పేరిట కనిపించని దేవుళ్ల కోసం వేలకు వేలు వెచ్చిస్తారు. అవి ఎవరికీ ప్రయోజనకరంగా ఉండటం లేదు. దానం చేస్తే పదిమందికి ప్రయోజనం చేకూరాలి. కనిపించని వారికంటే మన కళ్లెదురుగా ఉండే అనాథ పిల్లలకి సాయం చేస్తే సంతృప్తి కచ్చితంగా వస్తుంది. అలాగే వారి అభ్యున్నతికి కృషి చేసి, సమాజాభివృద్ధికి పాటుపడిన వారవుతారు.

సంభాషణ : విజయ్ లెనిన్



చర్మం మెరవాలంటే..

కొందరు తరచూ ముఖం కడుక్కోవడం, మర్ధన చేసుకోవడం వంటివి చేస్తుంటారు. ఈ క్రమంలో కొన్ని పొరబాట్లు చేస్తుంటారు. అలాంటివి జరగకుండా ఉండాలంటే...

• ముఖం కడుక్కోవడానికి, మేకప్ వేసుకోవడానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి. లేదంటే చేతులకున్న మురికి, పైన పేరుకొన్న బ్యాక్టీరియా వంటివి చర్మంపై ప్రభావం చూపుతాయి.

• పొడి చర్మతత్వం గలవారు ముఖాన్ని సబ్బుతో శుభ్రం చేసుకోకపోవడం మంచిది. దానిలో ఉండే ఘాటైన రసాయనాలు చర్మం ఇంకా పొడిబారేలా చేస్తాయి. అందుకే తేనె, అరటిపండుతో మర్దన చేసుకుని స్నానం చేయడం మంచిది. తరచూ మాయిశ్చరైజర్లు రాయాలి. నిపుణుల సలహాతో నాణ్యమైన ఫేస్‌వాష్‌ని ఎంచుకోవాలి. • ప్రతిరోజూ చర్మం మెరవాలని అందరికీ ఉంటుంది. అయితే అదే పనిగా క్లెన్సర్లు, స్క్రబ్‌లు, వాడటం వల్ల ఆ మెరుపు సాధ్యం కాకపోగా చర్మం ఇంకా నిర్జీవంగా మారుతుంది. అందుకే అప్పుడప్పుడూ వాటిని వాడుతూ ఆవిరి పట్టుకోవాలి. • ఈ కాలంలో ముఖం శుభ్రం చేసుకోవడానికి అతి చల్లగా, మరీ వేడిగా ఉన్న నీళ్ల జోలికి వెళ్లకపోవడం మంచిది. గోరువెచ్చగా ఉన్న నీటినే ఎంచుకోవాలి. • స్నానంతో సంబంధం లేకుండా రోజుకు రెండు, మూడు సార్లు ముఖం కడుక్కుంటే సరిపోతుంది. అదే పనిగా శుభ్రం చేసుకుంటే చర్మంపైన నూనెగ్రంథులు తొలగిపోయి, పొడిబారుతుంది. కొన్నిసార్లు చర్మం ఇరిటేట్ అయి ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదమూ ఉంటుంది. ★



మీకోసం

టీస్పూను పంచదార, టీస్పూను కొబ్బరినూనె కలిపి చేతులకు మర్దనా చేసుకోవడం వల్ల చేతులు నునుపుగా తయారవుతాయి.



జీవన సౌరభం

చదువుల్లో పొందే ఆనందం
జీవన పోరాటంలో
ఉన్నత శిఖరాలకు బాట వేస్తుంది.

మెంతులతో కేశ సంరక్షణ

మెంతులు తలలో వేడిని తగ్గిస్తాయి. చుండ్రును నివారిస్తాయి. జుట్టు పొడిబారడాన్ని తగ్గిస్తాయి. ఇందులో ఉండే నికోటినిక్ యాసిడ్, ప్రోటీన్‌ను కేశాలకు పుష్కలంగా అందేలా చేస్తాయి. కేశాలు తిరిగి పెరగడంతో పాటు, బలంగా ఉండటానికి బాగా ఉపయోగపడతాయి. మెంతులు, మెంతి ఆకులతో అనేక జుట్టు సమస్యలు నివారించుకోవచ్చు. మెంతుల వల్ల కలిగే ప్రయోజనాలేమిటో వివరంగా తెలుసుకుందాం. • మెంతుల్ని రాత్రంతా నానబెట్టి, మరుసటి రోజు ఉదయం మెత్తగా పేస్ట్ చేసి, తలకు పట్టించాలి. అరగంట తర్వాత చల్లటి నీటితో తలస్నానం చేయడం వల్ల కేశాలకు మంచి మెరుపు, బలం చేకూరుతుంది. చుండ్రును మాయం చేస్తుంది. జుట్టు ఊడిపోకుండా ఉండేందుకు అవసరమైన శక్తిని అందిస్తుంది.

• మెంతులను నీళ్ళలో వేసి, బాగా ఉడికించాలి. తర్వాత ఆ నీటిని బాగా చల్లారనివ్వాలి. దీన్ని తలకు బాగా పట్టించాలి. దీనివల్ల కేశాలకు కావల్సిన శక్తి అంది, జుట్టు పాడైపోకుండా ఉంటుంది. ★



సెన్సెక్స్ ↑ 133
36,582

నిఫ్టీ ↑ 19
10,912

రూపాయి ↑ 56 పై
అమెరికా డాలరుకు రూ.
71.80

కృత్రిమ మేదస్సులో రాణింపు..

ఐటి రంగంలో వస్తున్న వేగవంతమైన మార్పుల్లో కృత్రిమ మేదస్సు (ఎఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రొబోటిక్స్‌లో భారత్ ప్రపంచ దేశాలకు పోటీగా నిలుస్తుందని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి అనూప్ వాధవన్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఇండియా సాఫ్ట్-2019కు హాజరైన అనూప్ ఐటి రంగంలోని ఈ అవకాశాలను భారత కంపెనీలు బాగా వినియోగించుకుంటు న్నాయన్నారు. ఇందులో 250 మంది ఎగ్జిబిటర్లు పాల్గొనగా.. 60 దేశాల నుంచి 400 మంది విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు.




కొత్త రెనాల్ట్ క్విడ్

ఆటోమొబైల్ దిగ్గజం రెనాల్ట్ తన ఎంట్రీ లెవల్ కారు రెనాల్ట్ క్విడ్‌లో కొత్త కారును ఆవిష్కరించింది. న్యూఢిల్లీ ఎక్స్‌షోరూం వద్ద దీని ధర రూ.2.67-4.63 లక్షలుగా నిర్ణయించింది. మెరుగైన భద్రతా ఫీచర్స్‌తో దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని రెనాల్ట్ ఇండియా పేర్కొంది. 0.8 లీటర్, 1లీటరు పెట్రోల్ ఇంజిన్లలో మాన్యువల్, ఆటోమేటెడ్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లలో తయారు చేసింది. క్విడ్‌లో ఇప్పటి వరకు 2.75 లక్షల పైగా యూనిట్లను విక్రయించినట్లు వెల్లడించింది.



ఆద్యంతం ఊగిసలాట

చివరి గంటలో మార్కెట్లకు మద్దతు



ముంబయి : బడ్జెట్ అనంతరం స్టాక్ మార్కెట్లలో తొలి ట్రేడింగ్ సోమవారం ఆద్యంతం ఊగిసలాటకు గురై.. తుదకు చివరి గంటలో కొనుగోళ్ల మద్దతుతో లాభాల్లో ముగిసింది. ఉదయం నష్టాలతో ప్రారంభమైన దేశీయ సూచీలు మధ్యాహ్నం తర్వాత పుంజుకున్నాయి. చివరి గంటలో బ్యాంక్, ఎనర్జీ, ఐటి రంగాల సూచీల మద్దతుతో సెన్సెక్స్ 113 పాయింట్లు లేదా 0.31 శాతం రాణించి 36,582కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 18 పాయింట్లు లేదా 0.17 శాతం లాభపడి 10,912 వద్ద ముగిసింది. బిఎస్ఇ ఉదయం 93 పాయింట్ల నష్టంతో ప్రారంభమై ఒకానొక దశలో తీవ్ర అమ్మకాల ఒత్తిడికి గురైంది. దీంతో మధ్యాహ్నం 12 గంటల సమయంలో దాదాపు 200 పాయింట్లకుపైగా నష్టపోయింది. కాగా చివరి గంటలో కొనుగోళ్లు పుంజుకోవడంతో నష్టాల నుంచి బయటపడ్డాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఒఎన్‌జిసి, బజాజ్ ఆటో, టిసిఎస్ కొటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. ఎన్ఎస్ఇలో యస్ బ్యాంక్, హిందాల్కో, హిందుస్థాన్ పెట్రోలియం, పవర్ గ్రిడ్, ఎన్‌టిపిసి షేర్లు అధిక నష్టాలను చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. కాగా ఆటో, లోహ, ఎఫ్ఎంసిజి, ఫార్మా రంగాలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

నోకియా 8.1లో కొత్త వేరియంట్



న్యూఢిల్లీ : నోకియా ఫోన్లను తయారు చేసే హెచ్ఎండి గ్లోబల్ తాజాగా భారత మార్కెట్లోకి నోకియా 8.1లో నూతన వేరియంట్‌ను 6 జిబి ర్యామ్, 128 జిబి రామ్‌లతో ఆవిష్కరించింది. అదనపు పనితీరు, స్టోరేజ్‌లతో ఇది లభ్యం కానుందని ఆ కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఫిబ్రవరి 6 నుంచి నోకియా.కామ్/ఫోన్స్, అమెజాన్.ఇన్ మొబైల్ రిటైల్ స్టోర్స్‌లో ఇది లభ్యం అవుతుందని పేర్కొంది. దీని ధరను రూ.29,999గా నిర్ణయించినట్లు హెచ్ఎండి గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్, కంట్రీ హెడ్ అజేయ్ మెహతా పేర్కొన్నారు. జెయిస్ ఆప్టిక్స్‌తో వచ్చే దీని 12 ఎంపి మెయిన్ కెమెరా, 20 ఎంపి అడాప్టివ్ ఫ్రంట్ కెమెరా తిరుగులేని విధంగా రాత్రి పూట కూడా సెల్ఫీలు తీసుకునేందుకు వీలు కల్పిస్తుందన్నారు.

అనిల్ దివాలా పిటిషన్
కుప్పకూలిన ఆర్‌కామ్ షేర్లు

- ఇంట్రా ట్రేడింగ్‌లో 54% పతనం
- అడాగ్ ఇతర షేర్లు ధమాల్



న్యూఢిల్లీ : అప్పుల సంక్షోభంలో చిక్కుకున్న అనిల్ అంబానీ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) షేర్ల విలువ అమాంతం పడిపోయింది. దివాల పరిష్కార ప్రక్రియకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఆర్‌కామ్ స్టాక్ ఎక్స్ఛేంజిలకు సమాచారం ఇచ్చింది. దీంతో సోమవారం సెషన్‌లో అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్(అడాగ్) కంపెనీ షేర్లు భారీ నష్టాలు చవి చూశాయి. ముఖ్యంగా రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ షేర్ నిఫ్టీలో ఉదయం రూ.10.45 శాతం వద్ద మొదలైన సూచీ ఒక దశలో 54.3 శాతం కుప్పకూలి రూ.5.30 రికార్డు కనిష్టానికి చేరింది. తుదకు 34.91 శాతం పతనమై రూ.7.55 వద్ద ముగిసింది. బిఎస్ఇలో ఇంట్రా ట్రేడింగ్‌లో 48.27 శాతం నష్టపోయి రూ.6 వద్ద నమోదయ్యింది. ఇదే బాటలో అడాగ్‌కు చెందిన రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, రిలయన్స్ నిప్పన్ లైఫ్, రిలయన్స్ నావల్, రిలయన్స్ పవర్, రిలయన్స్ కాపిటల్, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర స్టాక్స్ భారీ నష్టాలు మూటగట్టుకున్నాయి. టెలికం రంగంలో దివాల పరిష్కార ప్రక్రియకు చేరిన రెండో కంపెనీగా ఆర్‌కామ్ నిలిచింది. అంతకు ముందు ఎయిర్ సెల్ దివాల పరిష్కార ప్రక్రియకు చేరింది.

అనిల్ అంబానీ గ్రూపునకు చెందిన ఇతర స్టాక్స్ కూడా భారీ ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. రిలయన్స్ కాపిటల్ లిమిటెడ్ 19.80 శాతం నష్టపోయి రూ.151.70కు పడిపోయింది. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ 14.87 శాతం దిగజారి రూ.227.25కు క్షీణించింది. రిలయన్స్ పవర్ లిమిటెడ్ 35.10 శాతం నష్టపోయి 17.10 వద్ద ముగిసింది. రిలయన్స్ నావల్ అండ్ ఇంజనీరింగ్ లిమిటెడ్ షేర్లు 14.72 శాతం కోల్పోయి రూ.10.08కి పడిపోయింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ షేర్లు 12.74 శాతం తగ్గి రూ.301.15 వద్ద ముగిసింది. 2018 మార్చి ముగింపు నాటికి రిలయన్స్ కమ్యూనికేషన్స్ రూ.46,547 కోట్ల అప్పుల్లో ఉంది.

స్టాక్స్‌ను ముంచిన పిటిషన్..

గత కొన్ని నెలలుగా ఎరిక్‌సన్ తమ బకాయి చెల్లింపులు చేయాలని సుప్రీంకోర్టు ద్వారా ఆర్‌కామ్‌పై తీవ్ర ఒత్తిడిని తీసుకొస్తుంది. మరోవైపు ఆర్‌కామ్ ఆస్తుల విక్రయానికి చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్‌కామ్ అనుహ్యంగా దివాళా పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించింది. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) ద్వారా ఫాస్ట్ ట్రాక్ తీర్మానం కోరుతూ కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు నిర్ణయం చేశారు. ఈ విషయాన్ని ఆ కంపెనీ స్టాక్ మార్కెట్లకు వెల్లడించింది. దీంతో అనిల్ అంబానీ కంపెనీల షేర్లు భారీ నష్టాలను చవి చూశాయి. సుమారు రూ.40వేల కోట్ల పైగా రుణ పరిష్కారాలకు సంబంధించిన అంశంలో 40 రుణదాత సంస్థల నుంచి సంపూర్ణ అనుమతి లభించకపోవడంతో ఆర్‌కామ్ తాజా నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. గత 18నెలలుగా ఆస్తుల విక్రయం ద్వారా రుణ చెల్లింపులకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అయినప్పటికీ పరిస్థితులు అను కూలించకపోవడంతో రుణపరిష్కార అంశం ముందుకు సాగలేదని ఆర్‌కామ్ తెలిపింది. మరోవైపు స్వీడిష్ టెలికాం పరికరాల తయారీదారు ఎరిక్‌సన్ ఇటీవల ఆర్‌కాంపై కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసింది. తమకు చెల్లించాల్సిన రూ.550 కోట్లు చెల్లించకుండా కావాలని తాత్సారం చేస్తోందని ఆరోపించింది. దీనిపై సుప్రీంకోర్టు ఆర్‌కామ్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆర్‌కామ్ దివాలా పిటిషన్‌కు వెళ్లడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణం.

జియోకు చౌకబేరం..!

ఆర్‌కామ్ ఎన్‌సిఎల్‌టికి వెళ్లడం ద్వారా ఆ కంపెనీ ఆస్తులు జియోకు చౌకబేరంగా లభించనున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆర్‌కామ్ ఆస్తుల కొనుగోలుకు జియోతో ఎప్పటి నుంచో చర్చలు జరుగుతున్నాయి. ఆర్‌కామ్‌కు 800, 900, 1800, 2100 మెగాహెడ్జ్‌స్ బాండ్‌లో ఉన్న 122.4 మెగాహెడ్జ్‌స్ స్పెక్ట్రమ్.. అదే విధంగా ఆర్‌కామ్‌కు 43,000 టవర్లు, 1.78 లక్షల కిలోమీటర్ల ఆప్టిక్ ఫైబర్ కేబుల్ నెట్‌వర్క్, 248 మీడియా కన్వర్జెన్సీ నోడ్స్‌ను ఉపయోగించుకోవడానికి రిలయన్స్ జియో ఇది వరకే భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఆస్తులను ఆర్‌జియో వైర్‌లెస్, ఫైబర్ టు హోమ్ సేవల కోసం వినియోగించుకుంటుంది. ఏ ఇతర టెలికం ఆపరేటర్లకు లేనటువంటి అత్యంత విలువైన 800 మెగాహెడ్జ్ ఆర్‌కామ్ వద్ద ఉంది. దీన్ని రేడియో ఫ్రీక్వెన్సీకి వాడుతున్నారు. ఆర్‌కామ్ ఆస్తులపై భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా కంపెనీలు ఎలాంటి ఆసక్తిని కనబర్చడం లేదు.

మూడు రెట్లయిన ఐడిబిఐ బ్యాంకు నష్టాలు..

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ 31తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఐడిబిఐ బ్యాంకు నష్టాలు మూడు రెట్లు ఎగిసి రూ.4,185.48 కోట్లకు చేరాయి. మొండి బాకీలు అమాంతం పెరగడంతో ఈ బ్యాంకు మరోమారు తీవ్ర నష్టాలను ఎదుర్కొంది. 2017-18 ఇదే క్యూ3లో రూ.1,524.31 కోట్ల నష్టాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.7,125.20 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. క్రితం క్యూ3లో రూ.6,190.94 కోట్లకు తగ్గిపోయిందని సోమవారం ఆ బ్యాంకు ఫలితాల్లో వెల్ల డించింది. క్రితం క్యూ3లో బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు ఏకంగా 29.67 శాతానికి ఎగిశాయి. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 24.72 శాతం స్థూల నిరర్థక ఆస్తులు నమోద య్యాయి, ఇదే సమయంలో నికర నిరర్థక ఆస్తులు 16.02 శాతం నుంచి 14.01 శాతానికి తగ్గాయి. గత ఏడు సంవత్సరాల్లో తొలి సారిగా ఒక త్రైమాసికంలో అతి తక్కువగా కొత్తగా రూ.2.211 కోట్ల మొండి బాకీలను చవి చూడటం ఇదే తొలిసారి. ప్రస్తుతం ఈ బ్యాంకులో ఎల్ఐసి మెజారిటీ వాటా కలిగి ఉంది.

బజాజ్ నుంచి కొత్త మిక్సర్లు

హైదరాబాద్ : బజాజ్ ఎలక్ట్రికల్స్ సోమవారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లోకి శక్తివంతమైన మిక్సర్లు, గ్రైండర్లు విడుదల చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. మిక్సింగ్ అప్లయెన్సెస్ విభాగంలో తమ ఆధిపత్యాన్ని మార్కెట్‌లో కొనసాగించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు ఆ కంపెనీ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ అతుల్ శర్మ పేర్కొన్నారు. ఈ కొత్త ఉత్పత్తుల ధరలను రూ.4,815 నుంచి రూ.5,799 మధ్య నిర్ణయించినట్లు తెలిపారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

గాడిచర్ల స్థాపించిన పత్రిక పేరు?

ఓకే



ఎవిపి.రాజు,
బిపిఎంఎం హైస్కూల్, విజయనగరం.
సెల్ : 9390465623

ఆంధ్రప్రదేశ్ చరిత్ర, సంస్కృతి

1. లార్డ్‌కర్జన్ – 1905 అక్టోబర్ 16న బెంగాల్‌ను విభజించారు.
2. వందేమాతరం ఉద్యమం 1905లో ప్రారంభమై, 1911లో బెంగాలు విభజన రద్దుతో ముగిసింది.
3. అతివాద త్రయం ఎవరు ? బాలగంగాధర్‌తిలక్, లాలా లజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్
4. 1905 అక్టోబర్ 16న బెంగాలు విభజన అమలులోకి వచ్చిన రోజున బెంగాలీయులు హర్తాళ్, నిరాహార దీక్షలు చేశారు. జాతీయవాదులు విదేశీవస్తు బహిష్కరణను, స్వదేశీ వస్తువుల వాడుకను కొనసాగించారు. విద్యార్థులు ఆంగ్ల విద్యా సంస్థలను బహిష్కరించారు. విదేశీ వస్తుబహిష్కరణలో విదేశీ వస్తువులు ధరలు పడిపోయి ఆంగ్లేయుల ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది. స్వదేశీ ఉద్యమం (వందేమాతర ఉద్యమం)
5. స్వదేశీ ఉద్యమం ఫలితంగా ప్రపుల్లచంద్ర రే (పి.సి.రే)కి చెందిన బెంగాల్ కెమికల్ వర్క్స్‌కు మంచి ఆదరణ లభించింది.
6. స్వదేశీ స్ఫూర్తితోనే ముంబయికి చెందిన జంషెడ్జ్ టాటా బీహార్‌లో ఉక్కు కర్మాగారం స్థాపించాడు. – 1907లో
7. తిలక్ మహారాష్ట్ర నుంచి, లజపతిరాయ్ పంజాబ్ నుంచి, బిపిన్ చంద్రపాల్ బెంగాల్ నుంచి ఉద్యమాన్ని నడిపారు.
8. 'స్వరాజ్యం నా జన్మ హక్కు, దానిని సాధించి తీరతాను' అనే ప్రఖ్యాత నినాదాన్ని ఎవరు ఇచ్చారు?– బాలగంగాధర్ తిలక్
9. స్వదేశీ ఉద్యమ ఫలితాలు...
– బెంగాలు విభజన రద్దు చేశారు.
– బ్రిటిష్ వారు అణచివేత చర్యల వల్ల జాతీయోద్యమంలో భీతావహోద్యమం జన్మించింది.
– అతివాద, మితవాద పక్షములు చీలిపోవడానికి దోహదం చేసింది.
– 1909లో ఇండియా కౌన్సిళ్ల చట్టం చేశారు.
10. ప్రప్రథమంగా భారతీయులు బ్రిటిష్ వారిపై సాధించిన ఘనవిజయం ఈ వందేమాతరం ఉద్యమం. ఈ ఉద్యమం స్వదేశీ, స్వరాజ్ మొదలైన భావాలను భారతీయుల్లో వ్యాప్తి చేసి, వారిలో రాజకీయ చైతన్యాన్ని కలిగించి, జాతీయతా భావాన్ని రేకెత్తించింది. తత్ఫలితంగా 1905కు పూర్వం కొద్దిమంది విద్యాధికులకు మాత్రమే పరిమితమైన ఐఎన్‌సి ప్రజాసంస్థగా మారింది. కనుకనే చరిత్రకారులు వందేమాతరం ఉద్యమాన్ని జాతీయోద్యమంలో ప్రథమ ఘట్టంగా అభివర్ణించారు.
11. 1896లో ఇటలీని అబిసినీయా ఓడించింది. ఐరోపాలో అతిపెద్ద దేశమైన రష్యాను ఆసియాలో చిన్న దేశమైన జపాన్ 1904–1905 సంవత్సరాల మధ్య యుద్ధంలో ఘోరంగా ఓడించింది.
12. 1857మే 10న తిరుగుబాటుతో ప్రారంభమైన స్వాతంత్ర్యోద్యమం, 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం లభించడంతో ముగిసింది.
13. 1857లో మద్రాసులో విశ్వవిద్యాలయం స్థాపించడంతో ఆంధ్రదేశంలో ఉన్నతవిద్య అభివృద్ధికి అంకురార్పణ జరిగింది.
14. పాశ్చాత్య విద్యాభివృద్ధికి మచిలీపట్నంలో చర్చి ఆధిపత్యములో ప్రారంభించిన పాఠశాల 1864లో కళాశాలగా అభివృద్ధి చెందింది.
15. 1873లో మద్రాసు ప్రభుత్వానికి రాజమహేంద్రవరంలో ద్వితీయశ్రేణి కళాశాలగా అభివృద్ధి చెందింది? – 1877లో డిగ్రీ స్థాయికి పెంచారు.
16. 1878లో విశాఖపట్నంలో కళాశాల స్థాపించారు.
17. 1878లో బరంపురంలో కళ్లికోట కళాశాల స్థాపించారు.
18. కందుకూరి వీరేశలింగం – వివేకవర్ధిని, సత్యసంవర్ధిని వంటి పత్రికలు ఆంధ్రదేశంలో సంఘ సంస్కరణల ప్రగతికి సహకరించాయి.
19. ప్రథమంగా బళ్లారి నుంచి ప్రచురించిన సత్యదూత పత్రిక మొదటిది.
20. 1884లో ఏర్పడిన మద్రాసు మహాసభ ముఖ్యమైంది.
21. ఐఎన్‌సి ప్రథమ సమావేశానికి మద్రాసు మహాజన సభ అధ్యక్షులు రంగయ్య నాయుడు, కార్యదర్శి ఆనందాచార్యులతో పాటు అనేక మంది హాజరయ్యారు.
22. 1885 డిసెంబర్ 28న ఐఎన్‌సిని స్థాపించారు.
23. 1891లో ఏర్పడిన కృష్ణా జిల్లా సంఘం మొదటిది.
24. 1886 రెండో సమావేశం – నాగపూర్‌లో జరిగింది.
25. 1905లో బెనారస్‌లో సమావేశమైన ఐఎన్‌సి బెంగాల్ విభజనను వ్యతిరేకిస్తూ తీర్మానం ఆమోదించింది.
26. 1907– సూరత్ (గుజరాత్) ఐఎన్‌సి సమావేశంలో రెండుగా చీలిపోయింది. – అతివాదులు, మితవాదులు
27. వందేమాతరం జాతీయగీత రచయిత – బంకించంద్ర చటర్జీ
28. వందేమాతరం ఉద్యమాన్ని 'స్వదేశీ' ఆశయ ప్రచారానికి మద్రాసులో ఒక సంస్థ స్థాపించారు. – 'స్వదేశీలీగ్' విద్యార్థి దళం ఏర్పడింది.
29. లీగ్ కార్యకర్తలు న్యాయపతి సుబ్బారావు, కె.వెంకటరమణ రావు ఆంధ్రదేశమంతటా పర్యటించారు.
30. 1906లో సురేంద్రనాథ్‌బెనర్జీ అరెస్టు అయ్యారు.
31. స్వదేశీ పరిశ్రమలలో శిక్షణ కోసం విద్యార్థులను జపాన్ పంపాలని తీర్మానాలు చేశారు.
32. బిపిన్ చంద్రపాల్ అతివాద నాయకుడిగా వందేమాతరం ఉద్యమవ్యాప్తికి ఆంధ్ర ప్రాంతంలో పర్యటించారు.
33. కృష్ణాపత్రిక సంపాదకులు ముట్నూరి కృష్ణారావు, బిపిన్ చంద్రపాల్ ఆంధ్రలో పర్యటించారు.
34. రాజమండ్రిలో బాలభారతి సమితి ఆధ్వర్యాన బిపిన్ చంద్రపాల్‌కు అఖండ స్వాగతం లభించింది.
35. ఈ సభలో చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు తెల్లవారు భారతీయులను దోచుకునే విధానాన్ని చక్కని పద్యంగా వినిపించారు.
36. ఈ సభలకు రాజమండ్రి కళాశాలలో ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్న గాడిచర్ల హరిసర్వోత్తమరావు, చిలుకూరి వీరభద్రరావులు హాజరయ్యి ఉపన్యాసించారు.
37. బిపిన్ చంద్రపాల్ విజయవాడ, మచిలీపట్నం కూడా సందర్శించారు.
38. గాడిచర్ల మచిలీపట్నం జాతీయ కళాశాల స్థాపనకు కృషి చేశారు.
39. గాడిచర్ల – స్వరాజ్య అనే పత్రిక స్థాపించి, రాజకీయ వ్యాసాల ప్రచురణ ద్వారా జాతీయ ఉద్యమాన్ని ప్రచారం చేశారు.



40. రాజమండ్రి కళాశాల సంఘటనలో ఆంధ్ర విద్యార్థులు దేశస్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనే ఘట్టం ఆరంభమైంది.
41. అప్పటి రాజమండ్రి కళాశాల ప్రిన్సిపాల్ – మార్క్ హంటర్
42. 1914లో మద్రాసులో జరిగిన ఐఎన్‌సి ఆంధ్రదేశం నుంచి 256 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.
43. 1885 మొదటి ఐఎన్‌సి సమావేశానికి 72 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.
44. 1886 మూడో ఐఎన్‌సి సమావేశానికి 436 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.
45. 1918లో పట్టాభి సీతారామయ్య కృషి వల్ల ఆంధ్ర ప్రాంతానికి ప్రత్యేక కాంగ్రెస్ శాఖ ఏర్పాటు చేశారు.
46. అనిబిసెంట్ కార్యరంగంలో ప్రవేశించడంతో కాంగ్రెస్ వారి దృక్పథం కొంతవరకూ మారింది.
47. అనిబిసెంట్ ఐరిష్ దేశస్థురాలు – దివ్యజ్ఞాన సమాజంలో చేరింది.
48. అతివాదులను, మితవాదులను, హిందువులను, మహమ్మదీయులను కలిసి అందరి సహకారం ఈ విదేశీ వనిత భారత ప్రజాసంక్షేమం కోసం 'హోమ్‌రూల్' ఉద్యమాన్ని లేవదీసింది.
49. 1961వ సంవత్సరం సెప్టెంబర్ 1వ తేదీన మద్రాసులోని గోఖలేహాలులో ఆమె హోమ్‌రూల్ సంఘాన్ని స్థాపించింది.
50. తిలక్ 1914 సంవత్సరంలో విడుదలయ్యాడు.
51. తిలక్ –హోమ్‌రూల్ లేక స్వపరిపాలన అనేది స్వాతంత్ర్య సమరానికి మొదటిమెట్టుగా భావించాలని చెప్పాడు.
52. తిలక్–కేసరి పత్రికలో హోమ్‌రూల్ గురించి అనేక వ్యాసాలు రాశారు.
53. తిలక్–పూనా నగరంలో ఏప్రిల్ –1961 సంవత్సరంలో హోమ్‌రూల్ స్థాపించారు.
54. తిలక్–ఢిల్లీ, పంజాబ్‌లో ప్రవేశించకూడదని నిషేధించింది.
55. తిలక్ + అనిబిసెంట్‌లు స్థాపించిన రెండు హోమ్‌రూల్ సంస్థలు, స్వపరిపాలన అవసరాన్ని ప్రజలతో అత్యంత తీవ్రంగా ప్రచారం చేశారు.
56. అనిబిసెంట్ 'న్యూ ఇండియా' అనే పత్రికను ఆరంభించింది.
57. అనిబిసెంట్ తరువాత కొద్దిరోజులకు 'ది కామన్ వీల్' అనే వారపత్రికనూ ఆరంభించారు.
58. స్వాతంత్ర్యం భారతీయుల జన్మహక్కని, దానిని ఎవరి దయాభిక్షతోనూ సంపాదించాల్సిన అవసరం లేదని అనిబిసెంట్ అభిప్రాయం.
59. హోమ్‌రూల్ ప్రారంభించడానికి స్వదేశీ వస్త్ర ధారణ, విదేశీ వస్తు బహిష్కరణ, జాతీయ విద్య అనే మూడు సాధనాలను అవలంభించారు.
60. అడయార్, కాశీ, సింధూ – ప్రాంతాలలో అనిబిసెంట్ స్కూళ్లను స్థాపించారు.
61. మద్రాసు ప్రభుత్వం అనిబిసెంట్ అనుచరులైన అరండేల్, వాడియార్‌లతో సహా ఆమెను నిర్బంధించింది.
62. హోమ్‌రూల్ 1917 నాటికి ఈ ఉద్యమం పతాక స్థాయికి చేరుకుంది.
63. ఆగస్టు–1917 సంవత్సరంలో బ్రిటీష్ ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. భారత దేశ ప్రజలకు స్వయం పరిపాలన ఇస్తామని వాగ్దానం చేసింది.
64. 1917 ఐఎన్‌సి ప్రెసిడెంట్ – అనిబిసెంట్
65. 1916లో తిలక్ స్వతంత్ర సాధనను పూనాలో ప్రారంభించారు.
66. 1916 సెప్టెంబర్ నెల్లో అనిబిసెంట్ మద్రాసులో స్వయంపాలన కోసం హోమ్‌రూల్ ఉద్యమం ప్రారంభించారు.
67. గాడిచర్ల నాయకత్వంలో ఆయన కార్యదర్శిగా హోమ్‌రూల్ లీగ్‌శాఖ ఆంధ్రదేశంలో ఏర్పడింది.
68. 1916లో అనిబిసెంట్ ఆంధ్రదేశంలో పర్యటించారు.
69. ఆమె చిత్తూరు, కాకినాడ, రాజమండ్రి, ఏలూరు సభలలో ప్రసంగించారు.
70. 1917 నాటికి ఆంధ్రదేశంలో 52 వరకూ హోమ్‌రూల్ శాఖలో ఏర్పడినాయి.
71. అనిబిసెంట్ జాతీయ విద్యా ప్రణాళికను రూపొందించి, జాతీయ విద్యా వ్యాప్తికి మదనపల్లి కేంద్రంగా జాతీయ కళాశాల స్థాపించారు.
72. హోమ్‌రూల్ ఉద్యమవ్యాప్తి కారణంగా 1918లో మాంటెగు చేమ్స్‌ఫర్డ్ సంస్కరణలను ప్రకటించింది.
73. 1920 నుంచి జాతీయోద్యమ చరిత్ర –గాంధీశకంగా పరిగణించారు.
74. అసాధారణ అధికారాలను ప్రభుత్వానికి కల్పిస్తూ ప్రజల ప్రాథమిక హక్కులను హరించే రౌలత్ చట్టం ప్రభుత్వం రూపొందించింది.
75. 1919 సమయంలో గాంధీ ఉపన్యాసాన్ని అయ్యదేశర కాళేశ్వరరావు తెలుగులోకి అనువదించారు.
76. 1919 ఏప్రిల్ 13న అమృత్‌సర్‌లో జలియన్ వాలాబాగ్ దురంతాల పట్ల ఆంధ్రదేశంలో కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది.
77. అఖిల భారత కాంగ్రెస్ సంఘం సమావేశాలు 1920 మార్చి 31 ఏప్రిల్ 1, 2 తేదీల్లో విజయవాడలో జరిగాయి. (ఇందులో గాంధీజీ పాల్గొన్నారు.)
78. త్రివర్ణ పతాక రూపశిల్పి – పింగళి వెంకయ్య
79. 1921 అక్టోబర్ నెలలో గాంధీ మరలా ఆంధ్రదేశంలో పర్యటించారు.
80. దేశభక్త– కొండా వెంకటప్పయ్య, ఆంధ్రరత్న –దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విశ్వదాత కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు– ఆంధ్ర నాయకులు. ★

ఉద్యోగాలు

ఏపీలో డ్రైవర్ ఆపరేటర్లు ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ 85 డ్రైవర్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు...

జిల్లాల వారీ ఖాళీలు : శ్రీకాకుళం–2, విజయనగరం–1, విశాఖపట్నం–10, తూర్పు గోదావరి–6, పశ్చిమగోదావరి–5, కృష్ణా–20, గుంటూరు–18, ప్రకాశం–2, నెల్లూరు–4, కర్నూలు–4, అనంతపురం–3, చిత్తూరు–6, వైఎస్ఆర్ కడప–4.

అర్హత: జులై 1, 2018 నాటికి ఎస్ఎస్‌సీ లేదా తత్సమాన అర్హత కలిగిన అభ్యర్థులు అర్హులు. హెవీ మోటారు వాహన లైసెన్సు, నిర్దేశ శారీరక, వైద్య ప్రమాణాలుండాలి.

వయసు: జులై 1, 2018 నాటికి 18–30 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: ఫిజికల్ మెజర్‌మెంట్స్, డ్రైవింగ్ టెస్టుల ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను సంబంధిత జిల్లా ఎస్పీ కార్యాలయాల నుంచి పొందవచ్చు. ఆ దరఖాస్తులను నింపిన తర్వాత ఇతర ధ్రువీకరణ పత్రాలు జత చేసి, అదే కార్యాలయంలో అందించాలి.

దరఖాస్తుకు చివరితేదీ: ఫిబ్రవరి 7, 2019.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో పరిశీలించొచ్చు.

వెబ్‌సైట్: http://slprb.ap.gov.in

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-సత్యనారాయణపురం (విజయవాడ)

రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహించే కార్మికులకు కనీస వేతనం రూ.8 వేలు ఇవ్వాలని విజయవాడ ధర్నా చౌక్ వద్ద సోమవారం కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి అనుబంధ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కళ్లేపల్లి శైలజ మాట్లాడారు. రాష్ట్రంలో కేంద్రీకృత వంటశాలలను రద్దు చేసి ఈ పథకాన్ని ప్రయివేట్ సంస్థలకు అప్పగించే ఆలోచన విరమించుకోవాలని తెలిపారు. విద్యార్థులకు నిత్యావసర వస్తువులు, కోడి గుడ్లు విద్యార్థుల మెస్ బిల్లుతో సంబంధం లేకుండా ఉచితంగా ఇవ్వాలన్నారు. నెలనెలా బిల్లులు, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, నాయకులు రాధకృష్ణ, నాగ ఆంజనేయులు, కవిత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఊగిసలాటలో వీసీ పోస్టులు..?

నాయ్యస్థానం తీర్పుకోసం ఎదురుచూపులు - సెర్చికమిటిపై తీవ్ర అభ్యంతరాలు...!

ప్రజాశక్తి - క్యాంపస్ (తిరుపతి)

రాష్ట్రంలోని ఏడు విశ్వవిద్యాలయాలకు ఇటీవల కాలంలో ఉపకులపతుల పదవి విరమణతో ఖాళీగా ఉన్న వీసీ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఫిబ్రవరి నెలలోనే ఎన్నికల కోడ్ రానున్న పక్షంలో హడావుడిగా వర్శిటీలకు సెర్చ్ కమిటీలను నియమించింది. రాష్ట్రంలోని పలు వర్శిటీలకు నియమించిన సెర్చ్ కమిటీలో రాష్ట్రం, యుజిసి, వర్శిటీల తరపున ఒకరిని నామినిగా తీసుకుంటారు. యుజిసి నిబంధనలు 2010, 2018, రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 38 ప్రకారం సెర్చ్ కమిటీలో ఉన్న విద్యామండలి ముఖ్య కార్యదర్శి రాష్ట్రం తరపున, వర్శిటీ తరపున ఉండకూడదని ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు మునిరత్నం రెడ్డి హైకోర్టులో పిల్ వేశారు. దీంతో ఆదివారం రాత్రి హడావుడిగా ఎస్వీయూ వీసీ నియామకం చేపట్టారు. సోమవారం పిల్ విషయం వాదనకు రావడం జరుగుతుందని ముందుగానే ఎస్వీయూ వీసీని నియమిస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం సెర్చ్ కమిటీల నియామకం సరిగా లేదన్న విషయాన్ని పిటిషనర్ తరపున న్యాయవాది ఉగ్రనరసింహం వాదించడం జరిగింది. ఈ వాదనను విన్న జస్టిస్ ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేశారు. నియమకాలు జరగని అన్ని వర్శిటీలకు కోర్టు స్టే ఇస్తూ, రాష్ట్ర ప్రభుత్వాన్ని కౌంటర్ దాఖలు చేయాలని కోరింది. అంతేకాకుండా ఈ కేసులో ప్రభుత్వం తరపున కొన్ని అంశాలను వివరించాలని కోరడం జరిగింది. ప్రస్తుతం శ్రీకృష్ణదేవరాయ వర్శిటీ, ద్రవిడ వర్శిటీ, ఎస్వీయూలకు ఇటీవల సెర్చ్ కమిటి ద్వారా వీసీ నియామకాల ఉత్తర్వులు జారీచేశారు. అయితే పిటిషనర్ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సెర్చ్ కమిటీ యుజిసి, రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఉందని, వారి నియమకాలు చెల్లుబాటు కావని పేర్కొన్నారు. దీంతో వర్శిటీలలో ఇంత వరకు నియమించిన వారు మూడు సంవత్సరాలు పాటు పదవిలో ఉంటారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వర్శిటీల ఉపకులపతుల నియామకాలను ప్రస్తుతం న్యాయస్థానంలో ఊగిసలాడుతున్నాయి.

కొనసాగుతున్న దర్యాప్తు

అనుమానితుడి ఫొటో విడుదల



ప్రజాశక్తి-తిరుపతి సిటీ

శ్రీగోవిందరాజుస్వామి ఆలయంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తుల బంగారు కిరీటాల చోరీ కేసులో దర్యాప్తు వేగవంతం చేశామని అర్బన్ ఎస్‌పి కెకెఎన్ అన్బురాజన్ వెల్లడించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల రెండో తేదీ టిటిడి అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆరు ప్రత్యేక బృందాలు వివిధ కోణాలలో దర్యాప్తు చేస్తూ టిటిడి విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ప్రత్యేక దర్యాప్తు బృందాలతో సమన్వయం చేసుకుని ముందుకెళ్లుతున్నామని తెలిపారు. ఈ దర్యాప్తులో భాగంగా సిసి కెమెరాలను పరిశీలించి వాటి ఆధారంగా నేరానికి పాల్పడిన అనుమానాస్పద వ్యక్తిని గుర్తించామన్నారు. అనుమానితుడి ఫొటోను ఈ సందర్భంగా మీడియాకు విడుదల చేశారు. అనుమానితుడి ఆచూకీ తెలిపిన వారు తిరుపతి అర్బన్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారికి టిటిడి, పోలీసుల తరుపున తగిన బహుమానం ఇస్తామని చెప్పారు.

వైసిపి ధర్నా భగ్నం

ప్రజాశక్తి- పెనుకొండ(అనంతపురం)

అనంతపురం జిల్లా పెనుకొండ మండలం కియా కార్ల పరిశ్రమ కోసం భూములు కోల్పోయిన రైతు కుటుంబాల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటూ డిమాండ్ చేస్తూ వైసిపి ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాను పోలీసులు భగ్నం చేశారు. శనివారం రాత్రి నుంచి వైసిపి సమన్వయ కర్త శంకరనారాయణను ఇంటి వద్దనే అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించారు. ఆయన బయటికి రాకుండా ఇంట్లోనే ఉండిపోయారు. పెనుకొండ డిఎస్‌పి రామకష్ణ, సిఐ రామకృష్ణ, ఎస్ఐ జనార్ధన్ ఆధ్వర్యంలో పోలీసులు సాయంత్రం వరకు అక్కడే వున్నారు. ఈ సందర్భంగా శంకర నారాయణ విలేకరులతో మాట్లాడుతూ స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని ధర్నా తలపెడితే ప్రభుత్వం నిర్బంధించిందని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కియా పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. శంకర నారాయణ గృహనిర్బంధంతో ఆయన తమ్ముడు మల్లికార్జున పార్టీ నాయకులు, కార్యకర్తలతో స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-దగదర్తి (నెల్లూరు)

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా దగదర్తి మండలం చవటపత్తేడులో అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ జి.అంకమ్మ కథనం మేరకు.. సోమవారం 37 బస్తాల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందడంతో దాడులు చేశారు. రేషన్ షాపు నిర్వహిస్తున్న మేకల నాగేశ్వరరావు, తలారి అంజయ్యలపై కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకొన్న బియ్యాన్ని బుచ్చికి సంబంధించిన పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పజెప్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఈ విధమైన ఘటనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

ముద్దనూరు రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన డిఆర్‌ఎం

ప్రజాశక్తి - కడప

గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్‌ఎం) విజయ్ ప్రతాప్ సింగ్-అధికారులు కలిసి కడప జిల్లాలోని ముద్దనూరు రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలను సోమవారం ఉదయం పరిశీలించారు. రైల్వేస్టేషన్‌కు సంబంధించిన వివరాలన్నిటినీ అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

ఆ 4 పార్టీలనూ ఓడించాలి

- శింగనమల సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- శింగనమల (అనంతపురం) /యర్రగొండపాలెం(ప్రకాశం)

రానున్న ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్, టిడిపి, వైసిపిలను చిత్తుచిత్తుగా ఓడించాలని, వామపక్ష, జనసేన పార్టీలను గెలిపించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా శింగనమల ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలో సోమవారం బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభకు నియోజకవర్గ నలుమూలల నుంచి వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. వి.శ్రీనివాస రావు మాట్లాడుతూ కాంగ్రెస్, బిజెపి పాలనలో దేశంలో పేదరికం, ఆకలి చావులు పట్టిపీడుస్తున్నాయని అన్నారు. డాక్టరు బిఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య ధనాన్ని పార్టీల అవసరాలకు, ప్రచారాలకు, ఎన్నికల ఖర్చులకు వినియోగించుకుంటూ ఖజానాను ఖాళీ చేస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వాలు ప్రజలను కష్టాలపాలు చేశాయని విమర్శించారు. ఎన్నికల్లో అమలు కానీ హామీలను కురిపించి అధికారం చేపట్టిన తరువాత హామీలను నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం ఉత్తర ప్రాంత జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సిపిఐ జిల్లా కార్యదర్శి జగదీష్‌లు మాట్లాడుతూ నమ్మి ఓటేసిన ప్రజలను టిడిపి నట్టేట ముంచిందని అన్నారు. ప్రధాన ప్రతిపక్షమైన వైసిపి ప్రజాసమస్యలపై చట్టసభల్లో పోరాడి సమస్యలకు పరిష్కారం చూపటంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. జనసేన జిల్లా నాయకులు సదానంద మాట్లాడుతూ ప్రత్యామ్నాయ కూటమితోనే రాష్ట్రానికి హోదా, విభజన హామీల సాధన, సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు.

చంద్రబాబుది ప్రజాసేవ కాదు కాంట్రాక్టర్ల సేవ : వైవి

సిఎం చంద్రబాబునాయుడు చేస్తున్నది ప్రజాసేవ కాదని, అది కేవలం కాంట్రాక్టర్ల సేవేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరావు విమర్శించారు. సోమవారం స్థానిక అంబేద్కర్ బొమ్మ సెంటర్‌లో సిపిఎం, సిపిఐ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో బహిరంగ సభ జరిగింది. సభకు సిపిఎం నియోజకవర్గ కన్వీనర్ గుమ్మా బాలనాగయ్య, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి దేవెండ్ల శ్రీనివాస్‌లు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధికి మీరేమి చర్యలు తీసుకున్నారని సిఎం చంద్రబాబును నిలదీశారు. రాష్ట్రంలో వైసిపి శాసన సభ్యులను టిడిపిలో చేర్చుకొని అదే తెలంగాణలో టిడిపి శాసన సభ్యులు టిఆర్ఎస్‌లో చేరితో రాద్ధాంతం చేస్తున్నారని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్‌తో చెలిమి కట్టి నాటకాలు ఆడుతున్నారన్నారు. కేంద్రంలో బిజెపి మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందన్నారు. సిపిఐ నాయుకులు, మాజీ ఎమ్మెల్సీ పిజె.చంద్రశేఖర్ మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు పూర్తయ్యేది లేదని, నీరొచ్చి కరువు తీరేది లేదని తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు కేవలం మాయమాటలతో వెలుగొండపై సవతి తల్లి ప్రేమను చూపుతున్నారన్నారు. ఇంకా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గాలి వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.



అనంతపురం జిల్లా శింగనమల బహిరంగ సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు



సాలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు, కార్యకర్తలు

సాగునీటి రంగానికి ప్రాధాన్యత

సాలూరులో సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి- సాలూరు (విజయనగరం జిల్లా)

జనసేన, వామపక్ష కూటమికి అధికారమిస్తే సాగునీటి రంగానికి పెద్దపీట వేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి, సిపిఐ నాయకులు ఎస్.రామచంద్రరావు అన్నారు. విజయనగరం జిల్లా సాలూరులోని కొణిశివీధి కల్యాణ మండపంలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని టిడిపి విధానాలు ఒక్కటేనని, రెండూ ప్రజలకు నష్టం కలిగించే విధానాలనే అమలు చేస్తున్నాయని తెలిపారు. ప్రజానుకూల విధానాలతో వస్తున్న సిపిఎం, సిపిఐ, జనసేన కూటమిని ఆదరించాలని కోరారు. తమ కూటమి అధికారంలోకి వస్తే నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వెంగళరాయసాగర్, పెద్దగెడ్డ, ఆంధ్ర ప్రాజెక్టుల చివరి ఆయకట్టు భూములకు సాగునీరందేలా కృషి చేస్తామని తెలిపారు. పెద్దగెడ్డ ఎడమ కాలువ, పావురాయగెడ్డ మినీ రిజర్వాయర్, తోణాం గోముఖి కాలువ నిర్మాణం పనులు చేపడతామని వివరించారు. అన్‌సర్వేయడ్, అటవీ, బంజరు భూములను సాగు చేస్తున్న గిరిజనులకు వాటిపై హక్కులు కల్పిస్తామని, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు నష్టం చేసే అక్రమ మైనింగ్ లైసెన్సులను రద్దు చేస్తామని చెప్పారు. గిరిజన గ్రామాలన్నింటినీ ఐదో షెడ్యూల్‌లో చేర్చడానికి కృషి చేస్తామన్నారు. భూమిలేని ప్రతి గిరిజన కుటుంబానికీ రెండెకరాల భూమిని పంపిణీ చేస్తామన్నారు. అంతకుముందు తహశీల్దార్ కార్యాలయం నుంచి జాతీయ రహదారి మీదుగా కల్యాణ మండపం వరకూ ర్యాలీ నిర్వహించారు.

పోడు భూములకు పట్టాలివ్వాలని ధర్నా



ధర్నాలో నినదిస్తున్న నేతలు, గిరిజనులు, గిరిజనేతర పేదలు

ప్రజాశక్తి-ఏలూరు అర్బన్

తరతరాలుగా గిరిజనులు, గిరిజనేతర పేదలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని కోరుతూ సిపిఎం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఎర్ర కాలువ రిజర్వాయర్ మిగులు భూములను అక్రమంగా సాగు చేసుకుంటున్న భూస్వాముల నుంచి స్వాధీనం చేసుకోవాలని, పేదలకు ఏక్‌సాల్ పట్టాలిచ్చి ఆ భూములు సాగు చేసుకునే అవకాశం కల్పించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ధర్నానుద్దేశించి సిపిఎం పశ్చిమగోదావరి (అప్‌ల్యాండ్) జిల్లా కార్యదర్శి చింతకాయల బాబూరావు మాట్లాడుతూ పోడు భూములు, ఎర్రకాలువ మిగులు భూముల వ్యవహారాల్లో అధికారులు భూస్వాములకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. 2014 ఎన్నికల్లో పోడు భూములకు పట్టాలిస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు ఉన్న చట్టాలను అమలు చేయకుండా, కష్టానికి తగిన ప్రతిఫలం దక్కకుండా గిరిజనులను మోసగిస్తున్నారని విమర్శించారు.

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఈ భూములను ప్రభుత్వం నుంచి పరిహారం పొందిన భూస్వాములే 35 సంవత్సరాల నుంచి అక్రమంగా సాగు చేసుకుంటూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారని అన్నారు. భూస్వాములపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, పరిహారం వసూలు చేయాలని, ఆ భూములను సాగు చేసుకునేందుకు పేదలకు ఏక్ సాల్ పట్టాలు ఇవ్వాలని అధికారులను కోరారు. ధర్నాలో గిరిజన సంఘం, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శులు తెల్లం రామకష్ణ, కె శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కండెల్లి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ జెఎసి ఆధ్వర్యంలో ఆందోళన

ప్రజాశక్తి - విజయవాడ/నెల్లూరు

ఆర్టీసీ కార్మికుల జెఎసి ఆధ్వర్యంలో పలుజిల్లాల్లో సోమవారం నాడు ఆందోళనలు కొనసాగాయి. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా వెంకటగిరి క్రాస్‌రోడ్డు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ సీనియర్ నాయకులు సిహెచ్ ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థను ప్రభుత్వం విలీనం చేసుకోవాలన్నారు. సంస్థను పరిరక్షించి కార్మికులకు మెరుగైన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిబ్బంది కుదింపు చర్యలను విడనాడాలని పేర్కొన్నారు. ఆర్టీసీ ట్యాక్స్ హాలిడే ప్రకటించాలన్నారు. ఎపిఎస్ ఆర్టీసీలో నడుపుడుతున్న హైయర్ బస్సులపై పనిచేసే డ్రైవర్లు, వర్కర్ల సమస్యల పరిష్కారానికి విజయవాడ పిఎన్‌బిస్టేషన్ ఔట్ గేటు వద్ద ఎపిఎస్ ఆర్టీసీ హయర్ బస్సు డ్రైవర్లు, వర్కర్ల ఆధ్వర్యంలో సామూహిక నిరసన దీక్షలు సోమవారం జరిగాయి. రాష్ట్రంలోని ఆయా జిల్లాలో పనిచేస్తున్న డ్రైవర్లు, వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని దీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ ఆర్‌టిసి హయర్ బస్సు డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీఫర్ అహ్మద్, అధ్యక్షులు సత్యనారాయణ, నాయకులు నూర్ మహ్మద్ పాల్గొన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుందరయ్య దీక్షలకు సంపూర్ణ మద్దతు తెలిపారు.



మంత్రి కిడారి కాన్వాయ్ అడ్డగింత

తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు (విశాఖపట్నం)

తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ కాన్వాయ్‌ను విశాఖ ఏజెన్సీలోని ముంచంగిపుట్టు మండలం, కిలగాడ పంచాయతీ పరిధి మెట్టవీధి గ్రామానికి చెందిన గిరిజనులు అడ్డుకున్నారు. పెంచిన పింఛన్లు, పసుపు కుంకుమ చెక్కులు పంపిణీకి సోమవారం కిలగాడ వచ్చిన మంత్రి తిరిగి వెళ్తుండగా, మెట్టవీధి గిరిజనులు కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. తాగు నీరు లేక కలుషిత నీరు తాగుతున్నామంటూ కలుషిత నీరు ఉన్న బిందెలను చూపించారు. ఈ నీటినే తాగి రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. గ్రామం లోని బోర్లు మరమ్మతులకు గురై మూలకు చేరుకు న్నాయని, ఎన్నోసార్లు సంబంధిత అధికారులకు తెలియ జేసినా పట్టించుకోలేదని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అధికారులకు చెప్పిచెప్పి అలసిపోయా మన్నారు. దీనికి స్పందించిన మంత్రి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను గ్రామా నికి పంపించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుం టానని హామీ ఇచ్చారు. హామీని నెరవేర్చకుంటే ఆందోళన ను ఉధృతం చేస్తామని గిరిజనులు హెచ్చరించారు.

వైజాగ్-చెన్నై కారిడార్ నిర్వాసితులకు నష్ట పరిహారమివ్వాలి

ప్రజాశక్తి - నర్సీపట్నం (విశాఖపట్నం)

వైజాగ్, చెన్నై కారిడార్ పేరుతో ఎపిఐఐసి ద్వారా చేపట్టిన భూ సేకరణలో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ నిర్వాసితులు సోమవారం నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. విశాఖ జిల్లా నక్కపల్లి మండలం డిఎల్.పురం, అమలాపురం, వేంపాడు, చందనాడ, బుచ్చిరాజుపేట, రాజయ్యపేట గ్రామాలకు చెందిన నిర్వాసితులు మాట్లాడుతూ వైజాగ్, చెన్నై కారిడార్‌కు జిరాయితీతో పాటు డి-ఫారం, సాగులో ఉన్న భూములు సుమారు 2,500 ఎకరాల వరకు సేకరిస్తున్నారని చెప్పారు. డి-పారం హక్కుదారులకు పరిహారం చెల్లిస్తామని రైతుల దగ్గర పట్టాదారు పాసుపుస్తకాలు, క్లెయిమ్స్ తీసుకొని ఏడాది గడిచినా నేటికీ నష్టపరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం డి-ఫారం భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కొబ్బరిచెట్టు ఒక్కింటికి బి కేటగిరిలో రూ.4,640, మామిడి చెట్టుకు రూ.5,549, జీడిమామిడిచెట్టుకు రూ.2,508 చొప్పున చెల్లిస్తారని చెప్పి, ఇప్పుడు అమలాపురం, చందనాడ రెవెన్యూల పరిధిలో కొబ్బరికి రూ.293, మామిడికి రూ.321, జీడి మామిడికి రూ.196 చెల్లిస్తున్నారని వాపోయారు. దీని వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. అనంతరం ఆర్‌డిఒ విశ్వేశ్వరరావుకు వినతి పత్రం ఇచ్చారు. భూనిర్వాసితుల సంఘం కో-ఆర్డినేటర్ వీసం రామకృష్ణ, ఎస్.రామకృష్ణ, నిర్వాసితులు పాల్గొన్నారు.

ట్రైమెక్స్ కార్మికుల 'చలో కలెక్టరేట్' భగ్నం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కార్మికులను క్రమబద్ధీకరించి, కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీకాకుళం జిల్లా గార మండలం వత్సవలసలోని ట్రైమెక్స్ పరిశ్రమ కార్మికులు సిఐటియు ఆధ్వర్యాన సోమవారం తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను పోలీసులు భగ్నం చేశారు. ఈ డిమాండ్లపై కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారానికి వంద రోజులకు చేరింది. ఈ నేపథ్యంలో కార్మికులు శ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించ తలపెట్టగా, పోలీసులు అడ్డుకున్నారు. తాము శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తామని సిఐటియు నాయకులు, కార్మికులు చెప్పినా పోలీసులు వినిపించుకోలేదు. ర్యాలీగా వెళ్లేందుకు కార్మికులు ప్రయత్నించగా, పోలీసులు మళ్లీ అడ్డుకోవడంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోవిందరావు, ట్రైమెక్స్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు టి.తిరుపతిరావుతో పాటు 208 మంది కార్మికులను అరెస్టు చేసి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. విడుదల అనంతరం గోవిందరావు విలేకరులతో మాట్లాడుతూ వంద రోజులుగా కార్మికులు పోరాడుతున్నా యాజమాన్యం, అధికారులు చోద్యం చూస్తుండడం శోచనీయమన్నారు.



శ్రీకాకుళంలో సిఐటియు నాయకులు తిరుపతిరావును అరెస్టు చేస్తున్న పోలీసులు

కెయిర్న్ ఇండియా కార్మికులను అడ్డుకున్న నిరుద్యోగులు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం (తూర్పుగోదావరి)

ఎస్.యానాంలోని స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలంటూ కెయిర్న్ ఇండియా (వేదాంత) చమురు ప్లాంటును సోమవారం నిరుద్యోగులు, గ్రామస్తులు ముట్టడించారు. 55 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నా సంస్థ యాజమాన్యం స్పందించలేదంటూ ఆందోళన చేశారు. ప్లాంట్‌లో విధులకు వెళుతున్న కాంట్రాక్టు కార్మికులను అడ్డుకున్నారు. పరిస్థితి ఉధృతంగా మారడంతో ప్లాంటులో కార్యకలాపాలు నిలిపివేసి, పోలీసులను ఆశ్రయించారు. తహశీల్దారు జివిఎస్ ప్రసాద్, అమలాపురం రూరల్ సిఐ జి.సురేష్‌బాబు నిరుద్యోగులతో చర్చించారు. సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ సోమన్‌దేవ్, సిఎస్‌ఆర్ మేనేజర్ ఎస్‌ఎం పాషాలను శిబిరం వద్దకు రప్పించారు. ఈ నెల 8న అమలాపురం ఆర్‌డిఒ కార్యాలయంలో చర్చిస్తామని వారు వివరించారు. తమ డిమాండ్లకు స్పందించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని నిరుద్యోగులు హెచ్చరించారు. పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, నిరుద్యోగ సంఘ నాయకులు సత్య, ఉండ్రు శామ్యూల్, జివిఎస్ నాయుడు, లంకే వర్మ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వంటావార్పు

- కనీస వేతనం రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్



విజయనగరం కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న టి.వి.రమణ

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు జిఒ 151 ప్రకారం రూ.12 వేలు కనీస వేతనం ఇవ్వాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం విజయనగరం కలెక్టరేట్ వద్ద ఎపి గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా జరిగింది. ఆందోళనలో భాగంగా అక్కడ వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వి.రమణ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి ప్రజలకు సేవలందిస్తుంటే, ప్రభుత్వం వారికి కనీస వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, ప్రతి నెలా ఏడో తేదీలోపు వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వ్యర్థాలను తీస్తున్న కార్మికులకు యూనిఫారాలు, సబ్బులు, బూట్లు, గ్లౌజులు వెంటనే సరఫరా చేయాలని కోరారు. పారిశుధ్య కార్మికుల్లో అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా కన్వీనర్ పురం అప్పారావు, కో-కన్వీనర్ మద్దిల రమణ, బి.రామారావు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నిపుణుల నివేదికను అమలు చేయాలి : కొణతాల

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ

రాష్ట్ర విభజన, ఆంధ్రప్రదేశ్‌కు హామీలు, వాటి అమలు, ప్రస్తుత పరిస్థితిపై స్వతంత్ర నిపుణుల బృందం (ఐజిఇ) నివేదిక సిఫార్సులను తక్షణం అమలు చేయాలని మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విశాఖలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన హామీల అమలు కోసం ఢిల్లీకి 'జన ఘోష రైలు యాత్ర'ను నిర్వహించామన్నారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడుతో సహా పలు రాజకీయ పార్టీల జాతీయ నేతలను, కేంద్ర మంత్రులను, ఎపికి చెందిన అన్నిపార్టీల ఎంపీలను కలిసి వినతిపత్రాలు అందజేశామని వివరించారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు సాధన సమితి కన్వీనర్ జెవి.సత్యనారాయణమూర్తి, ఎస్ఎస్ శివశంకర్, చీడికాడ జెడ్పిటిసి సభ్యులు పి.సత్యవతి పాల్గొన్నారు.

మాల్యాను భారత్‌కు అప్పగించడానికి ఇంగ్లండ్ హోం మంత్రిత్వ శాఖ అనుమతి



లండన్ : విజయ్‌మాల్యాను భారత్‌ను పంపడానికి ఇంగ్లండ్ హోం మంత్రితత్వ శాఖ అనుమతి ఇచ్చింది. మాల్యాను భారత్‌కు అప్పగించాలని డిసెంబరు 9న ఇంగ్లాండ్ వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. మాల్యాను భారత్‌కు అప్పగించడానికి సోమవారం ఇంగ్లండ్ హోం మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చినట్లు ఆ శాఖ కార్యదర్శి సాజిద్ జావిద్ మీడియాకు తెలిపారు. అయితే హోం మంత్రితత్వ శాఖ నిర్ణయంపై అప్పీల్ చేయడానికి మాల్యాకు 14 రోజుల గడవు ఉంటుంది. భారత్‌లోని వివిధ బ్యాంకులకు వేల కోట్ల రుణాలను ఎగొట్టినట్లు విజయ్ మాల్యా ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.



విన్యాసాలు : ముంబైలోని గేట్ వే ఆఫ్ ఇండియా వద్ద నిర్వహిస్తున్న బైక్ విన్యాసాలు

రేపు నింగికెగరనున్న జిశాట్-31

ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో

బెంగళూరు: దేశీయంగా నిర్మించిన 40వ కమ్యూనికేషన్ ఉపగ్రహం జిశాట్-31ను బుధవారం అంతరిక్షంలోకి ప్రయోగించేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఏర్పాట్లు పూర్తి చేసింది. 15 ఏళ్ల జీవిత కాల పరిమితి కలిగిన ఈ ఉపగ్రహం కొన్ని ప్రస్తుత ఉపగ్రహాల కార్యకలాపాలను కొనసాగించటంతో పాటు కెయుబ్యాండ్ ట్రాన్స్‌పాండర్ సామర్ధ్యంతో నిర్ణీత కక్ష్యలో సేవలందిస్తుందని ఇస్రో ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం 2,535 కిలోల బరువున్న ఈ ఉపగ్రహాన్ని ఏరియన్-5 రాకెట్‌తో ఫ్రెంచ్ గుయానాలోని కౌరు ప్రయోగ కేంద్రం నుండి ప్రయోగించనున్నట్లు ఇస్రో వెల్లడించింది. ఈ ఉపగ్రహం భారత ప్రధాన భూభాగంతో పాటు దీవులకు కూడా కవరేజ్ అందిస్తుందని తెలిపింది. ఈ ఉపగ్రహాన్ని విశాట్ నెట్‌వర్క్‌ల అనుసంధానంతో టెలివిజన్ అప్ లింక్‌లు, డిజిటల్ ఉపగ్రహ సమాచార సేకరణ, డిటిహెచ్ టివీ సేవలు, సెల్యులార్ బ్యాక్ హాల్ కనెక్టివిటీ వంటి అనేక సేవలలో వినియోగించుకోనున్నట్లు ఇస్రో తన ప్రకటనలో వివరించింది. ఈ ఉపగ్రహంలో అమర్చిన విస్తృత స్థాయి బ్యాండ్ ట్రాన్స్‌పాండర్ అరేబియా సముద్రం, బంగాళాఖాతం, హిందూ మహాసముద్ర ప్రాంతాలలో విస్తృత సేవలందిస్తుందని ఇస్రో వెల్లడించింది.

బిహెచ్‌యులో దళిత ప్రొఫెసర్‌పై కాషాయ గూండాల దాడి

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మకమైన బెనారస్ హిందూ యూనివర్శిటీలో గత నెల 29న ఒక దళిత ప్రొఫెసర్‌పై ఎబివిపికి చెందిన కాషాయ గూండాలు దాడి చేసి ఆయన్ను బూట్లదండతో ఊరేగించి అవమానించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బిహెచ్‌యులో సోషియాలజీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఈ ప్రొఫెసర్ మనోజ్ వర్మ మరో ప్రొఫెసర్‌ను ఒక విద్యార్థినితో కలిపి కొన్ని వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఎబివిపి)కి చెందిన కొందరు కార్యకర్తలు, బయటి వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేసి కొట్టారని, అనంతరం ఆయనకు బూట్ల దండ వేసి యూనివర్శిటీ కాంపస్‌లో ఊరేగించారని తెలుస్తోంది. ఘటన జరిగిన కొద్ది రోజుల తరువాత ఇందుకు సంబంధించిన వీడియో ఇంటర్నెట్‌లో వైరల్ కావటంతో ఈ ఘటన వెలుగు చూసింది. ఈ ప్రొఫెసర్ దళిత వర్గానికి చెందిన వాడైనందునే ఆయన్ను టార్గెట్ చేసినట్లు ఊహాగానాలు వ్యాపించాయి. మరో విభాగాధిపతి అరవింద్‌కుమార్ జోషి ఒక విద్యార్థినితో గోవా బీచ్‌లో విహరిస్తున్న దృశ్యాలను చిత్రీకరించిన మనోజ్ కుమార్ వర్మ వాటిని తన ఫేస్‌బుక్ ఖాతాలో అభ్యంతరకర వ్యాఖ్యలతో పోస్ట్ చేశారని ఒక విద్యార్థి తనను కలిసిన మీడియా ప్రతినిధులకు చెప్పారు. ఒక వేళ ఆయన అటువంటి అభ్యంతరకరమైన పోస్ట్‌లు చేసి వుంటే వాటిపై శాఖాపరమైన విచారణ జరిపి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి తప్ప, ఆయన్ను నిర్దాక్షిణ్యంగా కొట్టటం దారుణమని ఆ విద్యార్థి వ్యాఖ్యానించాడు. వర్మ అగ్రకులానికి చెందిన వాడైతే ఆయనపై దాడి చేయటానికి ఏ ఒక్కరూ ధైర్యం చేసే వారు కాదన్నాడు. అరవింద్ కుమార్ జోషి తన డిపార్ట్‌మెంట్‌ను తన సొంత పద్ధతిలో నడుపుతుండటంపై తాను అభ్యంతరం వ్యక్తం చేశానని, దీనితో అతడు తన విద్యార్థులతో తనను బెదిరించాడని వర్మ చెప్పారు. తన కులాన్ని టార్గెట్ చేయడం వల్లే తనపై దాడి చేశారని ఆయన స్పష్టం చేశారు.


గత ఎన్నికల్లో బిజెపి నన్ను వాడుకుంది

ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే



రాలేగావ్ సిద్ధి : గత 2014 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి తనను ఉపయోగించుకున్నదని ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే సోమవారం అన్నారు. లోక్‌పాల్, లోకాయుక్త వ్యవస్థల ఏర్పాటును డిమాండ్ చేస్తూ ఈ హామీలను నరేంద్ర మోడి ప్రభుత్వం నెరవేర్చకపోతే 'పద్మ భూషణ్'ను వెనక్కి ఇచ్చేస్తానని ప్రకటించారు. హజారే తన సొంత గ్రామమైన రాలేగావ్ సిద్ధిలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష సోమవారం నాటికి ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ "అవును బిజెపి 2014 ఎన్నికల్లో నన్ను ఉపయోగించుకుంది. లోక్‌పాల్ కోసం నేను నిర్వహించిన ఉద్యమంతో బిజెపి, ఆమ్ ఆద్మీ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఇప్పుడు నాకు వారిపై గౌరవం పోయింది." అని హజారే అన్నారు. ప్రధాని నరేంద్ర మోడి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదన్నారు. దేశాన్ని నియంతృత్వం వైపు తీసుకెళ్తున్నారని విమర్శించారు. బిజెపి నేతృత్వంలోని మహారాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలుగా అబద్ధాలు చెప్పిందన్నారు. "ఎంతకాలం అబద్ధాలు చెబుతారు? ఈ ప్రభుత్వం దేశ ప్రజలను మోసగిస్తున్నది. నా డిమాండ్లలో 90 శాతం సమ్మతించినట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నదంతా అబద్ధం" అని ఆయన అన్నారు. గతంలో తాను ఉద్యమం జరిపినప్పుడు చేదోడు వాదోడుగా ఉన్న ప్రస్తుత ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ప్రస్తుతం జరుపుతున్న ఆందోళనలో చేరేందుకు స్వాగతిస్తున్నానన్నారు. కాని తనతో వేదిక పంచుకునేందుకు అనుమతించనని చెప్పారు.అంతకుముందు బిజెపి మిత్ర పక్షమైన శివసేన అన్నా హజారేకు మద్దతు ప్రకటించింది. సోషలిస్టు నేత జయప్రకాష్ నారాయణ్ అడుగుజాడల్లో నడవాలని, అవినీతి వ్యతిరేక ఆందోళనను ముందుండి నడిపించాలని హజారేకు శివసేన విజ్ఞప్తి చేసింది. దేశంలోనే మూడో అత్యున్నత పురస్కారం పద్మభూషణ్‌ను 1992లో హజారేకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. ఎన్నికల సంస్కరణలు చేపట్టాలని, వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించేందుకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, అవినీతిని నిరోధించేందుకు కేంద్రంలో లోక్‌పాల్‌ను, రాష్ట్రాలలో లోకాయుక్తల వ్యవస్థలను ఏర్పాటు చేయాలని హజారే డిమాండ్ చేస్తున్నారు.

సిబిఐ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శుక్లా



న్యూఢిల్లీ : కేంద్ర దర్యాప్తు సంస్థ(సిబిఐ) నూతన డైరెక్టర్‌గా రిషికుమార్ శుక్లా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రధాని మోడీ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ శుక్లాను సిబిఐ డైరెక్టర్‌గా ఎంపిక చేసింది. శుక్లా ఇంతకు ముందు మధ్యప్రదేశ్ డిజిపిగా బాధ్యతలు నిర్వహించారు. సిబిఐలో గతంలో ఉన్నతాధికారులుగా ఉన్న అలోక్‌వర్మ, రాకేష్ ఆస్తానాల మధ్య వివాదం నెలకొన్న కారణంగా కేంద్రం వారిద్దరినీ బలవంతపు సెలవుపై పంపించిన సంగతి తెలిసిందే. అనంతరం తాత్కాలిక డైరెక్టర్‌గా నాగేశ్వరరావు విధులు నిర్వహించారు. తనను సిబిఐ డైరెక్టర్ పదవి నుండి తొలగించడంపై వర్మ కోర్టుకు వెళ్లారు. కోర్టు ఆదేశాల అనంతరం తిరిగి వర్మ రెండు రోజుల పాటు డైరెక్టర్‌గా వచ్చారు. తదుపరి పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం వర్మను ఫైర్ సర్వీసుల డీజీగా బదిలీ చేసింది. అయితే ఆయన ఆ పదవికి రాజీనామా చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రధాని నేతృత్వంలో అత్యున్నత కమిటీ శుక్లాను సిబిఐ డైరెక్టర్‌గా ఎంపిక చేసింది. ప్రస్తుతం సిబిఐ, కోల్‌కతా పోలీసు అధికారుల మధ్య నడుస్తున్న వివాదం శుక్లాకు సవాలుగా మారిందని విశ్లేషకులు పేర్కొన్నారు.

గువహతి రైల్వే స్టేషన్‌లో పేలుడు పదార్థాల పట్టివేత

గువహతి : గువహతి రైల్వే స్టేషన్‌లో ఒక ప్లాట్‌ఫామ్‌పై డిటోనేటర్లు, జిలిటెన్ స్టిక్‌లతో ఉన్న మూడు బ్యాగ్‌లను సోమవారం ఉదయం పోలీసులు కనుగొన్నారు. మూడో నంబరు ప్లాట్‌ఫాంపై తెల్లవారురుఝామున 5.45 గంటల సమయంలో రైల్వే పోలీసులు ఆ బ్యాగ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆ బ్యాగుల్లో 440 జిలిటెన్ స్టిక్‌లున్న 22 పాకెట్‌లు, ఏడు ప్యాకెట్‌లలో ఉన్న 700 డిటోనేటర్లు, మూడు బండిళ్ళ ఫ్యూజ్ వైర్‌ను కనుగొన్నారు. మరో బ్యాగ్‌ను ప్లాట్ ఫామ్‌పై ఉన్న అవధ్ ఎక్స్‌ప్రెస్‌లోని ఎసి 2 టైర్ కోచ్ టాయిలెట్ వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఈ బ్యాగ్‌లో 8 ప్యాకెట్‌లలో 160 జిలిటెన్ స్టిక్‌లు, ఐదు పాకెట్‌లలో 500 డిటోనేటర్లు ఉన్నాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అస్సాంలో పెద్ద ఎత్తున దాడి జరిపేందుకు తీవ్రవాదులు పథకం వేసి ఉంటారని, అందులో భాగంగానే వీటిని తరలిస్తున్నారని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు తెలిపారు.

ఆందోళన చేస్తూనే పోలీసులకు అవార్డులు

ఒకే రోజు రెండు వేదికలపై మమత

న్యూఢిల్లీ : తమ ప్రభుత్వంపై కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, అందుకు సిబిఐని పావుగా వాడుకొంటోందని ఆరోపిస్తూ, కోల్‌కతాలో ఆదివారం నుండి నిరవధిక ఆందోళన కొనసాగిస్తున్న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం పోలీసు అధికారులకు అవార్డులిచ్చే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒక వైపు ఆందోళనను కొనసాగిస్తూనే మరో వైపు అవార్డులు ప్రదానం చేయడం అందరినీ విస్మయానికి లోను చేసింది. ఆమె ఆందోళన కొనసాగిస్తున్న వేదిక పక్కనే పోలీసులకు అవార్డులు ఇచ్చేందుకు మరో వేదికను ఏర్పాటు చేశారు. ఆ వేదికపైకి వెళ్ళి పోలీసు అధికారులకు అవార్డులు ప్రదానం చేశారు. కోల్‌కతాలో ఆదివారం చోటు చేసుకున్న పరిణామాల క్రమంలో పోలీసు అధికారి రాజీవ్ కుమార్‌కు ఆమె అండగా నిలిచారు. కాగా బిజెపి ప్రభుత్వం అత్యంత నీచమైన రాజకీయ కుట్రకు పాల్పడుతున్నదని మమతా బెనర్జీ విమర్శించారు.

అరిష్టదాయకం

బెంగాల్ పరిణామాలపై సిపిఎం పొలిట్‌బ్యూరో



ఇండియా న్యూస్‌నెట్‌వర్క్, న్యూఢిల్లీ:

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ), బెంగాల్ రాష్ట్ర పోలీసుల మధ్య తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలు అవాంఛనీయమైనవని సిపిఎం పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. బెంగాల్‌లో శారదా, రోజ్‌వాలి తదితర చిట్‌ఫండ్ కంపెనీలు ఆర్థిక కుంభకోణాలకు పాల్పడి కోట్లాది రూపాయల ప్రజల కష్టార్జితాన్ని దోచుకున్న వైనంపై దర్యాప్తు చేయాలని సుప్రీం కోర్టు 2014లోనే సిబిఐని ఆదేశించిందని పొలిట్‌బ్యూరో తన ప్రకటనలో గుర్తు చేసింది. నల్లధనాన్ని వెలికి తీస్తామంటూ ఆర్భాటపు ఎన్నికల వాగ్దానాలతో అధికారం చేపట్టిన మోడీ సర్కారు ఈ కుంభకోణాలపై ఐదేళ్ల పాటు నిమ్మకు నీరెత్తినట్లు వుందని వివరించింది. ఈ ఐదేళ్ల కాలంలో ఈ కుంభకోణాలలో నిందితులైన ముకుల్‌రాయ్, హేమంత్ శర్మ వంటి తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన పలువురు ఎంపిలు బిజెపిలో చేరిపోయారని, స్పష్టంగా చెప్పాలంటే ఈ కుంభకోణాలతో జరిగిన లూటీలో బిజెపి, టిఎంసిలు రెండూ భాగస్వాములేనని, సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా కొనసాగుతున్న దర్యాప్తు మందగమనానికిఈ రెడు పార్టీలు బాధ్యత వహించాల్సివుంటుందని పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో బిజెపి యేతర రాష్ట్ర ప్రభుత్వాలపై నిరంకుశ దాడులు చేయటం, సిబిఐ వంటి రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టు పట్టించటం వంటి చరిత్ర వున్న మోడీ సర్కారు ఇప్పుడు చేపడుతున్న చర్యలు రాజకీయ దురుద్దేశంతో కూడినవేనని చెప్పక తప్పదని పొలిట్‌బ్యూరో అభిప్రాయపడింది. అదే విధంగా ఈ చర్యలపై బెంగాల్‌లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి స్పందన రాజకీయ పూరితమైనవేనని స్పష్టం చేసింది. ఈ కుంభకోణాల వెనుక వున్న దోషులను చట్టానికి పట్టించి వారిని కఠినంగా శిక్షించాలని సిపిఎం మొదటి నుండి డిమాండ్ చేస్తోందని, వారి ఆస్తులను స్వాధీనం చేసుకుని బాధిత ప్రజలు నష్టపోయిన సొమ్మును తిరిగి ఇవ్వాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. అయితే ఈ డిమాండ్‌కు ఇటు బిజెపితో పాటు అటు తృణమూల్ కాంగ్రెస్ కూడా వెన్నుపోటు పొడిచాయని తెలిపింది.

బెంగాల్‌లో బిజెపి, తృణమూల్ కాంగ్రెస్‌పై వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహానికి దర్పణం పడుతూ బ్రిగేడ్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం జరిగిన చారిత్రాత్మక ర్యాలీ నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ పరిణామాలు తెరపైకి వస్తున్నాయని వ్యాఖ్యానించింది. ప్రజా ధనాన్ని లూటీ చేసిన వారెవరైనా, వారు బిజెపి లేదా తృణమూల్ కాంగ్రెస్‌లో వున్నా వారిని చట్టానికి పట్టించి, కఠినంగా శిక్షించటంతో పాటు వారి ఆస్తులను, లూటీ చేసిన సొమ్మును స్వాధీనం చేసుకుని బాధిత ప్రజలకు వడ్డీతో సహా తిరిగి చెల్లించాలన్న డిమాండ్‌ను పొలిట్‌బ్యూరో తన ప్రకటనలో పునరుద్ఘాటించింది.



పీపుల్స్ బ్రిగేడ్ నుంచి దృష్టి మరల్చడానికే

బిజెపి-టిఎంసి దొంగాట

మమతా డ్రామాను వ్యతిరేకిస్తూ సిపిఎం ర్యాలీ

ప్రజాశక్తి ప్రతినిధి-కొల్‌కతా : పది లక్షల మందితో భారీగా నిర్వహించిన పీపుల్స్ బ్రిగేడ్ (ప్రజా కవాతు) నుంచి దృష్టి మరల్చడానికే బిజెపి-తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)లు ప్రణాళిక ప్రకారమే దొంగాట ఆడుతున్నాయని సిపిఎం విమర్శించింది. పీపుల్స్ బ్రిగేడ్‌ను అపహాస్యం చేయడానికే కొల్‌కతా పోలీసులు- సిబిఐ అధికారుల మధ్య వివాదం, ముఖ్యమంత్రి మమత బెనర్జీ ధర్నా నాటకం ఆడుతున్నారని విమర్శించింది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నాటకాన్ని విమర్శిస్తూ సిపిఎం సోమవారం రాత్రి ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సూర్యకాంత మిశ్రా, లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ బిమన్ బసు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు నిపెన్ చౌదరితో పాటు వామపక్ష నేతలు సుజన్ చక్రవర్తి, రాబిన్ దేవ్, మదన్ ఘోష్, దీపక్ దాస్ గుప్తా ప్రముఖ న్యాయవాది బికాష్ రంజన్ భట్టాచార్యా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. రామ్‌లీలా మైదానం సమీపంలోని మౌలీలా క్రాసింగ్ నుంచి పార్క్ సర్కస్ వద్ద లేడీ బ్రాడోర్నే కాలేజ్ వరకూ సుమారు 1.5 కిలీమీటర్ల మేర ఈ ర్యాలీ జరిగింది. 'చోర్ ధోర్, జైల్ భోరో', 'క్యాచ్ తీఫ్- సెంట్ దేమ్ టూ జైల్, 'నో డ్రామా- బట్ జైల్‌గేట్ టూ క్రిమినల్స్', 'బిఫోర్ ఓట్ సిబిఐ అఫ్టర్ ఓట్ యాస్ భాయి' అంటూ ర్యాలీలో నినాదాలు మారు మ్రోగాయి. ఈ ర్యాలీ అనంతరం సూర్యా కాంత మిశ్రా మాట్లాడుతూ ముందుస్తు ప్రణాళిక ప్రకారమే ఈ డ్రామా కార్యక్రమం నడిచిందని అన్నారు. ఈ నాలుగు సంవత్సరాలు సిబిఐ ఏం చేసిందని ప్రశ్నించారు. పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్‌ను రక్షించడానికి కార్యాలయం మందు ధర్నాకు దిగిన మమతా బెనర్జీ మరి తమ సొంత పార్టీ నేతలు మదన్ మిత్రా, ఎంపి సుదీప్ బధాపాధ్యలను అరెస్టు చేసినప్పుడు ఏం చేశారని ప్రశ్నించారు. చిట్ ఫండ్ స్కామ్‌లో రాజీవ్ కుమార్ ప్రధాన నిందితుడని, ఆయన ఈ కేసులో సాక్ష్యాలను అధారాలను తారుమారు చేసినట్లు కూడా అధారాలు ఉన్నాయని తెలిపారు. లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ బిమన్ బసు మాట్లాడుతూ ఇందులో ఎలాంటి వివాదం లేదని, సిబిఐ ప్రధాని మోడీ అధ్వర్యంలో ఉంటాయని, కొల్‌కతా పోలీసులు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో ఉంటారని, మమతా-మోడీ ప్రణాళిక ప్రకారమే ఈ డ్రామా నడిచిందని ఆయన తెలిపారు.

అయోధ్యలో వివాదాస్పద స్థల సేకరణ చట్టంపై

సుప్రీంలో సవాల్

న్యూఢిల్లీ: అయోధ్యలోని రామజన్మభూమి-బాబ్రీ మసీదు వివాదాస్పద స్థలం సమీపంలో భూసేకరణకు సంబంధించి 1993 నాటి కేంద్ర భూసేకరణ చట్టం రాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ సోమవారం సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. అయోధ్యలోని వివాదాస్పద స్థం వద్ద వున్న భూమి రాష్ట్ర ప్రభుత్వానికి చెందినదని, ఈ భూసేకరణకు పార్లమెంట్‌కు ఎటువంటి చట్టపరమైన అధికారం లేదని పిటిషనర్‌లు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. తమను తాము రామ్‌లల్లా భక్తులుగా పేర్కొంటూ లక్నోకు చెందిన ఇద్దరు న్యాయవాదులు, మరో ఐదుగురు వ్యక్తులు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. మతపరమైన ప్రదేశాలలో సంబంధిత వ్యవహారాలపై చట్టం చేసేందుకు రాష్ట్ర శాసనసభకు విస్తృత అధికారాలున్నాయని వారు పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 హిందువులకు హామీ ఇచ్చిన మత పరమైన హక్కులను 1993 నాటి అయోధ్య భూసేకరణ చట్టం ఉల్లంఘిస్తోందని వారు కోర్టుకు వివరించారు. ఈ భూమిలో వున్న ప్రార్థనా మందిరాలలో హిందు మత క్రతువులలో జోక్యం చేసుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోర్టు నియంత్రించాలని వారు కోరారు. అయోధ్యలోని వివాదాస్పద భూమిని, చట్టం ద్వారా సేకరించిన 67 ఎకరాల వివాదాస్పద భూమిని సంబంధిత యజమానులకు తిరిగి ఇచ్చేందుకు అనుమతించాలని కోరుతూ గత నెల 29న కేంద్రం కోర్టులో పిటిషన్ దాఖలుచేసిన వారం రోజుల్లోపే ఈ పిటిషన్ దాఖలు కావటం గమనార్హం.

ఇది ఎన్నికల నేపథ్యంలో ప్రజాకర్షక బడ్జెట్

ఫిచ్ సొల్యూషన్స్ • ద్రవ్యలోటు 3.6 శాతం

న్యూఢిల్లీ : తాజాగా కేంద్ర బడ్జెట్ ఎన్నికలే లక్ష్యంగా, ప్రజాకర్షకంగా రూపొందించిందని అనిఫిచ్ సొల్యూషన్స్ వ్యాఖ్యానించింది. ఫిచ్ గ్రూప్‌నకు చెందిన పరిశోధక విభాగం ఫిచ్ సొల్యూషన్స్ 2019-20 బడ్జెట్‌పై సోమవారం తన నివేదికను విడుదల చేసింది. ఈ ఏడాది మేలో జరిగే ఎన్నికల లక్ష్యంగానే ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని, ప్రభుత్వ విధానాలతో గత ఏడాది 3.0 శాతంగా ఉన్న ద్రవ్యలోటు ఈ ఏడాది 3.6 శాతానికి పెరగనుందని విమర్శించింది. ప్రభుత్వ అంచనాలకు మించి వ్యయాల పెరుగుదల ఉంటుందని మేం నమ్మకంగా ఉన్నాం. బడ్జెట్ ప్రసంగంలో కూడా ప్రభుత్వం ఇదే విషయాన్ని తెలిపింది. అవసరమైతే అదనపు నిధులు విధులు విడుదల చేస్తామని తెలిపింది' అని ఫిచ్ సొల్యూషన్స్ తన ప్రకటనలో పేర్కొంది. ఈ ఏడాది ద్రవ్యలోటు 3.6 శాతంగా ఉంటుందని అంచనా వేసింది.

వేతన సవరణ చేయాలి

బ్యాంకు, ప్రభుత్వ రంగ సంస్థల స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వేతన సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ దేశంలోని బ్యాంకు అధికారులు, ప్రభుత్వం రంగ సంస్థల అధికారులు, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. సోమవారం నాడిక్కడ స్థానిక జంతర్ మంతర్ వద్ద ఆల్ ఇండియా ప్రభుత్వ రంగ సంస్థల అధికారుల సంఘం, బ్యాంకు అధికారుల సంఘం, స్టీల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, విశాఖ ఉక్కు అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. దేశం నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది అధికారులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఈ ఆందోళనలో ఎంపిలు ఎన్.కె ప్రేమ్ చంద్రన్, సంజయ్ సింగ్‌లు పాల్గొని సంఘీభావం తెలిపారు. సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల అధికారులకు 2017 నుంచి పెండింగులో ఉన్న వేతన సవరణ వెంటనే చేయాలని, 2007 నుంచి పెండింగులో ఉన్న పింఛన్ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో అధికారుల సంఘ నాయకులు వికె తోమర్, బంచోర్, బిమల్ బిషి, కాటం చంద్రరావు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బిజెపిలో దమ్మున్న వ్యక్తి గడ్కరీనే! : రాహుల్

న్యూఢిల్లీ : 'బిజెపిలో కాస్తో కూస్తో దమ్మున్న వ్యక్తి నితిన్ గడ్కరీ ఒక్కరేనని' కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్వీట్ చేస్తూ, రాఫెల్ కుంభకోణం, రైతుల దుస్థితి, సంస్థలను నాశనం చేయడం వంటి ఈ మూడు అంశాలపై కూడా స్పందించాలని రాహుల్ ఆయనకు సూచించారు. శనివారం బిజెపి విద్యార్థి విభాగం ఎబివిపి కార్యక్రమంలో గడ్కరీ మాట్లాడుతూ, 'ఇంటిని చక్కదిద్దుకోలేని వాడు దేశాన్ని చక్కదిద్దలేడని' వ్యాఖ్యానించారు. ఆ నేపథ్యంలో రాహుల్ ట్వీట్ వెలువడింది. బిజెపి కోసం పని చేస్తానంటూ తన వద్దకు ఒక వ్యక్తి వచ్చాడంటూ ఆ వ్యక్తి గురించి చెబుతూ గడ్కరీ పై వ్యాఖ్య చేశారు. సరిగా నడవడం లేదని తన దుకాణాన్ని మూసివేసిన ఆ వ్యక్తికి భార్యా పిల్లలు వున్నారని, అప్పుడు తాను ఒకటే సలహా ఇచ్చానని గడ్కరీ చెప్పారు. ముందు నీ ఇంటిని చక్కదిద్దుకో, తర్వాత దేశం కోసం ఆలోచిద్దువు గానీ అని చెప్పానని అన్నారు. దానిపై అనేక వ్యాఖ్యలు వెల్లువెత్తాయి.

మా ప్రభుత్వానికి ముప్పు లేదు : కుమారస్వామి

బెంగళూరు : తన నేతృత్వంలోని జెడిఎస్-కాంగ్రెస్ సంకీర్ణ సర్కార్‌కు ఎలాంటి ముప్పు లేదని కర్నాటక ముఖ్యమంత్రి హెచ్‌డి కుమార స్వామి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తనతో సంతోషంగా ఉన్నారని,తమ ప్రభుత్వం ఐదేళ్ల పూర్తి కాలం కొనసాగుతుందని సోమవారం అన్నారు. ఈ వారంలో ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేల నుంచి ఎలాంటి సమస్యలు తలెత్తవని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 6 నుంచి జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో తన ప్రభుత్వాన్ని కూల్చడానికి బిజెపి ప్రయత్నిస్తోందనే వార్తలను కుమారస్వామి ఖండించారు. తమ ఎమ్మెల్యేల కోసం రూ.50 కోట్లను బిజెపి ఆఫర్ చేసిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సిద్దరామయ్య చేసిన ఆరోపణలను ముఖ్యమంత్రి వద్ద ప్రస్తావించగా, 'ఒకవేళ రూ. 100 కోట్లు ఇచ్చినా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అటువైపు వెళ్లరు' అని కుమార స్వామి తెలిపారు.

అన్నింటికీ ఆధార్ వద్దు!

- సామాన్యుడిని సమస్యల్లోకి నెట్టొద్దు
- పర్యావరణ పరిరక్షణ అవసరం
- జంతర్ మంతర్ ధర్నాలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆధార్‌ను అన్నిటికీ తప్పనిసరి చేయడం తగదని ఢిల్లీ సైన్స్ ఫోరం ప్రతినిధి దినేష్ అబ్రోల్ పేర్కొన్నారు. సైబర్ దాడుల ప్రభావిత దేశాల్లో భారత్ ఐదో స్థానంలో ఉందని, ఇటువంటి తరుణంలో అన్నింటికీ ఆధార్ అంటూ మోడీ సర్కార్ నిర్ణయం తీసుకోవడంపై నిరసన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో ఐడెంటిటీని మాస్క్ చేయడం, మాల్‌వేర్‌లో వాడిన కోడ్ బహిరంగ మార్కెట్‌లోకి వచ్చినపుడు, దానిని హ్యాకర్లు కొని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న డేటాను దొంగలిస్తారని చెప్పారు. సైబర్ దాడులకు పాల్పడేవారు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, బీమా, ఇంధనం, నౌకాయానం, విద్యుత్తు, ఇతర రంగాల్లోకి చొరబడుతున్నారని వివరించారు. ఏదైనా తప్పిదం జరిగితే, దేశంలో ఎంతోమంది సామాన్య ప్రజానీకం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటారని వెల్లడించారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 7 వరకు పలు సామాజిక, ప్రజాస్వామ్య సంఘాలు, రాజకీయ పార్టీలు సంయుక్తంగా తలపెట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పలు ప్రజా సంఘాలు ఐక్యంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆధార్ దుర్వినియోగం, పర్యావరణ పరిరక్షణపై ధర్నా చేపట్టారు. ఆయా ప్రజా సంఘాలకు చెందిన కార్యకర్తలు ధర్నాలో వేలాదిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఢిల్లీ సైన్స్ ఫోరం ప్రతినిధి దినేష్ అబ్రోల్ మాట్లాడుతూ... ప్రైవేటు వ్యవహారాలకు ఆధార్‌ను వినియోగించవద్దని భారత సర్వోన్నత న్యాయస్థానం కేంద్రాన్ని పలుమార్లు ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. భారత రిజర్వ్ బ్యాంకు కూడా ఆధార్‌ను బ్యాంకులు తప్పనిసరి చేయడాన్ని తప్పుబట్టిందని తెలిపారు. అయితే, కేంద్ర ప్రభుత్వం మాత్రం ప్రతి విషయానికి ఆధార్‌ను అడిగి సామాన్య ప్రజానీకాన్ని తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఇది ఏమాత్రం సహేతుకం కాదని అభిప్రాయపడ్డారు. ఇటువంటి నిర్ణయాలు సగటు పౌరుడి భద్రతను ప్రమాదంలోకి నెట్టివేస్తాయని అన్నారు. ఇంటర్ నెట్ ఫ్రీడం ఫౌండేషన్ నిర్వాహకులు అపర్ గుప్తా మాట్లాడుతూ ఎన్నికల సంఘం కూడా ప్రతి ఓటరు కార్డుకు ఆధార్ లింక్ చేయాలని యోచిస్తోందని. ఇది చాలా ప్రమాదకరమైన చర్యగా అభివర్ణించారు. ఆధార్ సమాచారం నిక్షిప్తంగా ఉంచాల్సి ఉంటుందని అన్నారు. "అన్నింటికీ ఆధార్ వద్దు" అన్న నినాదంతో ముందుకెళ్తామని చెప్పారు. భారతీయ వ్యాపార మండలికి చెందిన బికె బన్సల్ మాట్లాడుతూ జీఎస్టీ చట్ట సవరణతో దేశంలోని చిన్న, మధ్య తరహా వ్యాపారులంతా తీవ్రంగా దెబ్బతిన్నారని అన్నారు. జీఎస్టీ వల్ల వ్యాపారుల నడ్డి విరిగిందని, చిన్న వ్యాపారులకు గడ్డు రోజులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీని గద్దె దించితేనే చిన్న వ్యాపారులకు ఇబ్బందులు తొలుగుతాయన్నారు. జీఎస్టీకి కూడా ఆధార్ అనుసంధానం చేస్తే తమ వ్యాపార వివరాలకు ఏమాత్రం గోపత్య ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సంబంధిత పథకాల లబ్ధిదారులను ఆధార్ లింక్ చేయడంపై ఎన్నో ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. జాతీయ డేటా సెంటర్ వద్ద సరైన బయోమెట్రిక్ విధానం లేదని అన్నారు. దీనిపై సమగ్రమైన చర్చ జరిగిన తర్వాతే సుప్రీం కోర్టు తీర్పు చెప్పిందని గుర్తు చేశారు. పర్యావరణ పరిరక్షణకు అందరు కలిసి కట్టుగా ఉద్యమించాలని నేతలు సూచించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆలిండియా బ్యాంకు అధికారుల సంఘం నాయకులు థామస్ ఫ్రాంకో, ఫ్రీ సాఫ్ట్‌వేర్ ఫౌండేషన్ నిర్వాహకుడు ప్రోబీర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

భార్యను అమానుషంగా హత్య చేసిన భర్త

గుర్‌గాన్ : భార్యను అమానుషంగా హత్య చేసిన భర్త ఉదంతం శనివారం హర్యానాలోని గుర్‌గాన్‌లో చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి మృతురాలి భర్త పంకజ్, అతని స్నేహితుడు నసీం అహ్మద్‌ను ఆదివారం సాయంత్రం అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. తన భార్య నిద్రపోతున్న సమయంలో నిందితుడు ఆమెపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేసి హతమార్చాడని అన్నారు. తమకు 2017, ఏప్రిల్ పెళ్లి అయిందని, భార్య తనపట్ల అవమానకంగా ప్రవర్తిస్తుండడంతో ఈ దురంతానికి పాల్పడినట్లు నిందితుడు విచారణలో పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌లోకి తీసుకున్నామని తెలిపారు.

మానసిక స్థైర్యంతో దేన్నైనా జయించొచ్చు : పారికర్

న్యూఢిల్లీ : మానసిక స్థైర్యంతో ఎటువంటి వ్యాధినైనా జయించొచ్చని గోవా సిఎం మనోహర్ పారికర్ అన్నారు. అనారోగ్యంతో స్థానిక ఎయిమ్స్‌లో చికిత్స తీసుకుంటున్న ఆయన సోమవారం ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా ఈ మేరకు ట్వీట్ చేశారు. పారికర్ తీవ్ర అనారోగ్య సమస్యతో గత కొన్ని నెలలుగా భాధపడుతున్నారు. గత వారం గోవా అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సమయంలోనూ ముక్కులో ట్యూబ్‌తో కనిపించారు.

మా కార్యక్రమాలకు మమతా సర్కార్ అడ్డుపడుతోంది

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లో తమ రాజకీయ కార్యక్రమాలను అనుమతించడం లేదంటూ తృణమూల్ కాంగ్రెస్ సర్కార్‌పై బిజెపి ఆరోపణలు చేసింది. స్వేచ్ఛగా, సక్రమంగా లోక్‌సభ ఎన్నికలు జరిగేలా ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ మేరకు ఉన్నత స్థాయి బిజెపి ప్రతినిధి వర్గం మెమోరాండం సమర్పించింది. ప్రజాస్వామ్యంలో తృణమూల్ కాంగ్రెస్‌కు నమ్మకం లేదంటూ అందుకు సంబంధించిన పలు ఉదాహరణలను పేర్కొంది. ప్రతినిధి బృందంలో సభ్యురాలైన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ విలేకర్లతో మాట్లాడుతూ, బెంగాల్‌లో బిజెపికి మద్దతు పెరుగుతుండటంతో తృణమూల్ కలవరపడుతోందని అందుకే పార్టీ కార్యక్రమాలను అడ్డుకుంటోందని విమర్శించారు.

ఎల్‌సాల్వడార్ అధ్యక్ష ఎన్నికల్లో బుకేలే విజయం



సాల్వడార్: ఎల్‌సాల్వడార్‌లో ఆదివారం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో గ్రేట్ అలయెన్స్ ఫర్ నేషనల్ యూనిటీ (గానా) అభ్యర్థి నాయిబ్ బుకెలే 53.1 శాతం ఓట్లతో ఘన విజయం సాధించారు. అధికార ఫరబుండో మార్టి నేషనల్ లిబరేషన్‌ఫ్రంట్ (ఎఫ్ఎంఎల్ఎన్) తరపున బరిలోకి దిగిన హ్యూగో మార్టినెజ్‌కు కేవలం 14 శాతం ఓట్లు మాత్రమే లభించాయి. ఎరీనా పార్టీ తరపున పోటీ చేసిన కార్లోస్ కలేజా కు 31.8 శాతం ఓట్లు లభించాయని ఎన్నికల కమిషన్ వెల్లడించింది. తుది సమాచారం అందే సమయానికి 80.1 శాతం ఓట్లను లెక్కించినట్లు అధికారులు వెల్లడించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే విజేత బుకెలే మీడియాతో మాట్లాడుతూ తనపై విశ్వాసముంచి బాధ్యతలను అప్పగించిన దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలియచేశారు.

అనారోగ్యం



థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో వాయు కాలుష్యం తీవ్రమై ముక్కుల నుండి రక్తం కారుతుండటంతో మాస్క్‌లను ధరించి పాఠశాలలకు హాజరవుతున్న విద్యార్థులు

బ్యాంకాక్‌లో తీవ్ర వాయు కాలుష్యం

పెద్ద సంఖ్యలో అస్వస్థులైన ప్రజలు

బ్యాంకాక్ : థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో వాయు కాలుష్యం తీవ్ర సమస్యగా పరిణమించింది. ఈ వాయు కాలుష్యంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పలువురు ముక్కుల్లో నుండి రక్తం రావడం, కళ్ళు ఎర్రబారడం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. రాజధానిలో గాలి నాణ్యత బాగా దెబ్బతిందని దీని ప్రభావంతో తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి చెబుతూ ప్రజలు సోషల్ మీడియాలో పలు ఫోటోలు పెడుతున్నారు. రాజధానిలో దాదాపు 41 ప్రాంతాల్లో గాల్లో నాణ్యత తగ్గిందని, దుమ్ము ధూళి కణాలు పెరిగిపోయాయని అధికారులు చెబుతున్నారు. కాగా ఈ వాయు కాలుష్యంపై సోషల్ మీడియాలో ప్రజలు తమ ఆందోళన, అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాలుష్యానికి సంబంధించిన హ్యాష్‌టాగ్‌లు వైరల్ అవుతున్నాయి. పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం కృత్రిమ మేఘాలను సృష్టించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

ఇయు మళ్ళీ చర్చలు జరపాలి

బ్రిటన్ వ్యాఖ్య

లండన్ : బ్రెగ్జిట్‌కు సంబంధించి ఎలాంటి ఒప్పందం లేకపోయినా ఫరవాలేదు కానీ మళ్ళీ చర్చలు జరపకపోతే అది యూరోపియన్ యూనియన్ బాధ్యతారాహిత్యం అవుతుందని బ్రిటన్ వాణిజ్య శాఖ కార్యదర్శి లియామ్ ఫాక్స్ వ్యాఖ్యానించారు. పాత ఒప్పందానికే కట్టుబడి వుండడం బాధ్యతారహితమని అన్నారు. దీనిపై చర్చలు చేయడానికి ప్రధాని థెరిస్సా మే బ్రస్సెల్స్ వెళుతున్నారు. గడువు తేది మార్చి 29 సమీపిస్తున్న నేపథ్యంలో బ్రెగ్జిట్‌కు సంబంధించి ఎలాంటి ఒప్పందం లేకపోవడమనేది వాస్తవిక పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. ఈ పరిస్థితులు, పరిణామాలు అటు బ్రిటన్‌ను, ఇటు ఇయుని దెబ్బ తీయనున్నాయని లియామ్ ఫాక్స్ ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అయితే ఒప్పందం కుదుర్చుకోవడం దేశ ప్రయోజనాల కోసమేనని అన్నారు. గతేడాది థెరిస్సా మే కుదుర్చుకున్న ఒప్పందంపై తదుపరి చర్చలు జరిపేది లేదని, కనీసం గణనీయమైన మార్పులు చేయడం జరగదని ఇయు నేతలు, అధికారులు పదే పదే చెబుతున్నారు. థెరిస్సా మే కుదుర్చుకున్న ఒప్పందాన్ని బ్రిటన్ ఎంపీలు పూర్తిగా తిరస్కరిస్తున్నారు. పైగా తిరిగి బ్రస్సెల్స్ వెళ్ళి చర్చలు జరపాలని కోరుతున్నారు. అయితే ఈ అంశంపై కొత్త చర్చలేవీ జరగబోవని ఇయు స్పష్టం చేసింది.

గాలిలో పేలిన విమానం

శకలాలు ఇంటిపై పడి. కాలిఫోర్నియాలో ఐదుగురి మృతి



కేలిఫోర్నియా: కేలిఫోర్నియాలో ఆదివారం ఒక విమానం గాలిలోనే పేలిపోయిన ఘటనలో దాని శకలాలు ఒక ఇంటిపై పడి ఐదుగురు దుర్మరణం పాలయ్యారని, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని అధికారులు చెప్పారు. ఇంటి వెనుకభాగంలో కూలిపోయిన ఈ రెండు ఇంజన్ల విమానం మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైందని వివరించారు. విమానం పైలట్‌తో సహా ఇంటిలో వున్న నలుగురు వ్యక్తులు మంటల్లో చిక్కుకుని మరణించినట్లు కాలిఫోర్నియాలోని ఆరంజ్ కౌంటీ షరీఫ్ లెఫ్టినెంట్ కోరి మార్టినో చెప్పారు. ఇంటిలో మంటల్లో చిక్కుకుని మరణించిన నలుగురిలో ఇద్దరు పురుషుల వున్నారని అధికారులు తెలిపారు. సెస్నా 414ఎ తరహా విమానం ఘటనా స్థలానికి కొంత దూరంలో టేకాఫ్ అయిన కొద్ది నిముషాలకు ప్రమాదంలో చిక్కుకున్నదని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ప్రతినిధి అలెన్ కెనిట్జర్ వివరించారు. ఈ ఘటనతో భయకంపితులైన ఇరుగుపొరుగు వారు వీధుల్లోకి పరుగులు తీసారని ఆయన చెప్పారు. విమానంలో ఒక ఇంజన్ భవనాన్ని ఢీకొనగా, రెండో ఇంజన్ విమానం నుండి విడిపోయి ఒక రోడ్డుపై పడటంతో అక్కడ భారీ గొయ్యి ఏర్పడిందని జాతీయ రవాణా భద్రతా వ్యవస్థ ప్రతినిధి ఇలియాట్ సింప్సన్ చెప్పారు.

వెనిజులాపై సైనిక చర్య : ట్రంప్ బెదిరింపు

తీవ్రంగా ఖండించిన వెనిజులా, సార్వభౌమత్వాన్ని పరిరక్షించుకుంటామని ఉద్ఘాటన





వాషింగ్టన్/కారకాస్: వెనిజులాపై సైనిక చర్య తీసుకునే అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులను వెనిజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ తీవ్రంగా ఖండించారు. తనతో భేటీ కోసం వెనిజులా అధ్యక్షుడు మదురో చేసిన విజ్ఞప్తిని తాను తిరస్కరించినట్లు ట్రంప్ ఆదివారం ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. వెనిజులాపై సైనిక చర్య చేపట్టాలన్న ప్రతిపాదనను కూడా తాము పరిశీలిస్తున్నామని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కొద్ది నెలల క్రితం తనతో భేటీకి అవకాశం కోరారని, అయితే తాను అందుకు తిరస్కరించానని ఆయన వివరించారు. వెనిజులాలో ప్రజాస్వామ్య పరిరక్షణ ప్రక్రియలో తమ మధ్య ఇప్పటికే చాలా దూరం ఏర్పడిందని, ఇకపై చర్చలకు తావులేదని ఆయన స్పష్టం చేశారు. వెనిజులాలో ప్రజాస్వామ్య పరిరక్షణ ప్రక్రియ ఇప్పుడు భారీ నిరసనలతో ఊపందుకుంటోందని ఆయన వివరించారు. ఇదిలా వుండగా వెనిజులా ఆర్థిక, సామాజిక సమస్యలను పరిష్కరించటంలో అంతర్జాతీయ సమాజం సహకరించాలని, ఆ దేశంలో విధ్వంసానికి దారి తీసే జోక్యానికి దూరంగా వుండాలని రష్యా విదేశాంగశాఖ విజ్ఞప్తి చేసింది. వెనిజులా తన ఆర్థిక, సామాజిక సమస్యలను పరిష్కరించుకోవటంలో సాయం చేయటమే అంతర్జాతీయ సమాజం లక్ష్యం కావాలని, సరిహద్దుల్లోపల ఎటువంటి విధ్వంసక జోక్యానికి దిగకూడదని విదేశాంగ మంత్రిత్వశాఖ లాటిన్ అమెరికా వ్యవహారాల విభాగం అధిపతి అలెగ్జాండర్ షెట్నిన్ స్పష్టం చేశారు.

సార్వభౌమత్వాన్ని పరిరక్షించుకుంటాం: వెనిజులా

తమ దేశంపై సైనిక జోక్యం చేసుకుంటామన్న ట్రంప్ బెదిరింపులను వెనిజులా తీవ్రంగా ఖండించింది. తమదేశ సార్వభౌమత్వంపై ఎటువంటి చర్చలూ వుండవని, దానిని పరిరక్షించుకోవటమే తమ ముందున్న కర్తవ్యమని ఆదివారం మీడియాకిచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. వెనిజులాపై సైనిక చర్య చేపట్టే అంశాన్ని పరిశీలిస్తున్నామంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఏ మాత్రం ఆమోదయోగ్యం కావని ఆమె అన్నారు. ఒక దేశ సార్వభౌమత్వంపై దాడికి దిగితే ఆ దేశ సైన్యం, ప్రజలు తిరగబడేందుకు పూర్తి స్థాయిలో సిద్ధంగా వుంటారని, ఒక దేశ స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ చర్చనీయాంశాలు కాబోవని ఆమె తేల్చిచెప్పారు. వెనిజులాలోకి ఎటువంటి విదేశీ దురాక్రమణను అనుమతించబోమని, తమ సరిహద్దులను పరిరక్షించుకునేందుకు తాము పూర్తి స్థాయిలో సిద్ధంగా వున్నామని ఆమె పునరుద్ఘాటించారు. వెనిజులా పొరుగునే వున్న కొలంబియా సరిహద్దుల్లోకి అమెరికా 5 వేల మంది సైనికులను పంపుతోందన్న వార్తలపై తీవ్రంగా స్పందిస్తూ డెల్సీ ఈ వ్యాఖ్యలు చేశారు. తమ దేశంలో తలెత్తిన రాజకీయ సంక్షోభాన్ని శాంతియుతంగా, తమ రాజ్యాంగ పరిధిలో పరిష్కరించుకునే సత్తా తమ ప్రభుత్వానికి వుందని ఆమె స్పష్టం చేశారు. ఇదిలా వుండగా తమ దేశంలోకి సైనికులను పంపేందుకు అమెరికా ప్రభుత్వం తమను ఎటువంటి అనుమతి అడగలేదని కొలంబియా ప్రభుత్వం ప్రకటించటం కొసమెరుపు.

అమెరికా బెదిరింపులకు క్యూబా ఖండన



హవానా : వెనిజులా రక్షణకు అందరూ సమీకృతులు కావాల్సిందిగా క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రొడ్రిగజ్ శనివారం పిలుపిచ్చారు. లాటిన్ అమెరికాలో సామ్రాజ్యవాద జోక్యాన్ని తక్షణమే నిలుపుచేయాలని కోరారు.

వెనిజులాకు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్ర వెనుక సూత్రధారి అమెరికా ప్రభుత్వమేనని, అవసరమైతే వెనిజులాపై సైనిక దాడికి దిగుతామని హెచ్చరించడాన్ని ఖండించారు. ఈ విషయంలో తమకు సహకరించాలని యూరప్‌పై ఒత్తిడి తెస్తోందని రొడ్రిగజ్ ట్వీట్ చేశారు. లాటిన్ అమెరికా దేశాల్లో సామ్రాజ్యవాద జోక్యాన్ని నిలుపుచేసేందుకు మనందరం చేతులు కలపాలని ఆయన కోరారు. ఫ్లోరిడాలోని మియామి కౌంటీలో వెనిజులా సంక్షోభంపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వెనిజులా ప్రతిపక్ష నేత జువాన్ గైడోతో సమావేశమైన విషయం ప్రస్తావించకపోవడంపై అమెరికా ఉపాధ్యక్షుడైన మైక్ పెన్స్‌ను క్యూబా విదేశాంగ మంత్రి ప్రశ్నించారు.

ఎల్‌సాల్వడార్ అధ్యక్ష ఎన్నికల్లో బుకేలే విజయం

సాల్వడార్: ఎల్‌సాల్వడార్‌లో ఆదివారం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో గ్రేట్ అలయెన్స్ ఫర్ నేషనల్ యూనిటీ (గానా) అభ్యర్థి నాయిబ్ బుకెలే 53.1 శాతం ఓట్లతో ఘన విజయం సాధించారు. అధికార ఫరబుండో మార్టి నేషనల్ లిబరేషన్‌ఫ్రంట్ (ఎఫ్ఎంఎల్ఎన్) తరపున బరిలోకి దిగిన హ్యూగో మార్టినెజ్‌కు కేవలం 14 శాతం ఓట్లు మాత్రమే లభించాయి. ఎరీనా పార్టీ తరపున పోటీ చేసిన కార్లోస్ కలేజా కు 31.8 శాతం ఓట్లు లభించాయని ఎన్నికల కమిషన్ వెల్లడించింది. తుది సమాచారం అందే సమయానికి 80.1 శాతం ఓట్లను లెక్కించినట్లు అధికారులు వెల్లడించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే విజేత బుకెలే మీడియాతో మాట్లాడుతూ తనపై విశ్వాసముంచి బాధ్యతలను అప్పగించిన దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలియచేశారు.

ట్రంప్, కిమ్ రెండో సదస్సుకు కసరత్తు

చర్చలు జరిపిన అధికారులు

సియోల్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉత్తరకొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ రెండవ శిఖరాగ్ర సదస్సు వివరాలను ఖరారు చేయడానికి కసరత్తు జరుగుతోంది. ఉత్తర కొరియాలో అమెరికా ప్రత్యేక దూత స్టీఫెన్ బేగన్ దక్షిణ కొరియా జాతీయ భద్రతా సలహాదారు చుంగ్ ఇయు యాంగ్‌తో సమావేశమై ఈ మేరకు చర్చలు జరిపారని దక్షిణ కొరియా అధ్యక్ష భవనం తెలిపింది. చర్చలకు ముందుగా ఉత్తర కొరియా పట్ల అమెరికా వైఖరిని స్టీఫెన్ వివరించారని అధ్యక్ష భవనం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ వారంలో పానున్‌జోమ్‌లో గానీ లేదా పోన్‌గ్యాంగ్‌లో గాని ఇరువురు సమావేశం కావచ్చునని భావిస్తున్నారు. అయితే సోమవారం వీరి సమావేశంలో ఏ అంశం చర్చకు వచ్చిందనే వివరాలను అధ్యక్ష భవనం వెల్లడించలేదు.

మొదటి పేజీ తరువాయి

ప్యాకేజీకి ఒప్పుకున్నది బాబే

ఆవరణంలో బిజెపి ఉత్తరాంధ్ర శక్తి కేంద్రాల నాయకుల సమావేశంలోనూ, శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ రైల్వేగ్రౌండ్‌లో బిజెపి చేపట్టిన సత్యమేవ జయతే ప్రజా చైతన్య యాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలోనూ ఆయన మాట్లాడారు. సిఎం చంద్రబాబునాయుడు అసెంబ్లీలో ప్రత్యేక ప్యాకేజీని అభినందిస్తూ తీర్మానం చేశారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిని, ప్రజా వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు బిజెపిపైనా, ప్రధాని మోడీపైనా నిందలు మోపుతున్నారన్నారు. హోదాను సాకుగా చూపి ఎన్‌డిఎ నుంచి వైదొలిగారని, తెలంగాణాలో మహాకూటమి పేరుతో కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేసి ఓడిపోయిన తరువాత, కొత్త పార్టీలతో కొత్త పొత్తులకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలందరికీ చంద్రబాబు చరిత్ర తెలుసని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి మామ ఎన్‌టిఆర్‌ను మోసం చేసి పార్టీని, పదవిని కైవసం చేసుకున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రతిపక్షనేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిపైనా అవినీతి ఆరోపణలున్నాయన్నారు. వైసిపి, టిడిపి కుటుంబ పార్టీలని, అవినీతిలో కూరుకుపోయాయని విమర్శించారు. అమిత్‌షా పర్యటన నేపథ్యంలో టిడిపి నాయకులు కాశీబుగ్గ ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ఆందోళనకు దిగారు. 'అమిత్‌షా గోబ్యాక్' అంటూ నినాదాలు చేశారు. పలాస ఎమ్మెల్యే శివాజీ, టిడిపి జిల్లా అధ్యక్షులు శిరీష, టిడిపి నాయకులు, కార్యకర్తలు రోడ్డుకు అడ్డంగా నిలబడి అమిత్‌షా రానున్న మార్గంలో నిరసన తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ప్రారంభించిన నిరసన రెండు గంటలపాటు కొనసాగింది. పోలీసులు వారిని అరెస్టు చేసి, అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

2.26 లక్షల కోట్లు!

ఎక్కువ కేటాయింపులు ఉంటాయని అంటున్నారు. అలాగే పెట్టుబడి వ్యయంక గత ఏడాది 28,678 కోట్లుగా ప్రతిపాదించగా తాజా ప్రతిపాదనలో మరో వెయ్యి కోట్ల రూపాయలు మాత్రమే పెరగనుందని తెలుస్తోంది. దీంతో రాష్ట్ర అభివృద్ధికి తీసుకునే శాశ్వత చర్యలకన్నా, తాత్కాలిక పథకాలతో ఓట్లకు గాలం వేయడానికే ప్రభుత్వం మొగ్గు చూపనుందని తెలుతోంది.

సమ్మెతో ప్రభుత్వం మెడలు వంచాలి

జెఎసికి మద్దతుగా ఉంటామని తెలిపారు. ఎన్జీవోలతో సమానంగా ఫిట్‌మెంట్ ఇవ్వాలని, ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అమరావతి జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అందరికీ రాయితీలిస్తున్నప్పుడు ఆర్టీసి ఏం తప్పు చేసిందన్నారు. యాజమాన్యానికి కార్మికుల సత్తా చూపించాలని, సమ్మెకు మద్దతుగా ఉంటామని తెలిపారు. వైఎస్‌ఆర్‌టియు రాష్ట్ర నాయకులు విశ్వనాథరెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు చలసాని రామారావు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్, బహుజన సమాజ్‌వాద్ పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె పొలారి మద్దతు తెలిపారు. సమావేశానికి ఆర్టీసి ఇయు రాష్ట్ర అధ్యక్షులు వైవి రావు అధ్యక్షత వహించగా జెఎసి కన్వీనర్ పలిశెట్టి దామోదరరావు, కో-కన్వీనర్లు సిహెచ్ సుందరయ్య, వి వరహాల నాయుడు, జెఎసి సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ కమిషనర్‌ను కలిసిన ఎన్ఎంయు

ఆర్టీసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యంతో సమావేశం ఏర్పాటు చేయాలని ఎన్ఎంయు నాయకులు కార్మిక శాఖ కమిషనర్ వరప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. వేతన సవరణ చేయాలని, సర్వీస్ కండీషన్లు మెరుగుపర్చాలని, ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని, గ్యారేజీ సర్కులర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ఎంయు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు పివి రమణారెడ్డి, ఉపాధ్యక్షులు ఎం దుర్గాప్రసాద్, పివి శివారెడ్డి, నాయకులు సుబ్బారావు కమిషనర్‌ను కలిశారు.

కొనసాగిన టిడిపి ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్‌లో టిడిపి ఎంపీలు చేస్తున్న ఆందోళన సోమవారం కూడా కొనసాగింది. పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ఎంపిలు ప్లకార్డులతో ఆందోళన చేశారు. అనంతరం ఎంపీ రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలకు రావాల్సిన రైల్వేజోన్ ఇవ్వలేదని, యూనివర్శిటీల కోసం భూములిచ్చినా పట్టించుకోలేదని అన్నారు. ఒకే కులానికి చెందిన డిఎస్పీలను ఎక్కడ నియమించారో జగన్ చెప్పాలని ఎంపి మురళీ మోహన్ ప్రశ్నించారు.

స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించాలి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో 59.18 లక్షల నకిలీ ఓట్లు ఉన్నాయని ప్రతిపక్ష నేత, వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోపించారు. రకరకాల సర్వేల పేరుతో ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని, రానున్న ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) సునీల్ అరోరాను కోరారు. సోమవారం జగన్ నేతృత్వంలోని వైసిపి బృందం సిఇసిని కలిసింది. అధికార తెలుగుదేశం పార్టీ ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడుతోందని, అధికార యంత్రాంగాన్ని, పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తోందని ఫిర్యాదు చేసింది. అనంతరం జగన్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ప్రజాస్వామ్య ప్రక్రియను ఎంత దారుణంగా ఉల్లంఘిస్తోందన్న అంశాన్ని ఈసి దృష్టికి తీసుకెళ్లామని, ఎన్నికల ప్రక్రియను ఒక ప్రహసనంగా మార్చారని ఫిర్యాదు చేశామని తెలిపారు. ఓటర్ల లిస్టును ఎలా తారుమారు చేస్తున్నారో ఈసికి వివరించామని, సెప్టెంబర్ 2018 నాటికి 52.67 లక్షల నకిలీ ఓట్లు చేర్చారని, ప్రస్తుతం నకిలీ ఓట్ల సంఖ్య 59.18 లక్షలకు చేరిందని తెలిపారు. ప్రజా సాధికార సర్వే, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజిఎస్) డేటాబేస్, పరిష్కార వేదిక, పిరియాడిక్ సర్వేల పేరుతో వివరాలు తెలుసుకుని ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే 4 లక్షల వైసిపి సానుభూతిపరుల ఓట్లను తొలగించారని, ఈ తొలగింపు ప్రక్రియకు ఒక యాప్‌ను కూడా సృష్టించారని ఆరోపించారు.

చంద్రబాబు పోలీస్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నాడని, 37 మందిలో సొంత సామాజిక వర్గానికి చెందిన 35 మందికి సిఐ నుంచి డిఎస్పీగా ప్రమోషన్లు ఇచ్చారని ఆరోపించారు. ఎప్పుడూ లేని విధంగా డిఐజి లా అండ్ ఆర్డర్ కోఆర్డినేషన్ పోస్ట్ క్రియేట్ చేసి చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన ఘట్టమనేని శ్రీనివాస్‌రావును నియమించారని, తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులను కీలక పోస్టుల్లో ఉంచి ఎన్నికలకు వెళ్లాలని చంద్రబాబు చూస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో, నిష్పక్షపాతంగా జరగాలంటే డిజిపి ఠాకూర్, ఇంటెలిజెన్స్ ఐజి వెంకటేశ్వరరావు, డిఐజి ఘట్టమనేని శ్రీనివాస్‌రావును బదిలీ చేయాలని ఈసిని కోరినట్లు తెలిపారు. ఈవిఎంలతో ఏదో జరిగిపోతుందని చంద్రబాబు ఇప్పుడు గగ్గోలు పెడుతున్నారని, ఇదే చంద్రబాబు 2014 ఎన్నికల్లో ఎలా గెలిచారని ప్రశ్నించారు. అప్పుడు కూడా ఈవిఎంలు ట్యాంపరింగ్ అయ్యాయా? తాము అలా అనుకోవాలా? అని జగన్ ప్రశ్నించారు. సిఈసిని కలిసిన వారిలో వైసిపి ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపిలు మేకపాటి రాజమోహన్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, వరప్రసాద్‌లతో పాటు ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, వైసిపి సీనియర్ నేత సజ్జల రామకృష్ణా రెడ్డి తదితరులున్నారు.



ప్రధాన ఎన్నికల కమిషనర్ కార్యాలయం నుంచి వెలుపలకు వస్తున్న వైఎస్‌ఆర్‌సిపి అధినేత జగన్మోహన్ రెడ్డి

ఢిల్లీ పెద్దల కనుసన్నల్లో జగన్ రాజకీయాలు

మంత్రి దేవినేని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రతిపక్షనేత వైఎస్ జగన్ ఢిల్లీ పెద్దల కనుసన్నల్లో రాజకీయాలు చేస్తున్నారని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు పాల్పడుతూ బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. జలవనరులశాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఓడిపోతానన్న భయంతో ఢిల్లీ వేదికగా రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లుతున్నారన్నారు. ఓట్ల నమోదు, తొలగింపు ప్రక్రియ పూర్తిగా ఎన్నికల కమిషన్ చేతుల్లో ఉంటుందన్న విషయాన్ని జగన్ మర్చిపోయి మాట్లాడుతున్నారని తెలిపారు. రాష్ట్రానికి విభజన హామీలు అమలు చేయనందున కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా రెండు రోజుల క్రితం రాష్ట్రవ్యాప్తంగా నల్ల చొక్కాలు ధరించి నిరసన తెలిపితే, జగన్ ఈరోజు ఢిల్లీలో నల్ల చొక్కా ధరించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఎపికి జరిగిన అన్యాయంపై ఒక్క మాటైనా జగన్ మాట్లాడారా అని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్ర అత్యున్నత పోలీస్ వ్యవస్థపై నమ్మకం లేని జగన్‌కు, రాష్ట్ర ప్రజల ఓట్లు ఎందుకని ప్రశ్నించారు.

50% వివిప్యాట్‌లు లెక్కించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇది మొదటి సారి కాదని, గతంలో కూడా చాలా సార్లు అనుమానుల వ్యక్తం చేశామని అన్నారు. ఆ తరువాతే వివిప్యాట్‌లు వచ్చాయని, కానీ ప్రస్తుతం వాటిని ఒక శాతం మాత్రమే లెక్కిస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో పారదర్శికతను తీసుకురావాలంటే పేపర్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరగాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి చెందిన దేశాలు, సాంకేతిక పరిజ్ఞానంలో ముందున్న దేశాలు సైతం పేపర్ బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ప్రస్తుతం సమయం లేనందున 50 శాతం వివిప్యాట్‌లు లెక్కించాలని డిమాండ్ చేస్తున్నామని, వంద శాతం వివిప్యాట్‌లు లెక్కించడం కూడా పెద్ద సమస్య కాదన్నారు. ఓటరకు ఏపార్టీకి, ఏ వ్యక్తికి ఓటు వేస్తోన్నానో తెలుసుకోవడం ప్రజాస్వామ్యంలో కీలకమని అన్నారు. ఎన్నికలపై జవాబుదారీ తనం, పారదర్శికత తీసుకురావాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని అన్నారు. ఈసి సరైన నిర్ణయం తీసుకుంటుందనే విశ్వాసం తమకు ఉందని చంద్రబాబు తెలిపారు. సిపిఐ నేత డి.రాజా మాట్లాడుతూ స్వేచ్ఛయుత వాతావరణంలో, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. ప్రజలకు ఎన్నికల వ్యవస్థపై విశ్వసనీయ కల్పించాలని, ఈవిఎంలపై నమ్మకం కల్పించాలని కోరినట్లు చెప్పారు. ఎన్నికల సంఘం తమ వాదన విన్నదని, సానుకూల చర్యలు చేపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘాన్ని కలిసిన వారిలో అహ్మద్ పటేల్, మల్లికార్జున ఖర్గే, ఆనంద్ శర్మ (కాంగ్రెస్), రాంగోపాల్ యాదవ్(ఎస్పీ), ఒమర్ అబ్దు ల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), డెరెక్ ఒబ్రెయిన్(టిఎంసి), ఎండి. సలీం, టి.కె రంగరాజన్(సిపిఎం), మజీద్ మెనోన్(ఎన్సీపి), మనోజ్ ఝా (ఆర్జేడి), సంజయ్ సింగ్(ఆప్), దినేష్ అలీ(జెడిఎస్), ఎన్.కె ప్రేమ్‌చంద్రన్(ఆరెస్పీ), కోరుమ్ ఓమీర్(ఐయుఎంఎల్), బదురుద్దీన్ అజ్మల్(ఎఐయుడిఎఫ్), కెజి కెన్యే(ఎన్‌పిఎఫ్) తదితరులు ఉన్నారు.

శరద్ పవర్ నివాసంలో ప్రతిపక్షాలు భేటీ

ఎన్నికల సంఘం కలిసిన అనంతరం ప్రతిపక్షాల నేతలు ఎన్సీపి అధినేత శరద్ పవర్ నివాసంలో భేటీ అయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ చెప్పిన మాట నిలబెట్టుకోకుండా బిజెపి నమ్మక ద్రోహం చేసిందని, ఆ పార్టీ నేతలు మాట్లాడటం చాలా దారుణమని అన్నారు. దాడి చేసి, బెదిరించే దోరణి ప్రదర్శిస్తే ఇక్కడెవ్వరూ భయపడరని అన్నారు. జగన్ తప్పుడు ప్రచారాలు చేస్తారని, కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. తన ప్రభుత్వంలో అన్ని కులాల వారు ఉన్నారని అన్నారు. నాడు కాంగ్రెస్ పార్టీ చట్టంలో 11 విద్యా సంస్థలను పెట్టిందని, ఆ సంస్థల ఏర్పాటుకు రూ.12 వేల కోట్లు అవసరమైతే, బిజెపి సర్కార్ కేవలం రూ.672 కోట్లు ఇచ్చిందని విమర్శించారు. కడప స్టీల్ ప్లాంట్, విశాఖ రైల్వే జోన్, మెట్రో రైలు, పెట్రో కెమికల్ ఇచ్చారా? రెవెన్యూ లోటు పూడ్చారా? పోలవరం ప్రాజెక్టు పూర్తి చేశారా? అన్ని ఇచ్చామని ఎలా చెప్పుకుంటారని ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్ వెళ్లి మమతా బెనార్జీకి సంఘీభావం తెలుపుతానని చెప్పారు. అన్ని రాజ్యాంగ సంస్థల ను దుర్వినియోగం చేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యమా? అని ప్రశ్నించారు. ఈ భేటీలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, డెరిక్ ఒబ్రెయిన్(టిఎంసి), ఎన్.కె ప్రేమ్ చంద్రన్(ఆరెస్పీ), సంజయ్ సింగ్ (ఆప్),కెజి కెన్యే(ఎన్‌పిఎఫ్), కోరుమ్ ఓమీర్(ఐయుఎంఎల్) తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బెంగాల్ దుమారం

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. సిపిఎం ఎంపీ బదురుద్దజాఖాన్ మాట్లాడుతూ మమత బెనర్జీ కూడా తప్పు చేసిందని అన్నారు. బ్రిగేడ్ పెరేడ్ ర్యాలీ ప్రభావం నుంచి బెంగాల్ ప్రజల దృష్టిని మరల్చేందుకు ఆమె ప్రయత్నిస్తోందని అన్నారు. ఎస్పీ, ఆర్జేడి, ఎన్సీపి, తదితర పార్టీలు తృణమూల్ కాంగ్రెస్‌కు మద్దతు తెలిపాయి. మరోవైపు రాజ్యసభలో కూడా ఇదే 'సీన్' కొనసాగింది. టిఎంసి ఎంపిల ఆందోళనతో సభ మంగళవారానికి వాయిదా పడింది.

ఆధారాలున్నాయా....సిబిఐకి సుప్రీం ప్రశ్న

చిట్‌ఫండ్ కుంభకోణానికి సంబంధించి సాక్ష్యాలను మాయం చేసేందుకు పోలీసు కమిషనర్ యత్నించారన్న ఆరోపణలకు తగిన సాక్ష్యాలను చూపాలని సుప్రీంకోర్టు ధర్మాసనం సిబిఐని ప్రశ్నించింది. బెంగాల్‌లో చోటుచేసుకున్న పరిణామాలపై తక్షణమే విచారణ నిర్వహించాలని కోరూతూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్ సందర్భంగా కోర్టు ఈ ప్రశ్న వేసింది. సిబిఐ సమయం కోరడంతో మంగళవారానికి విచారణను వాయిదా వేశారు.

8వ తేదివరకు దీక్ష

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ చేపట్టిన దీక్ష 8వ తేది వరకు కొనసాగనుంది. దీక్షా శిబిరం నుండే ఆమె ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పోలీస్ శాఖ నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు. అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరేంద్ర మోడీ వైఖరికి నిరసనగా ఇక నుండి కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే నిధులను రాష్ట్రం స్వీకరించబోదని చెప్పారు. 'వివిధ పథకాల కింద కేంద్రం నిధులు ఇస్తుంది. వాటిని ఇక మనం తీసుకోం.' అని ఆమె అన్నారు. ప్రధాని మోడీ రైతుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు.

నిప్పుతో చెలగాటమాడుతున్న మోడీ :శత్రుఘ్నసిన్హా

మమతా బెనర్జీని సిబిఐతో టార్గెట్ చేయటం ద్వారా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిప్పుతో చెలగాటమాడుతోందని బిజెపి అసమ్మతి నేత శత్రుఘ్నసిన్హా ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిందని ఆయన ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. గత కొంతకాలంగా ప్రధాని మోడీ, బిజెపి అధ్యక్షుడు అమిత్‌షాలను 'వన్‌మాన్ ఆర్మీ, టూమాన్ షో' అంటూ శత్రుఘ్న సిన్హా నిప్పులు చెరుగుతున్న విషయం తెలిసిందే. రానున్న ఎన్నికల్లో బిజెపి తనకు టికెట్ ఇవ్వకపోతే మరో పార్టీ ద్వారా ఎన్నికయ్యేందుకు తాను సిద్ధంగా వున్నానని, అదే స్థానం నుండి పోటీ చేస్తానని, పరిస్థితి మాత్రం భిన్నంగా వుంటుందని మరోట్వీట్‌లో పేర్కొన్నారు.

'సైరా'కు డెడ్‌లైన్


చిరంజీవి

దర్శకుడు సురేందర్ రెడ్డికి చిరంజీవి డెడ్‌లైన్ విధించారు. మార్చి చివరినాటికి 'సైరా నరసింహారెడ్డి' చిత్రం షూటింగ్ పూర్తి కావాల్సిందేనని చెప్పారు. ఆయన టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రమిది. స్వతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం ఆధారంగా తెరకెక్కుతోంది. నయన తార కథానాయిక. అమితాబ్ బచ్చన్ చిరంజీవికి గురువుగా ఇందులో నటిస్తున్నారు. ఈ సినిమాను దసరాకు విడుదల చేసేలా చిత్రీకరణ జరపాలని చిత్రబృందం భావిస్తుంది. అందులో 24 గంటలూ ఎడతెరపి లేకుండా చిత్రీకరణ జరుపుతున్నారు. ఇటువంటి జోనర్ చిత్రాలు తెరకెక్కించడం సురేందర్ రెడ్డికి ఇదే మొదటిసారి. అందువల్ల తన పద్ధతిలోనే షూటింగ్ జరుపుతున్నాడు. ఇప్పుడు చిరంజీవి ఒత్తిడి మేరకు మార్చి చివరినాటికి ఎట్టిపరిస్థితుల్లోనూ చిత్రీకరణ పూర్తి చేసేలా సన్నాహాలు చేస్తున్నారు. మార్చి నుంచి పోస్టు ప్రొడక్షన్ పనులు చేస్తారు. తర్వాత దసరాకు ముందు ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఈ సినిమా త్వరగా పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించడానికి కారణం లేకపోలేదు. చిరంజీవి త్వరలో కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నాడు. దీంతో పాటు చిత్రీకరణ సమయం పెరుగుతూ ఉండడం వల్ల నిర్మాణ వ్యయం పెరుగుతుందని నిర్మాత రామ్ చరణ్ ఆందోళన కూడా ఓ కారణంగా చెప్పవచ్చు. ఏప్రిల్‌లో కొరటాల శివ చిత్రం సెట్స్‌పైకి వెళనుంది.

విజయ్ అరుదైన ఘనత

2019 ఫోర్బ్స్ ఇండియా '30 అండర్ 30' జాబితాలో చోటు



విజయ్ దేవరకొండ...తక్కువ సమయంలో స్టార్‌డమ్ సంపాదించిన హీరో. తనదైన శైలిలో ప్రేక్షకులను మెప్పిస్తున్నాడు. అగ్రహీరోలకు సైతం పోటీగా నిలుస్తున్నాడు. తాజాగా ఈ యువ కథానాయకుడు అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. ఆయన 2019 ఫోర్బ్స్ ఇండియా '30 అండర్ 30'లో చోటు దక్కించుకున్నాడు. భారతదేశం నుంచి ఈ ఘనత దక్కించుకున్న నటుడు ఇతన్కొడు కావడం విశేషం. 30 ఏళ్ల కన్నా తక్కువ వయసు ఉండి.. తమ తమ రంగాల్లో అద్భుత ప్రతిభ కనబర్చినవారి జాబితాను ఫోర్బ్స్ సోమవారం విడుదల చేసింది. నటుడిగా విజయ్ ఈ ఖ్యాతి దక్కించుకున్నారు. 'అర్జున్ రెడ్డి' చిత్రం విజయంతో విజయ్ స్టార్‌డమ్ అమాంతంగా పెరిగిపోయింది. తన సహజ నటనతో 'గీత గోవిందం' చేశాడు. అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్నాడు. ఈ హీరో 2011లో 'నువ్విలా' సినిమాతో నటుడిగా సినీరంగ ప్రవేశం చేశాడు. 2012లో 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్'లో అతిథి పాత్రలో సందడి చేశారు. 'ఎవడే సుబ్రమణ్యం' సినిమాతో ఆయనకు మంచి గుర్తింపు లభించింది. తర్వాత వచ్చిన 'పెళ్లిచూపులు' హిట్ అందుకుంది. ప్రస్తుతం ఆయన 'డియర్ కామ్రేడ్' సినిమాతో బిజీగా ఉన్నారు.

నెట్‌లో హల్‌చల్


మహేశ్ బాబు, పూజా హెగ్డే

మహేశ్‌బాబు హీరోగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మహర్షి'. ఇందులోని ట్రైలర్, ఫస్ట్‌లుక్, దాంతో పాటు మరో స్టిల్‌ను మాత్రమే ఇప్పటివరకూ విడుదల చేశారు. ఇప్పుడు పూజాహెగ్డే మహేశ్‌ను ఆలింగనం చేసుకున్న ఫొటో ఒకటి నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. ఈ ఫొటోను చిత్రబృందం అధికారికంగా విడుదల చేయలేదు. ఇందులో 'అల్లరి' నరేశ్ ఓ కీలక పాత్ర చేస్తున్నారు. అశ్వనిదత్, దిల్ రాజు, పీవీపీ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. మహేశ్ బాబు క్యారెక్టర్‌లో చాలా షేడ్స్ ఉంటాయి. స్టూడెంట్‌గా, బిలీయనీర్‌గా, ఆధునిక రైతుగా మహేశ్ కనిపిస్తారని తెలిసింది. ఈ సినిమాలో రిషిగా మహేశ్‌బాబు, రవిగా 'అల్లరి' నరేశ్, మహా పాత్రలో పూజా హెగ్డే నటిస్తున్నారని సమాచారం. ఉగాదికి ఈ చిత్రం ట్రైలర్‌ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. వచ్చేనెలలో ఆడియోను, వేసవిలో సినిమా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

'ముద్ర' కాదు 'అర్జున్ సురవరం'


నిఖిల్

నిఖిల్, లావణ్య త్రిపాఠి జంటగా నటిస్తోన్న చిత్రం 'ముద్ర'. ఇప్పుడు ఆ టైటిల్‌ను 'అర్జున్ సురవరం'గా మార్చారు. తాజాగా ఈ చిత్ర టైటిల్ లోగో విడుదలైంది. కోలీవుడ్ 'కనితన్' చిత్రానికి రీమేక్ ఇది. ఈ టైటిల్ లాంచ్ కార్యక్రమంలో హీరో నిఖిల్, హీరోయిన్ లావణ్య త్రిపాఠి, దర్శకుడు సంతోష్, నిర్మాతలు పాల్గొన్నారు. యూరప్‌లో చివరి పాట చిత్రీకరణతో షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మార్చి 29న ఈ చిత్రం విడుదల కానున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ఇందులో జర్నలిస్ట్‌గా నిఖిల్ నటిస్తున్నారు. టిఎన్ సంతోష్ తెరకెక్కిస్తున్నారు. శ్యామ్ సిఎస్ సంగీతం అందిస్తున్నారు. వెన్నెల కిషోర్, పోసాని కృష్ణమురళి, నాగినీడు, ప్రగతి, సత్య, తరుణ్ అరోరా, రాజా రవీంద్ర తదితరులు నటిస్తున్నారు. ఔరా సినిమాస్ పివిటి, మూవీ డైనమిక్స్ ఎల్‌ఎల్పి బ్యానర్లపై కావ్య వేణుగోపాల్, రాజు కుమార్ నిర్మిస్తున్నారు. బి మధు చిత్రానికి సమర్పకులు. కథ, స్క్రీన్ ప్లే, దర్శకుడు: టిఎన్ సంతోష్, నిర్మాతలు: కావ్య వేణుగోపాల్, రాజ్ కుమార్.



'ప్రశ్నించే' విద్యార్థి నాయకుడు

విదార్థి నాయకుడిగా ఎదిగిన ఓ కుర్రాడు వ్యవస్థలో లోపాలపై నిలదీసే పాయింట్‌తో 'ప్రశ్నిస్తా' చిత్రం రూపొందుతోంది. దర్శకుడు పి.సత్యారెడ్డి తనయుడు మనీష్‌ని హీరోగా పరిచయం చేస్తూ నిర్మిస్తున్నారు. 'క్షేమంగా వెళ్ళి లాభంగా రండి' ఫేమ్ రాజా వన్నెం రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. జనం ఎంటర్ టైన్మెంట్స్ పతాకంపై నిర్మిస్తోన్న ఈ చిత్రం లోగో ఆవిష్కరణ సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. అందరూ 'ప్రశ్నించే' విధంగా ఈ సినిమా విజయం సాధించాలని బెల్లంకొండ సరేశ్ అన్నారు. సి.కళ్యాణ్ మాట్లాడుతూ 'సత్యారెడ్డి పుట్టినరోజు ఫంక్షన్‌లో మనీష్‌ని చూశాను. ఆరడుగులున్నాడు. హీరోకి కావాల్సిన లక్షణాలన్నీ మనీష్‌కు ఉన్నాయి' అని సి.కల్యాణ్ చెప్పారు.

నిర్మాత పి.సత్యారెడ్డి మాట్లాడుతూ 'సమాజంలో జరుగుతున్న అన్యాయం, అక్రమాలు, ప్రభుత్వ విధానాల్లో లోపాలపై ఓ విద్యార్థి నాయకుడు ఏ విధంగా పోరాడాడు...ఎలా ప్రశ్నించాడు అనేది కథ' అని చెప్పారు.

ఈ కార్యక్రమంలో బెల్లంకొండ సురేష్, సి.కళ్యాణ్, టి.ప్రసన్నకుమార్, దాసరి కిరణ్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, అభిషేక్ అగర్వాల్, హీరో మనీష్ బాబు, హీరోయిన్స్ అక్షిత, హసీనా మస్తాన్ మీర్జా, దర్శకుడు రాజా వన్నెం రెడ్డి, మాటల రచయిత రాజేంద్ర కుమార్, సంగీత దర్శకుడు వెంగి, సతీష్ రెడ్డి, శేషు బాబు, శివ కుమార్ పాల్గొన్నారు.

సీమరాజా


సాయికృష్ణ

సాయి కృష్ణ ఫిలింస్ బ్యానర్‌పై లక్ష్మీ పెండ్యాల సమర్పణలో సాయికృష్ణ పెండ్యాల నిర్మిస్తున్న చిత్రం 'సీమరాజా'. శివకార్తికేయ, కీర్తి సురేష్, సమంత ప్రధాన తారాగణం. ఈ చిత్రం డబ్బింగ్ పనులు పూర్తి చేసుకుని క్లీన్ యు సర్టిఫికెట్‌తో ఈనెల 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో నిర్మాత సాయికృష్ణ పెండ్యాల చిత్రం గురించి వివరించారు. 'డిస్ట్రిబ్యూటర్ నుంచి ప్రొడ్యూసర్ అయ్యాను. నిర్మాతగా 4వ చిత్రం. 'మనిషి బతకడానికి మిత్రుడు ఎంత ముఖ్యమో శత్రువు కూడా అంతే ముఖ్యం' అన్న డైలాగ్ చాలా నచ్చింది. ఆ డైలాగ్ నాలో తెలియని ఒక ఫీలింగ్‌ను తెచ్చింది. ఎక్కడా డబ్బింగ్ సినిమా అన్న ఫీలింగ్ కలగదు. కేవలం డబ్బింగ్‌కే రూ.60 లక్షలు ఖర్చుపెట్టాను. వీడియో గీతాన్ని విడుదల చేస్తే దాదాపు 10లక్షల వ్యూస్ వచ్చాయి. కీర్తిసురేష్ యువరాణి గెటప్‌లో 30 నిమిషాలు కన్పిస్తారు. సమంత మెయిన్ హీరోయిన్. ఆమె టీచర్‌గా నటించింది. నెపోలియన్ హీరో శివకార్తికేయన్ తండ్రిగా నటించారు. ఈ చిత్రంలో విలన్ సిమ్రన్ చాలా బాగా చేశారు. సిమ్రన్ చెప్పే డైలాగ్ హైలైట్‌గా ఉంటుంది. దాదాపు 300 థియేటర్లలో విడుదల చేస్తున్నాం' అని తెలిపారు.

'కల్కి'కి సీక్వెల్


జీవిత, రాజశేఖర్

"గరుడవేగ'కు ముందు అథఃపాతాళానికి వెళ్లిపోయాం. డబ్బును సంపాదించుకోవచ్చు కానీ, కెరీర్‌ను నిలబెట్టుకోవడం చాలా కష్టం. 'గరుడవేగ'కు చాలా మంచి పేరొచ్చింది. 'బాహుబలి'తో పాటు చాలా మంది మా సినిమా గురించి కూడా మాట్లాడుకున్నారు. ప్రస్తుతం సినిమాలు తీయడం కష్టమైన తరుణంలో ఇంత భారీ బడ్జెట్ సినిమా ఎలా చేయాలని ఆలోచించాం. ఆ సమయంలో కల్యాణ్ సపోర్ట్ అందించారు. ప్రశాంత్ వర్మ కథ, డైలాగ్స్ మాత్రమే ఇచ్చాడు. అతను డైరెక్ట్ చేయడేమో అనుకున్నాం. కానీ చివరకు అంగీకరించడం ఆనందంగా ఉంది. మేలో విడుదల చేద్దామనుకుంటున్నాం" అని జీవిత అన్నారు. శివానీ శివాత్మిక సమర్పణలో హ్యాపీ మూవీస్ బ్యానర్‌లో డా.రాజశేఖర్ హీరోగా నటించిన సినిమా 'కల్కి'. ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించారు. సి.కల్యాణ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్ విడుదలైంది. సోమవారం రాజశేఖర్ పుట్టినరోజు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి జీవిత రాజశేఖర్‌కు తినిపించారు.

ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ 'కల్కి' అనేది పెద్ద టైటిల్. బాధ్యతగా, గౌరవంగా భావించి చేస్తున్న సినిమా. రాజశేఖర్‌తో మళ్లీ సినిమా చేయాలనుంది. దీనికి ఫ్రాంచైజీ కూడా చేయాలనుకుంటున్నాం. తదుపరి రాజశేఖర్ పుట్టినరోజుకి 'కల్కి2' కూడా చేస్తాం. ఇందులో రాజశేఖర్‌గారు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా కూడా కనపడతారు. ఆయన ఓన్ బాడీలాంగ్వేజ్ ఇందులో చూపిస్తాం' అని అన్నారు.

తెలుగు వారినే తీసుకుంటే మంచిది

– శివాజీ రాజా



శ్రీనివాసరెడ్డి ముఖ్యపాత్రలో నటిస్తోన్న చిత్రం 'చెడ్డీ గ్యాంగ్'. కనగాల రమేష్ చౌదరి దర్శకత్వంలో రాజ్ ప్రొడక్షన్స్ ఇంటర్నేషనల్ పతాకంపై విక్కీరాజ్ నిర్మిస్తున్నారు. అమర్, ప్రదీప్‌వర్మ, ఉదయ్, అభి, సి.టి., ఖాదర్, లక్ష్మి, శృతి, కావ్య, దేవి, వీణ, జాస్మిన్ ఇతర పాత్రలు పోషించారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా టీజర్ హైదరాబాద్‌లో విడుదల చేశారు.

శివాజీరాజా మాట్లాడుతూ 'టైటిల్ చాలా బాగుంది. తెలుగు సినిమాలో తమిళ నటీనటులు ఉండొచ్చా? లేదా? అనేది అప్రస్తుతం. కానీ ఉంటే అనువాద చిత్రం అనే భావన వచ్చేది కాదు. మన తెలుగు వారిని మనం తీసుకుంటే ఇంకా బాగుంటుంది. హీరోయిన్లు ఎలాగూ తప్పదు. చిన్న చిన్న నటీనటులను కూడానా. మన వాళ్లకు ప్రాముఖ్యతనివ్వండి. వాళ్లు కుదరకపోతేనే ఇతర భాషల వారితో చేయించండి. అలాగే నటీనటులు కూడా ప్రచారానికి వస్తే దర్శకనిర్మాతలకు, సినిమాకు హెల్ప్ అవుతుంది' అని తెలిపారు. దర్శకుడు రమేష్ చౌదరి మాట్లాడుతూ 'పదిమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కేరళ అడవులకు టూర్‌కు వెళ్లి అక్కడి కోయవారి నిబంధనలను అతిక్రమించి ఇరుక్కుపోతారు. అక్కడి నుంచి వాళ్లు ఎలా బయటపడ్డారనేదే ఈ చిత్రం కథ. సింగిల్ లైన్‌లో విక్కీరాజ్‌కి స్టోరీ చెప్పాను. కేరళ రండి.. సినిమా తీద్దాం అన్నారు. అలా ఈ సినిమా మొదలైంది' అని తెలిపారు.

ర్యాప్‌వాక్‌పై 'గల్లీబాయ్'


రణవీర్‌సింగ్

సినిమాకు ఫస్ట్‌షాట్ కొట్టిన దగ్గర నుంచి విడుదలయ్యే వరకూ ప్రమోషన్ కోసం అనేక మార్గాలు వెతుకుతారు. ఇప్పుడు సామాజిక మాధ్యమాల ప్రభావం ఎక్కువ కావడంతో సినిమాల ప్రమోషన్‌కు ఈ మీడియా మరింతగా ఉపయోగపడుతుంది. ఇలా ఏ వేదికైనా తమ చిత్రాలను జనాలకు చేరువయ్యేలా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. తాజాగా రణవీర్ సింగ్ ర్యాపర్‌గా నటించిన చిత్రం 'గల్లీబాయ్'. లక్మే ఫ్యాషన్ వీక్‌లో ఈ చిత్రంలో పాటలను పాడుతూ సందడి చేశాడు ఈ హీరో. అదేదో ప్రత్యేకంగా కాదు...ఒక పక్క రన్‌వేపై మోడళ్లు ర్యాప్‌వాక్ చేస్తున్నప్పుడే ర్యాపర్‌గా తన పని తాను కానిచ్చేశాడు. ఈయనకు తోడుగా ర్యాపర్ నయీజీ, సహనటుడు సిద్ధార్థ్ చతుర్వేది 'అప్నా టైమ్ ఈయేగా...., అస్లీ హిహ్ హాప్...వంటి పాటలను అలపించారు. ఈ సాంగ్స్ 'గల్లీబాయ్' చిత్రంలోనివి. ఈ సందర్భంగా రణవీర్ సింగ్ మాట్లాడుతూ 'ఇదొక ప్రత్యేకమై షో. మాది మ్యూజిక్ మా సినిమా. ఈ మ్యూజిక్ షో గుండెకాయ వంటిది. లైవ్‌లో రాణించిన గొప్ప ఫెర్ఫార్మర్లు ఈ చిత్రానికి పని చేశారు. 'గుల్లీబాయ్' చిత్రానికి జోయ అక్తర్ దర్శకత్వం వహించారు. రితేశ్ సిధ్వాని నిర్మాత. ముంబాయిలో ఉండే ఓ ర్యాపర్ జీవితం ఆధారంగా తెరకెక్కుతోంది. అలియా భట్ కథానాయిక. ఈనెల 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.




ఇండస్ట్రీ అలా మారిపోయింది

చిన్నవాళ్ల ఇష్టాఇష్టాలనూ చెప్పుకోనివ్వడం లేదు : కంగనా

సినిమా ఇండస్ట్రీ చాలా నీచంగా మారిపోయిందని చిన్న చిన్న ఆర్టిస్టుల ఇష్టాలు, అయిష్టాలను కూడా బహిరంగంగా చెప్పుకోవడానికి అవకాశం లేకుండా పరిస్థితులు మారిపోయాయని పేర్కొంది కంగనా రనౌత్. ఆమె నటించిన 'మణికర్ణిక' సినిమా విషయంలో వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. న్యూఢిల్లీలో జరిగిన 'సిగ్నేచర్ మాస్టర్ క్లాస్' అనే కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 'ఏ రంగంలోనైనా నేను మాస్టర్‌నో కాదో తెలియదు గానీ అన్ని పనులూ చేయగలను. మణికర్ణిక సినిమాను మళ్లీ పునర్నిర్మించాలని నిర్ణయం తీసుకున్నప్పుడు అంతా నేను చేసే పని వ్యర్థం అనేవారు. ఈ సినిమా ఒకవేళ ఫ్లాప్ అయితే అందరూ నన్ను అవమానించేవారు. ఈ సినిమాను పునర్నిర్మించడం అనేది ఓ పెద్ద రిస్క్. ఎప్పుడైనా సినిమా మొదట నుంచీ దర్శకత్వం చేయడం అనేది పెద్ద సమస్య కాదు. కానీ ఓ సినిమాను పునర్నిర్మించడం అంటే చాలా కష్టం. 50శాతం మంది నేను చేయలేను అనుకున్నారు. ఇప్పుడు చేసి చూపించాను. అదీ ప్రత్యేకమైంది. ఇలా దర్శకత్వంలోకి కొత్తగా వచ్చివారికి ఇదొక ప్రత్యేకమే. ఇప్పుడే కాదు ఈ సినిమా షూటింగ్‌లో గాయపడితే నా నుదిటిపై ఎనిమిది కుట్లు పడ్డాయి. అప్పుడు కూడా కొందరు నాపై దాడి చేశారు.

డిసెంబరులో క్రిష్‌కు ఈ సినిమా చూపించాలి అనుకున్నాం. కానీ సినిమా పూర్తిగా నాశనం అయిపోయింది, దాన్ని బాగు చేయలేం అనే భావనలో క్రిష్ ఉన్నారు. కానీ నేను సినిమాను పూర్తి చేశా. ఆయనకు చిత్రం నచ్చింది. అప్పటి నుంచి 'ఇది నా సినిమా', 'ఇది నా సినిమా' అని చెప్పుకుంటున్నారు. అతనికి క్రెడిట్ ఇచ్చినా మీడియా ముందుకు ఎందుకొచ్చారు? నేరుగా నన్ను కలిసి మాట్లాడి ఉండొచ్చుగా?. ఆయన ఒక్కసారి కూడా నన్ను కలవలేదు. మా ఆహ్వానాలకు ఏ రోజూ స్పందించలేదు. క్యారెక్టర్ ఆర్టిస్టులంతా 'వాళ్లు మాకు ప్రామిస్ చేశారు.. కానీ అది జరగలేదు' అని ఆరోపణలు చేస్తున్నారు. నాకు రహస్యంగా మెసేజ్‌లు చేశారు. ఏవేవో కారణాలు చెబుతున్నారు. అందుకే వారి ఫోన్ నెంబర్లు బ్లాక్ చేశా. అటు, ఇటు రెండు వైపులా నాటకాలు ఆడుతున్నారా?. నాలాగా, అంకిత, ప్రసూన్, శంకర్‌లాగా అంకితభావంతో పనిచేసి ఉంటే సినిమాకు ఎంతో ముఖ్యమైన వారంలో పబ్లిక్‌లోకి వెళ్లి యూనిట్‌ను ఎటాక్ చేయరు. వీరంతా కలిసి సినిమాకు నష్టం కలిగించారు. సోనూసూద్‌కు ఈ సినిమా గురించి మాట్లాడే హక్కు లేదు. సినిమాతో ఆయనకున్న కాంట్రాక్ట్ అయిపోయింది. ఈ సినిమాతో ఆయనకు ఎటువంటి సంబంధమూ లేదు" అని చెప్పింది కంగనా.



దంత సమస్యలకు పరిష్కారాలెన్నో!

అన్ని శరీరభాగాల్లో దంతాలకు వచ్చే సమస్యలు అంతవేగంగా పోవు. దంతాలు ఆరోగ్యంగా లేకుంటే అవి మరికొన్ని శారీరక అనారోగ్యాలకు కారణమవుతుంటాయి. దంత సమస్యలు నిత్య జీవితంలో తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తాయి. ప్రాణం పోతుందా! అన్నంత బాధని కలిగిస్తాయి. ఈ సమస్యలు చాలా రకాలున్నాయి. అవి కొన్ని స్వల్పకాలికమైనవైతే, మరికొన్ని దీర్ఘకాలికమైనవి. వీటిలో కొన్ని తగిన పరిశుభ్రత పాటించక పోవడం వల్ల వస్తే.. మరికొన్ని దంత సంరక్షణలో నిర్లక్ష్యం వల్ల వస్తాయి. ఇంకొన్ని సమస్యలు ప్రమాదవశాత్తూ వస్తుంటాయి. ఈ దంత సమస్యల తీరుతెన్నులు.. వాటి నివారణ.. చికిత్స.. గురించి ఈ వారం "డాక్టర్ స్పెషలిస్ట్"లో..

శరీర ఆరోగ్యానికి ముఖద్వారం నోరే. ఆహారాన్ని తినేటప్పుడు, రకరకాల పానీయాల్ని తాగేటప్పుడు సరైన శ్రద్ధ తీసుకోకపోవడం వల్ల వాటి ప్రభావం దంతాలపై పడుతుంటుంది. దీంతో దంతాల సమస్యల వల్ల పళ్లల్లో తీవ్రమైన నొప్పి ఉంటుంది. నేటి సమాజంలో పంటినొప్పికి గురికాని వారంటూ సర్వసాధారణంగా ఉండరు. పంటినొప్పితో పాటు దవడలు వాయడం, మాట్లాడడానికి, ఏమీ తినడానికి వీలుకాకపోవడం. విపరీతమైన నొప్పి, జ్వరం ఇతర సమస్యలూ చాలామందిలో ఎక్కువగా కన్పిస్తాయి. పంటి సమస్యలు రెండు రకాలు. ఇందులో భౌతిక పరమైనవి, మానసికమైనవీ ఉన్నాయి.

కారణాలు

దంతాల సమస్యలు రావడానికి చాలారకాల కారణాలున్నాయి. దవడల్లో, దంతాలకు అనుసంధానించబడి ఉన్న నరాల్లో బలహీనత వల్ల, పళ్ల మధ్య ఉండే గుజ్జులాంటి పదార్థం దెబ్బ తింటుంది. దీనివల్ల పంటినొప్పి మరింత ఎక్కువవుతుంది. పళ్ల సందుల్లో, బ్యాక్టీరియా చేరి, ఇన్‌ఫెక్షన్ కలిగిస్తుంది. దీనివల్ల చిగుళ్లలో చీము నిండటం, నొప్పి కలిగించడం వంటి సమస్యలు బాధిస్తాయి. ఎప్పుడైతే దంతాల్లో చుట్టుపక్కల చీము చేరి, ఇన్‌ఫెక్షన్ కలిగిస్తుందో, అప్పుడు తప్పనిసరిగా రూట్ కెనాల్ చికిత్స చేయించాలి. దంతాల్లో బ్యాక్టీరియా చేరి, ఇన్‌ఫెక్షన్ కలిగించడం వల్ల ఆ ప్రభావం మొహం, మెడ, తల, ఎముకలపైనా ఉంటుంది. ఈ బ్యాక్టీరియా, చీము, నోటి కుహరంలోకి ప్రవేశిస్తుంది. దీనివల్ల గమ్ డిసీజ్ వంటి ఇతర సమస్యలు రావడానికి ఆస్కారం ఏర్పడుతుంది.

లక్షణాలు

దంతాల్లో వచ్చే సమస్యల వల్ల ఎన్నో లక్షణాలు బయటపడతాయి.

- దంతాలపై గార ఏర్పడడం.
- పంటిలో రంధ్రాలు ఏర్పడడం.
- దంతం మధ్య భాగంలో బ్యాక్టీరియా చేరడం.

ఇలాంటి పంటి సమస్యల వల్ల నోటి దుర్వాసన, గమ్ డిసీజ్, దవడ నొప్పి వంటి ఇతర లక్షణాలు ఉంటాయి. కొన్నిసార్లు ఆహారం నమలడంలో ఇబ్బంది. తిన్నప్పుడు, చల్లటి నీళ్లు తాగినప్పుడు పళ్లు జివ్వుమనడం వంటి సమస్యలు వస్తాయి. వీటిలో కొన్ని దీర్ఘకాలిక దంత సమస్యలుగా ఉంటాయి.

నిర్ధారణ

దంత సమస్యలను నిర్ధారించడానికి తగిన పరీక్షలు చేయాలి. అందులో ఎక్స్‌రే ద్వారా పరీక్ష ఒకటి. వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల దంత సమస్యలు వస్తుంటే.. పరీక్షల ద్వారా వాటికి కారణాలు తెలుసుకోవాలి. దంతాల్లో, దవడల్లో ఏర్పడే వివిధ సమస్యలను లోతుగా పరిశీలించడానికి కొత్త టెక్నాలజీ, ఆధునిక చికిత్సా విధానం ప్రస్తుతం అందుబాటులో ఉంది. వీటిలో డిజిటల్ ఎక్స్‌రే (ఆర్.వి.జి), డిజిటల్ ఒపిజి (ఫుల్ మౌత్ ఎక్స్‌రే) వంటివి దంత



చికిత్సల్లో ఉపయోగిస్తారు.

రూట్‌కెనాల్ చికిత్స

దంత సమస్యల నివారణకు ఎక్కువగా చేసేది రూట్‌కెనాల్ చికిత్స. దంతాలలో సమస్యలు, నొప్పి తీవ్రతను అనుసరించి రోగికి ఈ చికిత్సను అందించాలి. దంత సమస్యలు తీవ్రమైనప్పుడు వాటి నివారణకు చివరగా రూట్‌కెనాల్ చికిత్స చేస్తారు. ఈ చికిత్సలో పళ్లల్లో ఎలాంటి సమస్య ఏర్పడింది? అది నరాల్లో, దవడల్లో, దంతాల చుట్టుపక్కల ఏ విధమైన ప్రభావాన్ని కలిగిస్తోంది వంటి అంశాలను పరిశీలిస్తారు. పళ్లపై ఏర్పడిన గారను, పంటి మధ్య గుజ్జులో బ్యాక్టీరియాను కూడా రూట్ కెనాల్ చికిత్సతో నివారించవచ్చు. వీటితోపాటు దంత సంరక్షణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు వైద్యుల సూచనలు పాటించాలి.



అత్యాధునిక లేజర్ చికిత్స

దంత, నోటి సమస్యలకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యాధునిక చికిత్స లేజర్ చికిత్స. ఇది తక్కువ ఖర్చుతోనే జరుగుతుంది. 'లేజర్ డెంటిస్ట్రీ' అనే ప్రత్యేక పరికరం ద్వారా ఈ చికిత్స చేస్తారు. లేజర్ డెంటిస్ట్రీ సన్నని, శక్తిమంతమైన కాంతి పుంజాన్ని విడుదల చేస్తుంది. ఈ కాంతి పుంజమే (లేజర్) చికిత్సలో కీలకమైనది. సమస్య ఉన్నచోట చుట్టుపక్కల కణజాలాలకు ఎలాంటి నష్టం జరగకుండా నిర్దిష్ట ప్రదేశంలో లేజర్ ద్వారా చికిత్స చేస్తారు. అంతేకాకుండా దంతాలను మెరిసేలా చేయడంలోనూ, చిగుళ్ల సమస్యలను నివారించడంలోనూ, సున్నిత దంతాలకు ఉపశమనం కల్గించడంలోనూ లేజర్ డెంటిస్ట్రీ మంచి ఫలితాలను ఇస్తుంది.

దీంతో ఇంకో ప్రయోజనం ఏమంటే ఎలాంటి మత్తుమందూ ఇవ్వకుండానే, చిగుళ్లకు ఎటువంటి కుట్లూ లేకుండానే చికిత్స అందించవచ్చు. ఇది రక్తస్రావాన్ని (బ్లీడింగ్) తగ్గిస్తుంది. బ్యాక్టీరియా సంబంధిత ఇన్ఫెక్షన్లను బాగా తగ్గిస్తుంది. గాయాలను త్వరగా మాన్పుతుంది. చల్లని పదార్థాలు, వేడి పదార్థాలు తీసుకున్నప్పుడు దంతాలను జివ్వుమనిపించే టూత్ సెన్సిటివిటీకి లేజర్ డెంటిస్ట్రీ ద్వారా చికిత్స నిర్వహిస్తారు.

దంతాలకు సంబంధించి ఎలాంటి సమస్య ఉత్పన్నమైనా బద్ధకించకుండా దంతవైద్య నిపుణుల్ని సంప్రదిస్తే వెంటనే పరిష్కారం లభిస్తుంది. ఆలస్యం చేసేకొద్దీ ఇతర ఆరోగ్య సమస్యలకు ఇది కారణమవుతుంది.



డాక్టర్ చెరుకూరి మురళీకృష్ణ,
ఎండిఎస్,
శ్రీ కృష్ణా డెంటల్ కేర్,
పేపర్ మిల్లు సెంటర్,
విజయవాడ.



పిల్లల్లో పళ్లు పదిలం..!



చిన్నారుల్లో పళ్లు వచ్చే సమయంలోనూ ఆ తర్వాత వాటి సంరక్షణలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే భవిష్యత్‌లో వారికి దంత సమస్యలు తప్పనిసరి.



చిన్నపిల్లల్లో ఆరు నెలల నుంచి రెండున్నర యేళ్ల వయసు వరకూ వచ్చే మొదటి దంతాలను ప్రాథమిక దంతాలు లేదా పాలపళ్లు అంటారు. ఆరు సంవత్సరాల నుంచి 12 సంవత్సరాల మధ్యలో శాశ్వత దంతాలు వస్తాయి. పాలపళ్లు (ప్రాథమిక దంతాలు)కు శాశ్వత దంతాలకు మధ్య సమయాన్ని మిక్సడ్ డెంటిషన్ పీరియడ్ అంటారు. ఈ సమయంలో పిల్లలు రెండురకాల దంతాలను కలిగి ఉంటారు. అంటే పాలపళ్లు రాలుతూ, శాశ్వత దంతాలు ఏర్పడుతుంటాయి. పిల్లలకు ప్రాథమిక దంతాలు రాగానే సమస్య ఉన్నా, లేకున్నా ఒకసారి దంత వైద్యుడిని కలవాలి. పిల్లల్లో దంత సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలుసుకోవాలి. ఆ సమయంలో వచ్చే దంత సమస్యలనూ ముందే తెలుసుకుని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

పిల్లల్లో కన్పించే దంత సమస్యలు

పిల్లలకు ఎక్కువగా దంత క్షయం, చిగుళ్ల సమస్యలు, పంటికి చీము పట్టడం, నోటి కురుపులు, హెర్పిస్ వైరస్ వ్యాధి, డెంటల్ ఫ్లోరోసిస్, దంతాలను ప్రమాదవశాత్తు కోల్పోవడం, ఎదుగుదలలో వంకర, ఎగుడు, దిగుడు పళ్లు ప్రమాదంలో దవడ ఎముక విరగడం, దవడ కీలుకు దెబ్బ తగలడం, నోటి అలవాట్లు, నోటి ద్వారా శ్వాస తీసుకోవడం వంటివి కన్పిస్తుంటాయి. ఈ సమస్యల్లో ఏ ఒక్కటి ఉన్నట్లు గమనించినా వెంటనే దంత వైద్యులను సంప్రదించాలి. ఆరు నెలలకు ఒకసారి కచ్చితంగా పిల్లలను దంత వైద్యుని దగ్గరకు తీసుకెళ్లి, ప్రాథమిక దంత పరీక్షలు చేయించాలి.

నిర్లక్ష్యమే అసలు సమస్య

ఎక్కువ మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇప్పుడు వచ్చినవి పాలపళ్లేగా అవి పాడైనా ఫర్వాలేదు. ఎలాగూ అవిపోయి శాశ్వత దంతాలు ఆరోగ్యకరంగా ఉన్నవే వస్తాయని అపోహపడుతూ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంటారు. ఇది సరైనది కాదు. చిన్నపిల్లలకు ఏ కారణంతోనైనా దంతాలు పాడవడం వల్ల సరిగా ఆహారాన్ని తీసుకోలేరు. దీంతో వారు పోషకాహార లోపానికి గురౌతారు. ఆ సమయంలో ప్రాథమిక దంతాలను జాగ్రత్తగా కాపాడుకోవాలి.


చిన్న పిల్లలకు పాలపళ్లు వచ్చే సమయంలో వేళ్లని, రకరకాల ఆటవస్తువులను నోట్లో ఉంచుకుని చప్పరించడం, కొరకడం వంటివి చేస్తారు. అపరిశుభ్రంగా ఉన్న చేతివేళ్లు, ఆట వస్తువుల వల్ల సూక్ష్మజీవులు నోటి ద్వారా కడుపులోకి చేరి, డయేరియా వంటి వ్యాధులను కలిగిస్తాయి. అందువల్ల పిల్లల్నీ, వారి ఆట వస్తువులనీ శుభ్రంగా ఉంచాలి. పిల్లల నోటిలో పాలసీసా ఉంచి, వారిని నిద్రపుచ్చకూడదు. ఇలా చేస్తే దంతక్షయం తప్పదు. అందువల్ల బాటిల్‌లో చివరగా కొంత నీరుపోసి తాగించాలి. పాలు తాగించిన తర్వాత పిల్లల దంతాలను శుభ్రమైన కాటన్ గుడ్డతో తుడవాలి.

పిల్లలు ప్రమాదానికి గురై దంతాలను కోల్పోయినట్లైతే వాటిని వెంటనే నోటిలో నాలిక కింద ఉంచిగానీ, శుభ్రమైన పాలల్లో ఉంచిగానీ వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి. దీనివల్ల ఊడిన పంటిని యథాస్థానంలో ఉంచి చికిత్స చేయవచ్చు. దంత సమస్యలను గమనించిన వెంటనే చికిత్స జరపాలి. సకాలంలో వైద్యం అందితేనే దంత సమస్యలని నివారించవచ్చు.



చిన్నారి

చుక్కలు కలపండి!



పిల్లలూ! పక్కనున్న చిత్రంలోని చుక్కలను కలిపి, బొమ్మ ఏమిటో కనిపెట్టండి!

పొడుపు కథ

నున్నగా చెక్కింది, నూనె
మెరుగెట్టింది, ఏడాది
కొకసారి గంట కొట్టి
కదిలిస్తారు,
కోలాహలంబుగా ఏమిటది?

జవాబు : రథము

జోక్:

తండ్రి : ఎక్కడికి వెళుతున్నావు రా?
కొడుకు : సినిమాకు వెళుతున్నా నాన్నా!
తండ్రి : మరి చేతిలో ఆ పుస్తకం ఏమిటి?
కొడుకు : రేపటి నుంచి ఎగ్జామ్స్ కదనాన్న టైం వేస్ట్ కాకుండా ఇంటర్వెల్‌లో చదువుకుందాం అని ..

శుభ్రత

పళ్ళను బ్రష్‌తో తోమాలి
పళ్ళను కాపాడుకోవాలి
చేతులు బాగా కడగాలి
దుమ్ము, ధూళి పోవాలి
గోళ్ళు శుభ్రం చేయాలి
గోళ్ళు కత్తిరించుకోవాలి
ముక్కును శుచిగా ఉంచాలి
మంచి గాలిని పీల్చాలి
కళ్ళకు రక్షణనివ్వాలి
ఆకుకూరలు తినాలి
ఒళ్ళును సబ్బుతో రుద్దాలి
పొడి గుడ్డతో తుడవాలి
ఉతికిన బట్టలు తొడగాలి
ముఖముకు పౌడర్ రాయాలి
శుభ్రతను పాటించాలి
ఆరోగ్యంగా ఉండాలి





రాధిక
5వ,తరగతి,
ప్రాథమిక పాఠశాల
మెయిన్ హెచ్.మురవణి,
కర్నూలు జిల్లా

దారి చూపండి!



పిల్లలూ! ఈ చిత్రంలోని ఉడుతకు పండ్ల దగ్గరకు వెళ్ళే దారిని చూపండి.!

నేను గీసిన బొమ్మ





పి. మాధవీప్రియ
7వ తరగతి,
జడ్.పి.హెచ్ స్కూల్,
కాణిపాకం,
చిత్తూరు.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ -Chinnaarips@gmail.com

క్రీడా పురస్కారాల జ్యూరీలో బింద్రా, గోపీచంద్





ముంబయి : భారత క్రీడా పురస్కారాల ఎంపిక కమిటీని ఎంపిక చేశారు. దేశానికి ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం అందించిన అభినవ్ బింద్రా, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ ఈ జ్యూరీలో కీలక సభ్యులు. ఫిబ్రవరి 16న ఈ పురస్కారాలను బహూకరించనున్నారు. హాకీ మాజీ సారథి సర్దార్ సింగ్, టెన్నిస్ ఆటగాడు మహేశ్ భూపతి, అథ్లెట్ పిటి ఉష, మాజీ షూటర్ అంజలి భగవత్ కమిటీలో సహ సభ్యులుగా ఉంటారు. 'అథ్లెట్‌కు ఇచ్చే పురస్కారం కేవలం అతడికి మాత్రమే గుర్తింపు కాదు. ఆ జట్టు, సహాయ బృందానికీ గుర్తింపు ఇచ్చినట్టు. పురస్కారమనేది వ్యక్తిగత కష్టానికి గుర్తింపు కాదు జట్టు కష్టానికి గుర్తింపు' అని బింద్రా ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ పురస్కారాలను ఆర్పీ-సంజీవ్ గోయెంకా గ్రూప్, విరాట్ కోహ్లీ ఫౌండేషన్ సంయుక్తంగా అందిస్తోంది. ప్రతి విభాగంలో నామినేట్ అయిన క్రీడాకారులను జ్యూరీ ఈ మధ్యనే ఎంపిక చేసింది.

విదర్భ బౌలర్ల సత్తా

నాగ్‌పూర్ : సౌరాష్ట్రతో జరుగుతున్న రంజీట్రోఫీ ఫైనల్లో విదర్భ బౌలర్లు సత్తా చాటారు. తొలి ఇన్నింగ్స్‌లో 312 పరుగులకు పరిమితమైనా ప్రత్యర్థి సౌరాష్ట్ర జట్టుపై 158 ఐదు వికెట్లు చేజిక్కించుకొని పట్టు సాధించారు. అంతకుముందు ఏడు వికెట్ల నష్టానికి 200 పరుగులతో సోమవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ జట్టును కర్నెవార్ 73, వాద్కర్ 45, కలే 35, వాకరే 34 పరుగులతో ఆదుకున్నారు. దీంతో విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 120.2 ఓవర్లలో 312 పరుగులకు ఆలౌటైంది. ఉనద్కడ్ మూడు, సకరియా, మాక్వానా చెరో రెండు వికెట్లు పడగొట్టారు.



ఆసీస్‌దే టెస్ట్ సిరీస్

కాన్‌బెర్రా : శ్రీలంకతో జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆతిథ్య ఆస్ట్రేలియా 2-0తో చేజిక్కించుకుంది. రెండో టెస్ట్‌లోనూ శ్రీలంకపై 366 పరుగులతో తేడాతో ఘన విజయం సాధించింది. 516 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన లంక జట్టు 149 పరుగులకే కుప్పకూలింది. మెండీస్(42), తిరుమన్నే (30) మినహా మిగతా బ్యాట్స్‌మన్లు రాణించకపోవడంతో 51 ఓవర్లలో 149 పరుగులకే ఆలౌటైంది. ఆసీస్ బౌలర్లు స్టార్క్ ఐదు, కమ్మిన్స్ మూడు వికెట్లు తీశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ స్టార్క్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కమ్మిన్స్‌కు లభించాయి.

ఆస్ట్రేలియా : 534/5డిక్లేర్డ్, 196/3 డిక్లేర్డ్
శ్రీలంక : 225, 149

అండర్18 నేషనల్ సిరీస్
టెన్నిస్ పోటీలు ప్రారంభం



ప్రజాశక్తి - కావలి

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, కావలి పట్టణంలో విశ్వోదయ టెక్నికల్ అకాడమీ కళాశాలలో సోమవారం "డి.ఆర్.మెమోరియల్ టెన్నిస్ అండర్-18 ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. తొలిమ్యాచ్‌లో తమిళనాడుకు చెందిన జోన్స్ కర్ణాటకకు చెందిన ప్రభాత్ యాదులతో తలపడి 6-0, 6-0 స్కోరుతో విజయం సాధించాడు. మరో మ్యాచ్‌లో తమిళనాడుకు చెందిన శ్రావణ్‌ఆనంద్ తెలంగాణకు చెందిన రిత్విక్‌పై తలపడి 6-3, 6-3 స్కోరుతో గెలుపొందారు. మహారాష్ట్రకు చెందిన మైత్రిపటేల్ తెలంగాణకు చెందిన కీర్తిరెడ్డితో ఆడి, 6-4, 6-1స్కోరుతో గెలిచారు. తమిళనాడుకు చెందిన జానకిశ్రీవత్సన్ అదేరాష్ట్రానికి చెందిన హరిణి అభినయతో తలపడి7-5, 6-1స్కోరుతో గెలిచారు. హర్యానాకు చెందిన ఆదిత్యనందల్ తమిళనాడుకు చెందిన ప్రణేష్‌పై ఆడి, 6-3,6-3స్కోరుతో ఓడించారు. తెలంగాణకు చెందిన అఖిల్‌కుమార్‌రెడ్డి తమిళనాడుకు చెందిన మునేశ్వర్‌మూర్తిపై 6-10, 6-1స్కోరుతో గెలుపొందారు. కర్ణాటకకు చెందిన రూపేష్‌కుమార్ మహారాష్ట్రకు చెందిన దక్ష అగర్వాల్‌పై 6-4, 1-6, 6-1 స్కోరుతో ఓడించారు. తెలంగాణకు చెందిన కుంకుమ్‌నీల తమిళనాడుకు చెందిన సంజన సంపత్‌తో తలపడి,6-4, 6-2స్కోరుతో గెలుపు సాధించారు. తమిళనాడుకు చెందిన అనన్య ఎ.పికి చెందిన హర్షిణీ విశ్వనాథ్‌తో ఆడి6-1,6-1స్కోరుతో గెలిచారు. రాజస్థాన్‌కు చెందిన మోహిత్‌ఇండోరియా తెలంగాణకు చెందిన వర్షిత్‌కుమార్‌రెడ్డిపై 6-4, 4-6, 4-6తో గెలిచారు. మహారాష్ట్రకు చెందిన సాహిల్ అదేరాష్ట్రానికి చెందిన ఇంద్రజిత్‌పై 6-3, 6-2తో గెలిచారు. తమిళనాడుకు చెందిన జెన్నిఫర్‌రాణి తెలంగాణకు చెందిన ఖుషీఅగర్వాల్‌పై 6-1,6-2 స్కోరుతో విజయం సాధించారు. తమిళనాడుకు చెందిన అంజని తెలంగాణకు చెందిన జాహ్నవిపై 6-3,6-3స్కోరుతో గెలిచారు. తెలంగాణకు చెందిన గ్రహిత్ మొవ్వ,గౌరవ్ గులియాపై 7-5, 5-7, 7-6స్కోరుతో గెలిచారు. ఈ పోటీలను డిఎస్‌పి పి.ప్రసాద్ ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, టోర్నమెంట్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ దొడ్ల లిఖిత్‌రెడ్డి, కార్యదర్శి విజయ్‌శంకర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అనుమోలు శెట్టి రామకృష్ణ, ఛీఫ్ ఎంపైర్ శివరామిరెడ్డి, పిఇడిలు డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, జోసఫ్‌శ్రీను, ప్రసాద్, షరీఫ్, సునీల్, మణికంఠ పాల్గొన్నారు.

ఓ వైపు జహీర్‌ఖాన్ రిటైర్మెంట్.. మరోపక్క ప్రధాన పేసర్ ఇషాంత్‌శర్మలో పదును తగ్గుతున్న సమయంలో ఓ సంచలన పేసర్ భారతజట్టులోకి అరంగేట్రం చేశాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పేసర్ అదిరిపోయే గణాంకాలతో 2015 ప్రపంచకప్‌కు ప్రధాన బౌలర్‌గా ఎదిగాడు. 2010-11లో బెంగాల్ తరఫున ఆడుతూ అస్సాంపై మూడు వికెట్లు తీసినప్పటి నుంచి గత నెలలో ఆస్ట్రేలియాపై చారిత్రక వన్డే సిరీస్‌లో 16 వికెట్లు, నేడు న్యూజిలాండ్‌పై నాలుగు వన్డేల్లో 9 వికెట్లు తీసి రెండుసార్లు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' దక్కించుకున్న మూడో భారత పేసర్‌గా నిలిచాడు. గత 20 ఏళ్లలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన పేస్‌బౌలర్లలో అత్యుత్తమ గణాంకాలను నమోదు చేశాడు. కేవలం 40 టెస్టుల్లో 144 వికెట్లు తీసి 29.54 సగటుతోపాటు 56 వన్డేల్లోనే 100 వికెట్లు అందుకున్నాడు. అతడే మన 'సెన్సేషనల్ షమి'.

సెన్సేషనల్ షమి



ప్రజాశక్తి - స్పోర్ట్స్ బ్యూరో


మొదటగా బెంగాల్ తరఫున అస్సాంతో జరిగిన మ్యాచ్‌లో అరంగేట్రం చేసి మూడు వికెట్లు తీసిన షమి 2011లో ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో కోల్‌కత్తా నైట్ రైడర్స్ తరఫున ఆడి అద్భుత ప్రదర్శనతో తన పేస్‌ను క్రీడా ప్రపంచానికి పరిచయం చేశాడు. అనంతరం 2012లో వెస్టిండీస్-ఎ పై నాలుగు వికెట్లుతో పాటు 2013లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టి ఆస్ట్రేలియా పర్యటనలో మొదటి మూడు మ్యాచ్‌లు రిజర్వు బెంచ్‌కి పరిమితమైన షమి నాల్గో వన్డేలో స్థానం సంపాదించి మూడు కీలక వికెట్లు తీశాడు. అంతే అప్పటి నుంచి వెనుదిరిగి చూడకుండా 2014 న్యూజిలాండ్ పర్యటనలో 50 వికెట్ల మైలురాయిని వేగంగా అందుకున్న రెండో భారత పేసర్‌గా నిలిచాడు. రెండేళ్లలో 40 మ్యాచ్‌లు ఆడేశాడు. ఆ తర్వాత ఫిట్‌నెస్‌లేక కేవలం 12 మ్యాచ్‌లు మాత్రమే ఆడగలిగాడు.

సమస్యల సుడిగుండంలో..

2015 ప్రపంచ కప్ సెమీస్ నుంచి మోకాళ్ల గాయం కారణంగా తప్పుకున్న షమి ఆ తర్వాత రెండున్నరేళ్లలో కేవలం మూడు వన్డేలే ఆడాడు. గాయాలైతేనేమి, ఫామ్ లేమి అయితేనేమీ పరిమిత ఓవర్ల ఫార్మాట్ నుంచి షమీ మాయమయ్యాడు. ఈ మధ్య కాలంలో భువీ మెరుగవడం,ఉమేష్, బుమ్రా దూసుకురావడంతో షమీ దారులు దాదాపు మూసుకుపోయాయి. వెస్టిండీస్‌తో స్వదేశంలో జరిగిన సిరీస్‌లో అవకాశం వస్తే ఘోరంగా విఫలమ య్యాడు.

మళ్లీ జట్టులో నిలదొక్కుకునేందుకు షమి ప్రయత్నిస్తున్న తరుణంలోనే భార్య హసీన్ సంచలన ఆరోపణలతో మీడియాకెక్కింది. అతడిపై గృహహింస, అత్యాచారం, హత్నాయత్నం ఆరోపణలతో కేసులు పెట్టింది. చివరికి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు కూడా ఆరోపించింది. ఇంకేముంది వస్తున్న అవకాశాలు కూడా షమికి దూరమయ్యాయి.

టాప్‌లోనే కోహ్లీ



- రెండోస్థానంలో టీమిండియా
- ఐసిసి వన్డే ర్యాంకింగ్స్ విడుదల

ముంబయి : ఐసిసి ప్రకటించిన తాజా వన్డే ర్యాకింగ్స్‌లో టీమిండియా రెండో స్థానంలో నిలిచింది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనల్లో టీమిండియా వన్డే సిరీస్‌లను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో టీమిండియా 122 రేటింగ్‌తో రెండో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో ఇంగ్లాండ్ 126 రేటింగ్‌తో తొలి స్థానంలో ఉండగా దక్షిణాఫ్రికా మూడో స్థానంలో ఉంది. బ్యాట్స్‌మెన్ జాబితాలో టీమిండియా సారథి విరాట్ 887 రేటింగ్‌తో తొలి స్థానంలో, తాత్కాలిక సారథి రోహిత్ శర్మ 854రేటింగ్‌తో రెండో స్థానాల్లో కొనసాగుతున్నారు. బౌలింగ్ విభాగంలో టీమిండియా బౌలర్ జస్ప్రీత్ బుమ్రా మొదటి స్థానంలో ఉండగా, కుల్దీప్ నాలుగు, చాహల్ ఐదో స్థానంలో ఉన్నారు.

రాత మార్చిన 2018

గత ఏడాది భారతజట్టు ఆడిన మూడు విదేశీ టెస్టు సిరీస్‌ల్లోనూ షమి సత్తా చాటాడు. 2018లో 13 టెస్టులు ఆడిన షమి 27.14 సగటుతో 49 వికెట్లు తీశాడు. ఇక అందరూ టెస్టులకే షమి పరిమితం అనుకున్నారు. ఈ సందర్భంలో వన్డేల నుంచి బుమ్రాకు విశ్రాంతితో ప్రత్యామ్నాయంగా తుదిజట్టులో చోటు దక్కించుకొని ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో 16 వికెట్లు పడగొట్టి 72 ఏళ్ల చారిత్రక విజయంలో కీలకపాత్ర పోషించాడు. కివీస్‌తో జరిగిన ఐదు వన్డేల సిరీస్‌లో రెండు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లతోపాటు మ్యాన్ ఆప్ ది సిరీస్‌ను చేజిక్కించుకున్నాడు. పేస్ విభాగంలో ఈ ఘనతను అందుకున్న భువనేశ్వర్, బుమ్రా సరసన నిలిచి ప్రపంచకప్‌కు తన స్థానాన్ని పదిలం చేసుకు న్నాడు. ఆల్ ది బెస్ట్ షమి...

అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్‌వేకు
అనుమతులు రావాల్సివుంది

కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అనంతపురం-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే పనులకు పర్యావరణ, అటవీ, వన్యప్రాణుల సంరక్షణ సంస్థలు వంటి వాటినుండి అనుమతులు రావలసి ఉందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ సహాయ మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. చట్టబద్ధమైన అనుమతులన్నింటినీ సంపాదించుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించిందని, అవసరమైన అనుమతులన్నింటినీ పొందిన తర్వాత ఎక్స్‌ప్రెస్‌వే పనులు ప్రారంభం అవుతాయని చెప్పారు. సోమవారం రాజ్యసభలో వైసిపి ఎంపి వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి రాతపూర్వకంగా జవాబిచ్చారు. ఎక్స్‌ప్రెస్‌వేకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైనట్లు చెప్పారు. అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్‌వే అభివృద్ధికి సంబంధించి గత ఏడాది ఆగస్టు 13, అక్టోబర్ 23 తేదీల్లో తమ మంత్రిత్వశాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాధికారులతో రెండు దఫాలుగా చర్చలు జరిపినట్లు మంత్రి చెప్పారు. ఎక్స్‌ప్రెస్‌వే మొదట 100 మీటర్ల వెడల్పుతో నాలుగు లైన్ల రహదారిగా 384 కిలోమీటర్ల మేర నిర్మించాలని నిర్ణయించడం జరిగిందని, భవిష్యత్తులో పెరిగే ట్రాఫిక్ దృష్ట్యా దీనిని 8 లైన్ల రహదారిగా విస్తరించే సౌలభ్యం కూడా కల్పించడం జరిగిందని తెలిపారు. ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ఖర్చులో 50 శాతం భరించడానికి, ఇందుకు ప్రభుత్వ భూమిని ఉచితంగా కేటాయించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించినట్లు మంత్రి చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలో చేపడుతున్న ఈ తరహా ప్రాజెక్ట్‌లకు డిపిఆర్ సిద్ధం అయ్యేనాటికి రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం భూమిని సేకరించి ఉంటే ప్రాజెక్ట్‌ను సత్వరమే చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే ప్రాజెక్ట్ పనులు ప్రారంభించే నాటికి కనీసం 90 శాతం భూసేకరణ జరిగి ఉండాలని తెలిపారు.

మణిహారంలా ఖిల్లా

కొండపల్లి ఫోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేస్తాం : సిఎం



ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

రాష్ట్ర రాజధాని ప్రాంతంలో ఉన్న చారిత్రాత్మక కొండపల్లి ఖిల్లాను ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ.100 కోట్లు కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. త్వరలోనే కొండపల్లి ఫోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ సంస్థను ఏర్పాటు చేసి వచ్చే నాలుగైదేళ్లలో ఈ నిధులను వెచ్చించి ఖిల్లాకు పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. కొండపల్లి ఉత్సవాల చివరి రోజైన సోమవారం ఆయన పాల్గొన్నారు. ఖిల్లాపై రూ.10.90 కోట్ల వ్యయంతో పునరుద్ధరించిన కోటను, 3జి పొజిషన్ మ్యాపింగ్ షోను ఆయన ప్రారంభించారు. అనంతరం ఖిల్లా ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తెలుగు రాజుల ఏలుబడిలో 11వ శతాబ్ద కాలం నుండి ఘనమైన చరిత్ర ఉన్న ఈ ఖిల్లాను రాజధాని అమరావతి ప్రాంతానికి మణిహారంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. రూ.9.50 కోట్ల వ్యయంతో కొండపల్లి కోటకు రావడానికి రహదారి మార్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని, కొండపల్లి గ్రామం నుండి కొండపైకి మెట్ల మార్గాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇబ్రహీంపట్నం వైపు నుండి అమరావతికి రూ.1680 కోట్ల వ్యయంతో కూచి పూడి ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి ఇప్పటికే శంకుస్థాపన చేశామని పేర్కొన్నారు. అదేరీతిలో ఖిల్లా అభివృద్ధికి కూడా రూ.100 కోట్లు కేటాయించి ఆ నిధులను జిల్లా కలెక్టర్, పురావస్తు శాఖ కమిషనర్, అటవీశాఖ అధికారులతో కొండపల్లి ఖిల్లా ఫోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ సంస్థను ఏర్పాటు చేసి నిధులను ఖర్చు చేస్తామని వివరించారు. ఖిల్లా ఉన్న కొండ చుట్టూ 22,500 ఎకరాల మేర భూమి ఉందని, దానిని కూడా అభివృద్ధి చేసి ప్రకృతి వైద్యానికి ఉపయోగపడే విధంగా మొక్కలను పెంచడానికి సన్నాహాలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కొండపల్లి ఖిల్లా ఉత్సవాల పోస్టర్‌ను, ఖిల్లా చరిత్రను తెలుపుతూ ఈమని శివనాగిరెడ్డి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఆర్కియాలజీ కమిషనర్ జి.వాణీమోహన్, పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్‌కుమార్ మీనా, కృష్ణా జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, జాయింట్ కలెక్టర్-2 పి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

జయరామ్ హత్య కేసులో
కీలక ఆధారాలు లభ్యం

డిజిపి ఆర్‌పి. ఠాకూర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చిగురుపాటి జయరామ్ హత్యకేసుకు సంబంధించి కీలక ఆధారాలు లభించాయని డిజిపి ఆర్‌పి. ఠాకూర్ వెల్లడించారు. సోమవారం డిజిపి కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ గతనెల 31న హైదరాబాద్‌లోనే జయరామ్‌ను హత్య చేసి ఇక్కడకు తీసుకొచ్చారని అన్నారు. ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణమని కేసులో దర్యాప్తుపట్ల అపోహలకు తావులేదన్నారు. కేసు విచారణకు 6 బృందాలు ఏర్పాటు చేశామని, ఇప్పటికే విచారణ ఓ కొలిక్కి వచ్చిందని చెప్పారు. ఈ కేసుకు సంబంధమున్న వారెవరినీ ఉపేక్షించేదిలేదని, నిందితులెవరైనా అరెస్ట్ చేస్తామని స్పష్టం చేశారు.



నిరంతర నిఘా పెట్టండి

మానవ అక్రమ రవాణాపై మంత్రి నక్కా ఆనందబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మానవ అక్రమ రవాణా నేరస్తులపై పోలీసులు నిరంతర నిఘా పెట్టాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. మంగళగిరి డిజిపి కార్యాలయంలో సోమవారం అక్రమ రవాణా కేసుల్లో బాధితులను విచారించే (విక్టిమ్ సెంటర్డ్ ఇన్వెస్టిగేషన్) అంశం పై ' ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ (టిఒటి) ' పేరుతో పోలీసు అధికారుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు, పిల్లల అమాయకత్వాన్ని, బలహీనతను ఆసరా చేసుకొని నేరస్తులు అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని, గత పదిహేనేళ్లలో బాధితుల సంఖ్య 45 శాతం పెరిగిందన్నారు. ప్రజ్వల సంస్థ ఫౌండర్ సుమితా కృష్ణన్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా సమస్య ప్రపంచవ్యాప్తంగా 155 దేశాల్లో ఉందన్నారు. మన దేశంలో బాధితుల సంఖ్య తెలుగు రాష్ట్రాల్లోనే ఎక్కువగా ఉన్నారని చెప్పారు. పెరుగుతున్న సాంకేతికతతో పాటు ఈ సమస్య కూడా పెరుగుతోందన్నారు. అయితే ఈ కేసుల్లో శిక్ష పడటం (కన్విక్షన్) 1.6 శాతం కంటే తక్కువగా ఉండటం విచారకరమన్నారు. యుఎస్ కాన్సులేట్ కౌన్సిల్ జనరల్ క్యాథలీన్ బి. హడ్డా మాట్లాడుతూ తమ దేశంలోనూ ఈ సమస్య ఉందన్నారు. మానవ అక్రమ రవాణా అరికట్టేందుకు తమ పోలీస్ శాఖ భాగస్వామ్యంతో ఇరువురూ సంయుక్తంగా ఓ కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రతిపాదించారు. డిజిపి ఆర్‌పి. ఠాకూర్ మాట్లాడుతూ మహిళల రక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని, అందులో భాగంగానే సఖి, చేరువ బృందాలను విజయవాడలో ఏర్పాటు చేశామన్నారు. 44 మంది పోలీసు అధికారులు ఈ శిక్షణకు హాజరయ్యారు.

'ఉపాధి' బకాయిలు రూ.1,872 కోట్లు

రెండు నెలలుగా నిధులివ్వని కేంద్రం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పథకంలో రాష్ట్రానికి రావాల్సిన నిధులు కేంద్రం రెండు నెలలుగా విడుదల చేయకపోవడంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. దీంతో రాష్ట్రంలో ఉపాధి కూలీలకు వేతనాలు సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది. కేంద్రం నుంచి ఉపాధి పథకంలో రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు కింద రూ.1,872.46 కోట్లకు చేరింది. వీటిలో వేతన బకాయి రూ.542.11 కోట్లు, మెటీరియల్ బకాయి రూ.1,330.35 కోటు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ జనవరి 30న ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌ను కలిసి ఉపాధి పథకంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.350 కోట్లు విడుదల మాత్రమే విడుదల చేసేందుకు కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం. గత ఏడాది నవంబరు 15 అనంతరం నిధులను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ విడుదల చేయలేదు. ఉపాధి పథకంలో భాగంగా రాష్ట్రంలో ఇప్పటి వరకూ రూ.7,536.28 కోట్లు పనులు చేయగా వేతనాల మొత్తం రూ.3,973.21 కోట్లు, మెటీరియల్ మొత్తం రూ.3,563.07 కోట్లుగా ఉంది. వేతన బకాయిలు ఎక్కువ మొత్తంలో ఉన్న జిల్లాల్లో అనంతపురం రూ.64.60 కోట్లు, చిత్తూరు రూ.59.35 కోట్లు, ప్రకాశం రూ.56.49 కోట్లు, విశాఖపట్నం రూ.55.64 కోట్లు, కర్నూలు రూ.50.10 కోట్లు ఉన్నాయి. మరోవైపు సాంకేతిక కారణాలతో వేతనాలు చెల్లింపులు నిలిచిపోవడం వల్ల కూలీలు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

నగదు బదిలీ (డిబిటి)లో రూ.19.23 కోట్లు సస్పెండెడ్ మొత్తంగా ఉండగా, రిజెక్ట్ అయిన మొత్తం రూ.7.94 కోట్లు ఉంది. ఈ సమస్యను అధికారులు పరిష్కరించడంలో జాప్యం జరుగుతోందని ప్రజా సంఘాలు విమర్శిస్తున్నాయి.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68